thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 300 కరీంనగర్ మంగళవారం, 6 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కులగణన ఉద్దేశం కేంద్రానికి లేదు

న్యూఢిల్లీ : కులగణనపై కాంగ్రెస్, బీజేపీ నడుమ మళ్లీ విమర్శల యుద్ధం మొదలైంది. జనాభా లెక్కల సేకరణకు కేంద్ర హెూం శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కులగణన ప్రస్తావనే లేదని, అసలది జరిపే ఉద్దేశమే మోదీ ప్రభుత్వానికి లేదని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆరోపించారు. రాజకీయ లబ్ధి పొందాలన్న లక్ష్యం నెరవేరకపోవడంతో ఆ పార్టీ దుష్ప్రచారాలకు దిగుతోందని బీజేపీ మండిపడింది. పైలట్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. కులగణనకు కేంద్రం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. 'ఎన్నో ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కులగణనకు డిమాండ్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం రాహుల్ ఒత్తిడికి తలొగ్గి జనగణనతోపాటే కులగణన చేపడతామని ప్రకటించింది. కానీ క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. జనాభా లెక్కల సేకరణకు రూ.10 వేల కోట్లు అవసరం.



# ఈసారి బడ్జెట్ ఎప్పుడు?..

## సాంప్రదాయానికి భిన్నమేనా..!

ప్రతి ఏడాది ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే పద్ధతిని 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఈ సాంప్రదాయం కొనసాగుతూ వస్తుంది. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 1 (ఆదివారం) వచ్చింది. అయితే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సాంప్రదాయం ప్రకారం ఫిబ్రవరి 1నే ప్రవేశపెడతారా? లేదంటే ఫిబ్రవరి 2కు మారుస్తారా? అన్నది సందిగ్ధం నెలకొంది. అరుణ్ జైట్లీ తీసుకొచ్చిన పద్ధతి ప్రకారం ఆదివారమే నిర్మలమ్మ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై కేంద్ర పెద్దలు గానీ.. నిర్మలమ్మ గానీ ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఇక 2026 ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అంచనా రూ.11 లక్షల కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. మౌలిక సదుపాయాల ప్రాజెక్ట్‌లకు పెద్ద పీట వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా ఈ ఏడాది తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బడ్జెట్ ఉండొచ్చని కూడా వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా నిర్మలమ్మ బడ్జెట్ ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మారాలనే లక్ష్యంలో కేంద్రం అడుగులు వేస్తోంది. ఆ దిశగా కూడా బడ్జెట్ రూపొందించినట్లు సమాచారం. రాబోయే బడ్జెట్‌లో తగిన వనరులను కేటాయించే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఇక రాబోయే బడ్జెట్ సెషన్‌లో ప్రభుత్వం విత్తన బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

## పోలవరం - నల్లమల సాగర్‌పై సుప్రీంలో వాదనలు.. విచారణ 12కి వాయిదా

దిల్లీ: పోలవరం – నల్లమల సాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకో ర్టులో విచారణ జరిగింది. ఏపీ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైం దనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. "ఏపీ ప్రభుత్వం వరద జలాలే వాడుకుంటామని చెబుతోంది. కేటాయింపులకు విరుద్ధంగా నీటి వినియోగం సాధ్యపడదు. ఇందుకు సంబంధించి అనేక విషయాలు ముడిపడి ఉంటాయి. విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ. ప్రాజెక్టులు అన్నీ ఇప్పుడు నిర్మాణంలో ఉన్నాయి. పిటిషన్ దాఖలు తర్వాత కేంద్రం కమిటీని నియమించింది" అని సింఘ్వీ వాదనలు వినిపించారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు.



**అభ్యంతరం ఎందుకు?...** ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. "భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటి? నా ఇల్లు – నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో? సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా.. ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు" అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి వాదించారు. తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు.

## తెలంగాణలో అభివృద్ధి జాడేది.. కాంగ్రెస్ సర్కార్‌పై కవిత ఫైర్




సూర్యాపేట, జనవరి3 : తెలంగాణలో అభివృద్ధి పనులు జరగడం లేదని.. అయిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతోనే ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆరోపణలు చేశారు. ఇవాళ(శనివారం) సూర్యాపేట జిల్లాలో జనం బాటలో భాగంగా కవిత పర్యటించారు. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు కవిత. సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి పనులు ఎక్కడవి అక్కడే ఆగిపోయాయని.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. జిల్లా అభివృద్ధిలో ఎలాంటి పాత్ర పోషించాలనే విషయంపై తాను దృష్టి పెట్టానని చెప్పుకొచ్చారు. అర్వపల్లి మండలంలోని కేజీవీబీ స్కూల్‌ను పరిశీలించానని తెలిపారు. గత ఏడాదిలో తుపాను వచ్చి ఈ స్కూల్ మునిగిపోతే కలెక్టర్ వచ్చి పరిశీలించారని.. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు కవిత. రాష్ట్రంలో పంట కాల్వల మెయింటెనెన్స్ సరిగా లేదని అన్నారు. కాల్వల్లో కంప చెట్లు పెరిగాయని చెప్పుకొచ్చారు. నీళ్లు రాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్న పట్టించుకోరా అని ఫైర్ అయ్యారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగానికి కనీసం నిధులు ఎందుకు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. కోదాడ వరకు నీళ్లు ఇచ్చే డిస్ట్రిబ్యూటరీ కాల్వ 70 కిలోమీటర్లు ఉంటుందని... ఈ కాల్వను సరిగా మెయింటెనెన్స్ ఎందుకు చేయటం లేదని ప్రశ్నించారు. రుద్రమదేవి చెరువు పరిశీలించానని....700 ఎకరాల్లోని ఈ చెరువుకు గోదావరి నీళ్లు రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్- 2లో భాగంగా నల్గొండ జిల్లాలో రిజర్వాయర్లు రావాల్సిన అవసరం ఉందని వివరించారు.

ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరిగేలా రిజర్వాయర్లు కట్టే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించాలని కవిత కోరారు.




# జాతరే.. జాతర..!

## కష్ట పడిన వారికే అందలం!!

## ఆచితూచి అడుగులేస్తున్న అధిష్టానం!!!

అమరావతి : పార్టీ సంస్థాగత బలోపేతంపై హస్తం పార్టీ నేతలు ఫోకస్ చేశారట. అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించే పార్టీ కమిటీల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం నేతలు అచితూచి అడుగులు వేస్తున్నారట. ఇప్పటికే జిల్లా అధ్యక్షులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఈనెలలోనే పార్టీ కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తుందట. జిల్లా, మండల స్థాయి పార్టీ కమిటీలన్నీ సంక్రాంత్రి లోపు ఏర్పాటు చేయాలని హైకమాండ్ భావిస్తుందట. పార్టీ కోసం కష్టపడిన వారికే పార్టీ పదవుల్లో ప్రయారిటీ లభిస్తోందంటున్నారు.

**సంస్థాగత బలోపేతంపై హస్తం పార్టీ నేతలు ఫోకస్...** పార్టీ సంస్థాగత బలోపేతంపై హస్తం పార్టీ నేతలు ఫోకస్ చేశారట. అధికారంలోకి వచ్చిన తర్వాత నియమించే పార్టీ కమిటీల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం నేతలు అచితూచి అడుగులు వేస్తున్నారట. ఇప్పటికే జిల్లా అధ్యక్షులను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఈనెలలోనే పార్టీ కమిటీలను ప్రకటించేందుకు కసరత్తు చేస్తుందట. జిల్లా, మండల స్థాయి పార్టీ కమిటీలన్నీ సంక్రాంత్రి లోపు ఏర్పాటు చేయాలని హైకమాండ్ భావిస్తుందట. పార్టీ కోసం కష్టపడిన వారికే పార్టీ పదవుల్లో ప్రయారిటీ లభిస్తోందంటున్నారు.

**సంస్థాగత బలోపేతంపై కాంగ్రెస్ దృష్టి...** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వ పాలనతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ముఖ్యంగా జిల్లాల్లో జంబో కమిటీల ఏర్పాటు ద్వారా క్షత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌కు కొత్త ఊపిరి పోయాలని అధిష్టానం నిర్ణయించింది. తెలంగాణలో అధికారాన్ని చేపట్టిన రెండేళ్ల తర్వాత, కాంగ్రెస్ పార్టీ తన సంస్థాగత నిర్మాణాన్ని ప్రక్షళన చేసే పనిలో పడింది. కేవలం ప్రభుత్వంపైనే కాకుండా, పార్టీ పటిష్టతపై కూడా ఫోకస్ పెట్టిన అధిష్టానం.. సంక్రాంతి లోపు జిల్లాల్లో పూర్తిస్థాయి కమిటీలను నియమించాలని లక్ష్యంగా పెట్టుకుందట. ఇటీవల కొత్త డీసీసీల ప్రకటించిన పార్టీ.. త్వరలో జిల్లా, మండల స్థాయి కమిటీలన్నీ ఏర్పాటు చేయాలని భావిస్తుందట. ఇందులో భాగంగానే అన్ని జిల్లా పార్టీల్లో కమిటీల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందట.

**ఎక్కువ మందికి అవకాశం కల్పించడానికి జంబో కమిటీలు...** గత పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు సరైన గుర్తింపు ఇవ్వాలనేది పీసీసీ ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. అందుకే ఈసారి పరిమిత సంఖ్యలో కాకుండా, ఎక్కువ మందికి అవకాశం కల్పించేలా జిల్లాల్లో జంబో కమిటీలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారంట. జిల్లా కమిటీలు, మండల కాంగ్రెస్ కమిటీల్లో చురుకైన వారికి చోటు దక్కేలా అడుగులు వేస్తున్నారట. ట్రెజరర్, అధికార ప్రతినిధులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు హెూదాలో కమిటీలు ఏర్పాటు కానున్నాయట.

ఇక ఈ కమిటీల ఏర్పాటు పూర్తి కాగానే ?రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు టాక్. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు?విపక్షల విమర్శలను తిప్పికొట్టడం, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేలా కార్యచరణ సిద్ధం చేస్తున్నారట.

**సంక్రాంతి లోపు జిల్లా కమిటీల నియామకం...** పదవుల కోసం పైరవీలకు తావులేకుండా, నిబద్ధత గల వారికి ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తుందట. సామాజిక సమీకరణాలను పాటిస్తూ, మహిళలకు కూడా తగిన ప్రాధాన్యత ఇచ్చేలా కసరత్తు జరుగుతుందనే నేతల చెబుతున్నారు. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకుని తుది జాబితాను సిద్ధం చేస్తున్నారట. అన్ని జిల్లాల నుంచి లిస్ట్ రెడీ అయితే, సంక్రాంతి పండుగ లోపు లేదా జనవరి రెండో వారం నాటికి ఈ నియామక ప్రక్రియను పూర్తి చేయాలని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారట. పదేళ్ల నిరీక్షణ తర్వాత అధికారంలోకి వచ్చిన హుషారులో ఉన్న క్యాడర్‌కు, ఈ పదవుల పంపకం మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మరి చూడాలి పార్టీలో అందర్ని సంతృప్తి పరిచేలా పదవుల పందారం ఎలా జరుగుతుందో?




## ‘బీఆర్ఎస్ నన్ను ఘోరంగా అవమానించింది’.. మండలిలో కవిత కంటతడి

హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవిత అన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. “బీఆర్ఎస్‌లో ఏ బాధ్యత ఇచ్చినా మనస్ఫూర్తిగా పనిచేశా. పార్టీలో ప్రశ్నిస్తే నాపై కక్షగట్టారు. అక్కడే అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోతే రాష్ట్రంలో ఎలా ఉంటుంది? పార్టీ నన్ను ఘోరంగా అవమానించింది. ఈడీ, సీబీఐలతో పోరాడేటప్పుడు నాకు అండగా నిలవలేదు. కేసీఆర్‌పై కక్షతో భాజపా నన్ను జైలులో పెట్టించింది. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్థూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను”అని కవిత అన్నారు.


**వచ్చే ఎన్నికల్లో ‘జాగృతి’ పోటీ...** ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. “ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. నాది ఆస్తుల పంచాయతీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా” అని కవిత వ్యాఖ్యానించారు.




## “పోలవరం-నల్లమల”ను అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నాం: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: పోలవరం-నల్లమల సాగర్‌ను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు చూపిస్తున్న లేఖకు దీనికి సంబంధం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పోలవరం-నల్లమల.. ఇంటర్‌స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్ఎంబీ)కు లేఖ రాసినట్టు చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. “మా అభిప్రాయంతో జీఆర్ఎంబీ కూడా సమర్థించింది. పోలవరం-నల్లమల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తోంది. సుప్రీంకోర్టులో వాదనలు బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వికి సూచించాం. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసింది. రిట్ పిటిషన్‌లో కాదు, సూట్ పిటిషన్‌లో రావాలని మాకు సుప్రీంకోర్టు సూచించింది. వచ్చే విచారణకు నేను స్వయంగా హాజరవుతా. ఈ కేసులో స్టే ఇవ్వాలని కోర్టును కోరుతాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం ఆగింది. గతంలో ఆగి ఉండే భారాస ప్రభుత్వం ఎందుకు చెప్పలేదు? అతి తెలివితో భారాస తెలంగాణకు భారీ నష్టం చేసింది. పాలమూరు - రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం తెచ్చారు”అని మంత్రి ఉత్తమ్ అన్నారు.

## అది స్పీకర్ పరిధిలోని అంశం: భట్టి విక్రమార్క




హైదరాబాద్: బీఏసీలో అన్ని అంశాలపై చర్చించాలని భారత రాష్ట్ర సమితి పట్టుబట్టిందని, వారి కోరిక మేరకు అన్ని అంశాలపై చర్చ పెడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, పాలమూరు - రంగారెడ్డిపై చర్చ పెడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ భయపడిపోయారని భట్టి విమర్శించారు. ఇబ్బంది అయిన రోజున వాకౌట్ చేశారంటే ఫర్వాలేదు కానీ.. మిగతా రోజులు ఎందుకు సభకు రాలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై చర్చ బీఆర్ఎస్‌కు ముఖ్యం కాదా? అని ఎద్దేవా చేశారు. సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ పరిధిలోని అంశమని తెలిపారు. బీఏసీకి చెందిన ఏ నిర్ణయమైనా స్పీకర్ పరిధిలోనే ఉంటుందన్నారు. మండలిలో ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి లోనైంది నిజమేనని, ఆమె ఏం మాట్లాడారో రికార్డు అయ్యాయని తెలిపారు.

## ఆ 17 మంది లొంగిపోతే మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ: డీజీపీ




హైదరాబాద్: ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో తెలంగాణ వాళ్లు 17 మంది ఉన్నారని, వారంతా లొంగిపోతే మావోయిస్టు రహిత రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. 17 మందిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితోపాటు మరొకరు ఉన్నారని వెల్లడించారు. వారిలోఐదుగురు మహిళలున్నట్లు తెలిపారు. 17 మంది మావోయిస్టులపై మొత్తం రూ.2.25 కోట్ల రివార్డు ఉందన్నారు. వారంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ కగార్ గడువులోపే తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రం అవుతుందని చెప్పారు.




దిల్లీ: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట లభించింది. హరీశ్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావులపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

వారిద్దరికీ వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలో హరీశ్, రాధాకిషన్‌పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను హైకోర్టు క్వాష్ చేసింది. ఈ నేపథ్యంలో ధర్మాసనం స్పందిస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అనంతరం పిటిషన్లను కొట్టివేస్తూ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. శాసనసభలో సోమవారం ఆమె మాట్లాడారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. పట్టణ ప్రాంతాల్లో 130 క్యాంటీన్లు చేసినట్లు వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు.





అమెరికాలో ఓ తెలుగు యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. హైదరాబాద్‌కు చెందిన 27 ఏళ్ల గోడిశాల నిఖిత మేరీల్యాండ్‌లోని తన మాజీ బాయ్‌ఫ్రెండ్ అపార్టుమెంట్‌లో విగతజీవిగా కన్పించింది. కొత్త సంవత్సరం వేడుకల సమయం నుంచి కన్పించకుండా పోయిన ఆమె మృతదేహాన్ని జనవరి 3న పోలీసులు గుర్తించారు. నిఖితను ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ 26 ఏళ్ల అర్జున్ శర్మ హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిఖిత కన్పించడం లేదంటూ జనవరి 2న అర్జున్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను చివరిసారిగా ఆమెను ఎల్లికాట్ సిటీలో డిసెంబరు 31వ తేదీన చూశానని చెప్పాడు. ఈ ఫిర్యాదు చేసిన అర్జున్ అదే రోజు భారత్‌కు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో సెర్చ్ వారెంటు జారీ చేసిన అధికారులు.. అతడి అపార్టుమెంట్‌ను తనిఖీ చేయగా నిఖిత మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. ఆమె శరీరంపై గాయాలున్నాయి. డిసెంబరు 31నే ఆమెను అర్జున్ హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే హత్యకు కారణాలు తెలియరాలేదు. భారత్‌కు పరారైన అర్జున్‌ను గుర్తించేందుకు పోలీసులు ఫెడరల్ అధికారుల సాయం కోరారు. నిఖిత కుటుంబ మూలాలు సికింద్రాబాద్‌లో ఉన్నట్లు ఆమె సోషల్ మీడియా ఖాతాల ఆధారంగా తెలుస్తోంది. నిఖిత మృతిపై అమెరికాలోని భారత ఎంబసీ స్పందించింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆమె కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని పేర్కొంది. కేసు దర్యాప్తునకు సంబంధించి స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. మేరీల్యాండ్‌లోని వెడా హెల్త్‌లో నిఖిత డేటా అండ్ స్ట్రాటజీ అనలిస్ట్‌గా పనిచేసింది. గతేడాది ఫిబ్రవరిలో ఈ కంపెనీలో చేరిన ఆమె.. ఉత్తమ పనితీరుకు గానూ ‘ఆల్-ఇన్ అవార్డు’ అందుకుంది. జేఎన్‌టీయూలో నిఖిత ఫార్మసీ చదువుకుంది. భారత్‌లో మూడేళ్ల పాటు ఓ ప్రముఖ ఆసుపత్రిలో పనిచేసినట్లు ఆమె లింక్డిన్ ఖాతాతో తెలిసింది. అనంతరం మాస్టర్స్ చదువుకునేందుకు అమెరికాకు వెళ్లింది.

## కవిత పార్టీ పెట్టడం వల్ల మాకు నష్టమేమీ లేదు: రామచందర్‌రావు



హైదరాబాద్: తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా మారుతుందని ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. ఎవరైనా పార్టీలు పెట్టుకోవచ్చని అన్నారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని చెప్పారు. ఆమె ఆత్మగౌరవం ఎలా దెబ్బతిందో అది వారి కుటుంబ అంశమని, ఆమె పార్టీ పెట్టడం వల్ల మాకు వచ్చే నష్టం ఏమీ లేదని అన్నారు. ప్రజలు భాజపా వైపు చూస్తున్నారని చెప్పారు. వీబీ జీ రామ్‌ను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడాన్ని రామ్‌చందర్‌రావు వ్యతిరేకించారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎవరికీ మంచి జరగలేదన్నారు. వివిధ రాష్ట్రాల్లో ఉపాధి హామీ పథకంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. పారదర్శకత లేని స్కీమ్‌లే కాంగ్రెస్ ఉండాలని కోరుకుంటుందని విమర్శించారు.

## ప్రాధాన్యం లేకుండానే ఎమ్మెల్సీ పదవి ఇస్తారా?: కవితపై సునీత ఫైర్





హైదరాబాద్: నిజామాబాద్‌లో ఓడిపోతే మీ (కవిత) బాధ చూడలేక కేసీఆర్ పదవి ఇచ్చారని భారత రాష్ట్ర సమితి నేత గొంగిడి సునీత వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో మహిళా నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. “టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడం ఇష్టం లేదని కవిత అన్నారు.. మరి తెలంగాణ జాగృతిని కవిత.. భారత జాగృతిగా ఎందుకు మార్చారు.

పార్టీలో ప్రాధాన్యం లేకుండానే రెండుసార్లు.. ఎమ్మెల్సీ పదవి ఇచ్చారా? తెలంగాణ ఉద్యమకారులను పార్టీ విస్మరించింది అనేది వాస్తవం కాదు. తెలంగాణ ఉద్యమ అమరులను స్మరించుకునేందుకే అమరవీరుల జ్యోతి నిర్మించారు. రాజీనామా చేసిన తర్వాత మండలికి వెళ్లి మాట్లాడారు.. కంటతడి పెట్టారు. కవితను జైలు నుంచి తీసుకొచ్చేందుకు హరీశ్ రావు ఎంతో కృషి చేశారు. కూర్చున్న కొమ్మను నరుక్కొనే ప్రయత్నం కవిత చేశారు. కవిత ఎవరో ఆడించినట్లు ఆడుతున్నారు. కేసీఆర్‌ను విమర్శించి ఆమె భవిష్యత్తును నాశనం చేసుకున్నారు” అని సునీత విమర్శించారు.




న్యూఢిల్లీ, జనవరి 5: దేశ రాజధాని ఢిల్లీలోని లక్ష్మనగర్‌లో దారుణం చోటు చేసుకుంది. జిమ్ కేర్ టేకర్ కొంతమందితో కలిసి ఓ కుటుంబంపై దాడికి పాల్పడ్డాడు. ఇంటి యజమానిని కొట్టి.. అతని భార్యను లైంగికంగా వేధించడమే కాకుండా.. వారి కొడుకుని బట్టలు విప్పి వీధుల వెంట ఉరికించుకుంటూ కొట్టారు. ఈ ఘటన జనవరి 2వ తేదీన చోటు చేసుకోగా.. ఇందుకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ ఇప్పుడు వైరల్ అవుతోంది. అసలేం జరిగింది.. ఈ గొడవ ఎందుకు జరిగింది.. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మనగర్‌లో నివాసం ఉంటున్న రాజేష్ గార్గ్.. తన ఇంటి బేస్‌మెంట్‌లో జిమ్ సెంటర్ రన్ చేస్తున్నాడు. ఈ సెంటర్‌కు సతీష్ యాదవ్ అనే వ్యక్తిని కేర్‌టేకర్‌గా పెట్టుకున్నాడు. అయితే, సతీష్ యాదవ్ ఈ జిమ్ సెంటర్‌ను లాగేసుకుందుకు ప్రయత్నిస్తున్నాడంటూ కొంతకాలంగా వీరిద్దరి మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే జనవరి 2వ తేదీన రాజేష్ గార్గ్, అతని భార్య కలిసి లీక్ అవుతున్న వాటర్ పైప్‌ను పరిశీలించేందుకు ఇంటి సెల్లార్ లోకి వెళ్లారు. ఆ సమయంలో సతీష్ యాదవ్‌కి, రాజేష్‌కి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సతీష్ యాదవ్ తన అనుచరులతో కలిసి రాజేష్, అతని భార్యపై దాడికి పాల్పడ్డారు. రాజేష్ భార్యను లైంగికంగా వేధించారు. వీరి అరుపులు విని కిందకు వచ్చిన రాజేష్ కొడుకును సైతం సతీష్ యాదవ్ గ్యాంగ్ కొట్టింది. అతని బట్టలు విప్పదీసి వీధుల్లో పరుగెత్తించారు. ఈ ఘటనపై రాజేష్ కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. సతీష్ యాదవ్, అతని అనుచరులపై కంప్లైంట్ ఇచ్చారు. బాధితుల ఫిర్యాదు ఆధారంగా సతీష్ యాదవ్, వికాస్ యాదవ్, శుభం యాదవ్, ఓంకార్ యాదవ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. సతీష్‌ను అరెస్ట్ చేయగా.. మిగిలిన వారు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘర్షణకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# తెలుగు సాహిత్యానికి జ్ఞానానందకవి ఎనలేని సేవ - జనవరి 6... ఎస్.టి.జ్ఞానానందకవి వర్ధంతి



తెలుగు పద్య కవులలో జ్ఞానానంద కవి స్థానం విశిష్టమైనది. తెలుగు పద్యానికి వన్నె తెచ్చిన గొప్ప కవి ఆయన. సురగాలి తిమోతి జ్ఞాన నందకవి 1922 జూలై 16వ తేదీన విజయనగరం జిల్లా బలిజిపేట మండలం పెదపెంకి గ్రామంలో సురగాలి ఎలియ్య, పాపమ్మ దంపతులకు జన్మించారు. ఆరవ ఏటనే రచనలు రాయడం ప్రారంభించారు. భీమునిపట్నం బోర్డింగ్ స్కూల్‌లో 8వ తరగతి వరకు విద్యాభ్యాసానంతరం కాకినాడలో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. అనంతరం ఆయన తొలిసారిగా 14వ ఏటనే అప్పటి విశాఖ జిల్లా అలజంగి గ్రామంలో తెలుగు పండితులుగా ఉపాధ్యా య వృత్తిలో చేరి,1982లో పదవీ విరమణ చేశారు. వసంతగానం(1947), గాంధీ (1950), దేశబంధు, పాంచ జన్యము (1956), ప్రభంజనం, పర్జన్యం (తొలి భాగము)(1959), గోల్కొండ, క్రీస్తు చరిత్ర (1963), విజయాభిషేకం (1966), పర్జన్యం (రెండో భాగము)(1969), అక్షరా భిషేకం (1971), ఆమ్రపాలి (1972), అక్షరాక్షతలు (1973), అక్షర గుచ్ఛము (1975), వెలుగు బాట (1976), క్రీస్తు ప్రబంధం (1977), క్రీస్తు ప్రబంధం తొలి భాగము (1992), నా జీవిత గాథ తొలిభాగం (1977), అక్షర పూజ (1979), హరిజనులు అంట రాని వారా (1980), పిల్లన గ్రోవి (1982), రాజధాని (1987), వంశ ధార (1989), ది విజన్ ఇన్ ది వర్డ్స్ ఆఫ్ డాక్టర్ జ్ఞానకవి (1990), కూలి నుండి కళాప్రపూర్ణ వరకు (1988), ధర్మాగ్రహము (1998), వివేకానంద గానం (2004), రెండు వేల పద్యాలతో క్రీస్తు ప్రబంధం, మన దేశం, రోజులు మారాలి (లఘునాటిక) బాపు సందేశం, పిల్లన గ్రోవి, రాజధాని, ఆహ్వానం, రెండంకితాలు, ఆరు దశాబ్దాల కవితా ప్రస్థానం, అభినం దన పద్యగద్య వ్యాస సంపుటిలతో పాటు జ్ఞానందకవి చేసిన పలు రచనలు విశేష ప్రాచుర్యం పొందాయి. విజయవాడలో 1950 మే 20వ తేదీన కవికోకిల, కాకినాడలో 1961ఏప్రిల్ 24న కవిలోక విభూషణ, 1968 నవంబర్ 10వ తేదీన విద్వత్ కవి చూడామణి, 1968 నవంబర్ 15వ తేదీన సాహితీ వల్లభ, 1974 జనవరి 27న మహాకవి, ఆంధ్ర విశ్వ విద్యాలయంలో 1974 ఆగష్టు 3వ తేదీన కళాప్రపూర్ణ, విజయవాడలో 1974 సెప్టెంబర్ 29న తేదీన అభినవ జాషువ, బొబ్బిలి చిలుకల పల్లిలో 1975 సెప్టెంబర్ 28వ తేదీన సాహితీ కృషి వల, 1979 అక్టోబర్ 28న కవి సార్వభౌమ, విశాఖ, రామచంద్ర పురంలో 1982 సెప్టెంబర్ 28వ తేదీన కవితా శ్రీనాధ, 1982లో పద్యవిద్యా ప్రభ, విజయనగరం జిల్లాలో 1987 డిశంబర్ 7న కవితా విశారద, 1988లో నాటి ముఖ్య మంత్రి ఎన్.టి.రామారావు చేతుల మీదుగా కవి సార్వభౌమ బిరుదు పొందారు. 1991లో భారత ప్రభుత్వ పద్మశ్రీ అవార్డు,1991 ఫిబ్రవరి 7వ తేదీన బ్రహ్మి విభూషణ, 1996లో డి.లిట్ స్వీకరించారు. ఆయన రచనలు, జీవితంపై ఐదు విశ్వ విద్యాల యాల్లో పరిశోధనలు జరిగాయి. ఆయన రచనలు పలు విశ్వ విద్యాలయాల్లో పాఠ్యాం శాలుగా ఉన్నాయి. జ్ఞానానందకవి, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ యాక్ట్ రివ్యూ కమిటీ, ఆంధ్రప్రదేశ్ సాహితీ అకాడమీ, ఆంధ్ర విశ్వ విద్యాలయ అకాడమీ కౌన్సిల్, తూర్పు గోదావరి జిల్లా రెడ్‌క్రాస్ సంఘం, తూర్పు గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ సభ్యుడిగా పలు పదవులు నిర్వహించారు. సాహితీ సంస్థలను ఏర్పాటు చేయడంపై ప్రత్యేక శ్రద్ధ కనబరి చారు. 1967లో సాహితీ సమాఖ్య, 1972లో సాహి త్య కళాపీఠం, 1980లో జాషువా కవి సాహిత్య పీఠాల్ని ఏర్పాటు చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ, జెబవాడ గోపాల్ రెడ్డి, ఆచార్య ఎన్జీ రంగ, డాక్టర్ సి నారాయణ రెడ్డి, అయ్యదేవర కాళేశ్వర రావు, డాక్టర్ దివా కర్ల వెంకటావధాని, దేవులపల్లి రామా నుజ రావు, జస్టిస్ ఆవుల సాంబ శివ రావు, డాక్టర్ నందూరి రామ కృష్ణమా చార్య, డాక్టర్ కొలక లూరి ఇనాక్, ఆర్ఎస్ సుదర్శనంలతో పాటు నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రత్యేకంగా అభినందించిన వారిలో ఉన్నారు. భారత దివంగత రాష్ట్రపతి ఆర్ నారాయణన్ నుండి 2000 సంవత్సరంలో జ్ఞానంద కవి అత్యున్నతమైన పద్మశ్రీ అవార్డును స్వీకరించారు. ఆయన 2011 జనవరి 6 తేదీన లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

# సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు - జనవరి 6 : నాదబ్రహ్మ త్యాగయ్య వర్ధంతి



అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమాలను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రిమూర్తు వాగ్గేయకారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీయులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా విఖ్యాతి గాంచిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు. త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాలపై, ఉపనిషత్తులపై ఆయనకున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత శొంఠి గిరిరాజ బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తి సంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్య దంపతులకు త్యాగరాజు మూడవ సంతానంగా జన్మించారు. ఆయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. మూలకనాడు తెలుగు బ్రాహ్మణులు, త్రిలింగ వైదీకులు, ఆయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు. తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువారూర్ నుండి తిరువయ్యారు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగముల అమూల్యగ్రంథా పఠించి, శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించు కున్నారు. తండ్రి చిన్న వయసు నందే స్వర ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహాలను పూజిస్తూ, ఉ ఛ వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రామునిపై కృతులు రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు. 18 ఏళ్ల వయసులో, పార్వతి అనే యువతిని వివాహ మాడారు. పార్వతి చిన్న ప్రాయ మరణంతో, ఆమె సోదరి కమలను పరిణయ మాడారు. సీతా లక్ష్మి అనే కూతురు కలిగింది, ఆమె ద్వారా మనమడు కూడా కలిగాడు. కానీ, మనమడు చిన్నతనం లోనే మృతి చెందడంతో, ఆయనకు వారసులు లేకుండా పోయారు. శొంఠి వెంకట రమణయ్య శిష్యరికంలో 13వ ఏటనే నమో నమో రాఘవా అనే కీర్తనను దేశిక తోడి రాగంలో స్వరపరిచారు. త్యాగరాజు మంచి వైణికులు కూడా. గురువుగారి గృహములో చేసిన కచేరీలో, త్యాగరాజు పంచరత్న కృతులలో ఐదవది అయిన, ఎందరో మహానుభావులు కీర్తన స్వరపరచి గానం చేశారు. త్యాగయ్య గొప్పతనాన్ని గుర్తించిన గురువు, తంజావూరు రాజుకు చెప్పగా, ఆ రాజు ధన, కనక, వస్తు, వాహనాలతో సభకు ఆహ్వానించారు. కానీ తనకు నిధి కన్నా రాముని సన్నిధే సుఖమని భావించి, త్యాగయ్య అన్నింటిని తిరస్కరించారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా, భగవదారాధనకు ఒక సాధనంగానే చూశారాయన. తంజావూరు రాజు కానుకల తిరస్కార ఫలితంగా, సోదరుడు జపేశుడు, త్యాగయ్యనే నిత్య పూజలందుకునే, శ్రీరామ పట్టాభిషేక విగ్రహాలను, కావేరి నదిలో విసిరి వేయగా, శ్రీరామ వియోగాన్ని భరించలేక... దక్షిణ దేశ యాత్రలు చేసి, ఎన్నో ఆలయాలు, తీర్థ క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలో అత్యద్భుత కీర్తనలను రచించారు. "రామేతి మధురం వాచం" అన్నట్లు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి, స్వయంభువ భావనలే కృతి రూపంలో మంచి గాంధర్వగాన మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామికి, దేవ ఋషి అయిన "నారదుడే స్వయంగా సంగీతంలోని రహస్యాలను చెప్పి, "స్వరార్ణవము" ఇచ్చినట్లు, సందర్భంలోని "సాధించెనే మనసా" అనే పంచ రత్న మాలిక లోని మూడవ కృతి చేసినట్లు ప్రాచుర్యంలో ఉన్నది. నారద అనుగ్రహ ఫలితంగానే అనేక విషయాలు గ్రహించి, 24వేల రచనలు, 800కీర్తనలు గావించారు. మంత్రోపదేశంతో స్వర్ణార్ణవం, నారదీయం అనే రెండు సంగీత రహ స్యార్థ శాస్త్ర గ్రంథ రచనలు గావించారు. త్యాగయ్య కృతులను ప్రాపంచికం, తాత్త్వికం, కీర్తనం, నిత్యానుష్ఠానం, అని నాలుగు విధాలుగా గుర్తించారు. వాలాకరకు తెలుగులో రచనలు చేసినా, అవి తెలుగు నాట కన్నా, తమిళ నాట ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. జగదానంద కారక అనే కీర్తన శ్రీరాముని 109 నామాలను ఉటంకిస్తుంది. "జగదానంద కారక (నాట), దుడుకు గల (గౌళ), సాధించినే (ఆరభి), ఎందరో మహాను భావులు (శ్రీ), కన కన రుచిరా (వరాళీ.. అనేవి పంచ రత్న మాలికగా, త్యాగరాజ ఆరాధనోత్సవాలలో ప్రారంభం కీర్తనలుగా గానం చేయ బడతాయి. త్యాగరాజ స్వామి పరమపదించిన దినమైన, పుష్య కృష్ణ పక్ష పంచమి నాడు, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా తమిళనాడు లోని తంజావూరు జిల్లా తిరువయ్యారు లోని, త్యాగయ్య సమాధి ప్రాంగణాన, ఉత్సవాలు ఏటా జరుగుతాయి. త్యాగయ్య 1847 జనవరి 6న తన 79వ ఏట మరణించగా, ఆయన మరణానికి ముందు సన్యాసిగా మారగా, ఆయన భౌతిక కాయాన్ని కావేరీ తీరాన ఖననం చేసి, అక్కడ స్మారక చిహ్నం నిర్మాణం గావించారు. 80 సంవత్సరాల తర్వాత అక్కడే సంస్మరణ కార్యక్రమాలు జరుపగా, 1903 తర్వాత పట్టించుకునే స్థితిలో, ప్రముఖ సంగీత విద్వాంసులైన, ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు తమ గురువు సమాధి దయనీయ స్థితికి చలించి, పునరుద్ధరణ గావించారు. 1905లో త్యాగయ్య వర్ధంతి దినాన తిరువయ్యారులో, అన్నదానం, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. నాటినుండి దేశంలో పలుచోట్ల ఆరాధనోత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నది. అలాగే త్యాగయ్య జన్మదినం రోజున భారతీయ సంగీత దినోత్సవంగా జరుపు కుంటారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

# ఇందిరా గాంధీ హంతకుల ఉరి తీత పూర్వాపరాలు


అమృత సర్ లోని స్వర్ణ దేవాలయం కేంద్రంగా బింద్రన్ వాలా తదితరులు ఉగ్రవాద కార్యకలాపాలు సాగిస్తున్న నేపథ్యంలో, స్వర్ణ దేవాలయాన్ని ఉగ్రవాదుల నుంచి విడిపించే చర్యగా ఆపరేషన్ బ్లూ స్టార్ కు దివంగత ప్రధాని ఇందిరా గాంధీ ఆదేశమిచ్చారు. భింద్రన్ వాలే, అమ్రిక్ సింగ్, షాబేగ్ సింగ్ వంటి ప్రముఖులు సహా, ఆ ఆపరేషన్ లో చాలామంది మరణించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం సైన్యం పక్షాన 79మంది, ఉగ్రవాదుల వైపున 492 మంది మరణించారు. ఐతే ఇతరుల కథనాల ప్రకారం సైనికులు 500 కన్నా ఎక్కువ సంఖ్యలోనూ, ఇతరులు 3వేల మంది, వీరిలో అధిక సంఖ్యాకులు సైనికచర్యలో చిక్కుకు పోయిన సాధారణ భక్తులు, చనిపోయారు. ఈ చర్యకు ప్రతీకారంగా ప్రధాని నివాసంలోనే ఆమె అంగరక్షకులే ఇందిర దారుణ హత్యకు పాల్పడ్డారు. ఈ దారుణ సంఘటన జరిగిన రోజు ఏమి జరిగిందో తెలుసుకుందాం. 1984 అక్టోబర్ 30 మధ్యాహ్నం ఇందిరా గాంధీ చేసిన చివరి ప్రసంగాన్ని ఎప్పటి లాగే ఆమె సమాచార సలహాదారు హెచ్‌వై శారదాప్రసాద్ తయారు చేశారు. ఆరోజు ఆమె ముందుగా తయారు చేసుకున్న ప్రసంగ పాఠం కాకుండా సొంతంగా మాట్లాడారు. ఆమె మాట్లాడే తీరులోనూ మార్పు కనిపించింది. ఇదే ప్రసంగం ఇలా సాగింది: నేనీ రోజు ఇక్కడున్నాను. రేపు బహుశా ఇక్కడ ఉండక పోవచ్చు. నేను ఉంటానా, ఉండనా అన్న దానిపై నాకేమీ బాధ లేదు. నేను సుదీర్ఘ కాలమే జీవించాను. నేను ప్రజాసేవలో నా జీవితాన్ని గడిపినందుకు గర్వపడుతున్నా. నేను నా చివరి శ్వాస వరకూ సేవ చేస్తూనే ఉంటాను. నేను చనిపోతే నా ఒక్కో రక్తం బొట్టూ దేశాన్ని పటిష్టం చేయడానికి తోడ్పడు తుంది.c ఆ రాత్రి ఢిల్లీకి చేరుకునే సరికి ఇందిర బాగా అలసి పోయారు. ఆ రోజు రాత్రి ఆమె చాలా తక్కువ సేపు నిద్రపోయారు. ముందు గదిలో పడుకున్న సోనియా ఉదయం 4 గంటల సమయంలో ఆస్తమా మందు వేసుకోవడం కోసం బాత్రూంకు వెళ్లినప్పుడు ఇందిర మెలకువతోనే ఉన్నారు. ఆమె కూడా తన వెనుకే బాత్రూం వరకూ వచ్చారని, మందు వెదకడంలో తనకు సహాయం చేశారని సోనియా గాంధీ తన పుస్తకం రాజీవ్‌లో రాశారు. మళ్లీ ఇబ్బంది కలిగితే తనను పిలవమనీ, తాను మెలకువ తోనే ఉంటానని ఇందిర తనకు చెప్పారని సోనియా రాశారు. తక్కువ అల్పాహారం తీసుకుని, ఉదయం ఏడున్నరకల్లా ఇందిర తయారయ్యారు. ఆ రోజు ఆమె నల్లటి అంచున్న కాషాయ రంగు చీర కట్టుకున్నారు. మొదటి అపాయింట్‌మెంట్ పీటర్ ఉస్తినోవ్‌తో. ఆయన ఇందిరా గాంధీపై ఒక డాక్యుమెంటరీ తీస్తున్నారు. ఒక రోజు ముందు జరిగిన ఒడిశా పర్యటనలో కూడా ఉస్తినోవ్ ఆమెను చిత్రీకరించారు. మధ్యాహ్నం ఆమె బ్రిటన్ మాజీ ప్రధానమంత్రి జేమ్స్ కాలెఘన్‌ను, మిజోరం నాయకుడొకరిని కలవాల్సి ఉంది. ఆ రాత్రి ఆమె బ్రిటన్ రాకుమారి యాన్‌కు విందు ఇవ్వాల్సి ఉంది. అల్పాహారం తర్వాత మేకప్ మ్యాన్ ఆమె ముఖంపై పౌడర్, బ్లషర్ అద్దుతుండగా డాక్టర్ కేపీ మాథుర్ అక్కడికి చేరుకున్నారు. ఆమెను చూడడానికి ఆయన రోజూ వచ్చే సమయం అదే. ఆమె డాక్టర్ మాథుర్‌ను లోపలికి పిలిచి అక్కడే మాట్లా డారు. తొమ్మిది గంటల 10 నిమిషాలకు ఆమె బయటికి వచ్చినప్పుడు ఎండ తీవ్రంగా ఉంది. ఆమెపై ఎండ పడకుండా ఉండేందుకు ఓ సైనికుడు నారా యణ్ సింగ్ నల్లరంగులో ఉన్న గొడుగును పట్టుకొని ఆమె పక్కన నడుస్తున్నారు. ఆమెకు కొన్ని వెనకాల ఆర్కే ధావన్, ఇందిరా గాంధీ వ్యక్తిగత సహాయకులు నాథు రామ్ ఇంకొంచం వెనుక ఉన్నారు. అందరి కన్నా వెనుక ఆమె ప్రైవేట్ సెక్యూరిటీ ఆఫీసర్ సబ్ ఇన్స్పెక్టర్ రామేశ్వర్ దయాళ్ ఉన్నారు. ఇందిర అక్బర్ రోడ్ వైపు నుంచి వైట్ గేట్ వైపు వెళుతున్నప్పుడు ఆమె ధావన్‌తో మాట్లాడు తున్నారు. ఆరోజున కార్యక్రమాల గురించి ధావన్ ఆమెకు వివరిస్తున్నారు. ఇంతలో అక్కడ డ్యూటీలో ఉన్న ఓ సెక్యూరిటీ గార్డు బియాంత్ సింగ్ రివాల్వర్ తీసి ఇందిరా గాంధీపై కాల్పులు జరిపాడు. బుల్లెట్ ఆమె కడుపులో దిగింది. పాయింట్ బ్లాంక్ రేంజిలో మరో రెండు రౌండ్ల కాల్పులు జరిపాడు. దీంతో ఆమె భుజం, గుండె, వీపుపై తీవ్ర గాయాలయ్యాయి. అక్కడి నుంచి ఐదడుగుల దూరంలో సత్వంత్ సింగ్ తన థమ్సన్ ఆటో కార్బైన్ గన్ పట్టుకొని అక్కడే నిలబడి, ఇందిరా గాంధీ కింద పడుతు న్నప్పుడు దిగ్భ్రాంతి చెంది కదల లేక పోయాడు. బియాంత్ సింగ్ అతనిని కాల్పులు జరపమని గట్టిగా అరిచాడు. సత్వంత్ సింగ్ వెంటనే తన థమ్సన్ ఆటో కార్బైన్ లో ఉన్న మొత్తం 25 బుల్లెట్లను ఆమె శరీరంలోకి దించాడు. అప్పుడు అందరికన్నా వెనకాల నడుస్తూ వచ్చిన రామేశ్వర్ దయాళ్ ముందుకు పరిగెత్తే క్రమంలో ఆయన ఇందిరా గాంధీ దగ్గరకు చేరుకోక ముందే తొడ, కాళ్లపై సత్వంత్ జరిపిన కాల్పులు తో కిందపడి పోయాడు. అప్పుడే బియాంత్ సింగ్, సత్వంత్ సింగ్ తమ ఆయుధాలను కింద పడేసి మేమేం చేయాలను కున్నామో చేసేశాం. ఇప్పుడు మీరు ఏం చేయాలను కుంటున్నారో చేసుకోండి.c అన్నారు. దగ్గరలో ఉన్న ఓ రూమ్ నుంచి ఐటీబీపీ దళాలు పరిగెత్తుకొచ్చి సత్వంత్ సింగ్‌ను అదుపులోకి తీసు కున్నారు. ఎప్పుడూ అక్కడ ఓ అంబులెన్స్ ఉండేది. కానీ, ఆ రోజు డ్రైవర్ ఎందుకో రాలేదు. అప్పుడే ఇందిరా



గాంధీ రాజకీయ సలహాదారు మఖన్ లాల్ ఫోతేదార్ కారు తీయండని అరిచాడు. ఇందిరమ్మను ఆర్కే ధావన్, భద్రతా అధికారి దినేష్ ఇద్దరూ అక్కడి నుంచి లేపి తెల్లటి అంబాసిడర్ కారు వెనుక సీటులో పడుకో బెట్టారు. ముందు సీట్లో ధావన్, ఫోతేదార్, డ్రైవర్ ముగ్గురూ కూర్చున్నారు. సోనియా గాంధీ అరుస్తూ పరిగెత్తుకుని వచ్చారు. రక్తసిక్తమైన ఇందిర తలను సోనియా గాంధీ తన ఒడిలో పెట్టుకున్నారు. కారును వేగంగా ఎయిమ్స్ వైపు కు తీసుళ్లారు. సోనియా గాంధీ గౌన్ ఇందిరా గాంధీ రక్తంతో తడిసి పోయింది. కారు తొమ్మిది గంటల 32 నిమిషాలకు ఎయిమ్స్‌కు చేరింది. ఎమర్జెన్సీ వార్డు గేటు తెరిచి ఇందిరా గాంధీని కారు నుంచి కిందకి దింపేందుకే మూడు నిమిషాల సమయం పట్టింది. అప్పుడు అక్కడ ఒక్క స్ట్రెచర్ కూడా అందుబాటులో లేదు. ఎలాగోలా ఒక స్ట్రెచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందిరా గాంధీని కారు నుంచి బయటకు తీసుకు వస్తున్నప్పుడు అక్కడున్న డాక్టర్లు కంగారు పడుతూ, వెంటనే ఎయిమ్స్ సీనియర్ కార్డియాలజిస్ట్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. కొద్ది నిమిషాల్లోనే డాక్టర్ గులేరియా, డాక్టర్ ఎంఎం కపూర్, డాక్టర్ ఎస్ బలరాం అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఎలక్ట్ కార్డియోగ్రామ్‌లో ఇందిరా గాంధీ గుండె ఎక్కువ పని చేస్తున్నట్లుగా చూపిస్తోంది కానీ పల్స్ రేట్ మాత్రం చూపించడం లేదు. ఒక డాక్టరు ఆమె ఊపిరి తిత్తులకు ఆక్సిజన్ చేరాలని, ఆమె మెదడు పని చేయాలని ఆమె నోటి ద్వారా శ్వాస నాళంలోకి ఒక ట్యూబు వేశాడు. ఇందిరా గాంధీ శరీరంలోకి 80 బాటిళ్ల రక్తాన్ని ఎక్కించారు. ఆమెను చూసిన వెంటనే ఆమె ఇక లేరని అనుకున్నారు. దాన్ని నిర్ధారించేందుకు ఈసీజీ స్కానింగ్ చేశాం. అప్పుడే అక్కడున్న ఆరోగ్య శాఖ మంత్రి శంకరానందన్‌ను ఇప్పుడేం చేద్దాం అని అడిగా. ఆమె మరణించారని ప్రకటించాలా? అని అడిగితే ఆయన వద్దన్నారు. ఆ తర్వాత ఆమెను ఆపరేషన్ థియేటర్‌లో తీసుకెళ్లాం అని డాక్టర్ గులేరియా పేర్కొన్నారు. డాక్టర్లు ఆమె శరీరాన్ని హార్ట్ అండ్ లంగ్ మెషీన్‌పై పెట్టారు. ఈ మెషీన్ వల్లే ఆమె రక్త ఉష్ణోగ్రత 37 డిగ్రీల నుండి 31 డిగ్రీలకు పడిపోయింది. ఆమె చనిపోయారని తెలిసినా ఎయిమ్స్ ఎనిమిదో అంతస్తుపై ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఆమెను తీసుళ్లారు. కాల్పులతో ఆమె కాలేయంలో కుడి భాగం ఛిద్రమైందని నిర్ధారించారు. ఆమె పెద్ద ప్రేగులో దాదాపు 12 రంధ్రాలు ఏర్పడ్డాయి. చిన్న ప్రేగు కూడా దారుణంగా దెబ్బతింది. ఓ ఊపిరితిత్తి లోకి బుల్లెట్ దూసుకెళ్లింది. బుల్లెట్ల తో ఆమె వెన్నెముక కూడా దెబ్బతింది. కేవలం ఆమె గుండె మాత్రమే సురక్షితంగా ఉంది. ఇందిర మరణించారని కాల్పులు జరిపిన నాలుగు గంటల తర్వాత ప్రకటించారు. దాదాపు రెండు గంటల 23 నిమిషాలకు ఇందిరా గాంధీ మృతి చెందినట్లు ప్రకటించారు. ఇందిరా గాంధీపై జరిగిన దాడి జరగొచ్చనే విషయంపై ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ముందే ఆందోళన వ్యక్తం చేశాయని ఇందిరా గాంధీ జీవిత చరిత్ర రాసిన ఇందర్ మల్హోత్రా పేర్కొన్నారు. సిక్కు భద్రతా సిబ్బందిని మొత్తం ఆమె ఇంటి నుంచి తీసేయాలని ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సిఫారసు కూడా చేశాయి. కానీ దీనికి సంబంధించిన ఫైలు ఇందిరా గాంధీ వద్దకు వెళ్లిన పుడు ఆమె ఆగ్రహించి (ఆరెంట్ వి సెక్యులర్ ? (మేము లౌకిక వాదు కులం కామా?) అని ప్రశ్నించారు. ఆ తర్వాత ఒకేసారి ఇద్దరు సిక్కు భద్రతా సిబ్బందిని ఆమె వద్ద డ్యూటీలో ఉంచ కూడదని నిర్ణయించారు. సందర్భం కలిసొచ్చి బియాంత్, సత్వంత్ ఇద్దరూ ఒకేచోట ఉండి ఆపరేషన్ బ్లూ స్టార్ కి ఇందిరా గాంధీపై ప్రతీకారం తీర్చుకున్నారు. ఇందిరా గాంధీ హత్య కేసులో నిందితులకు చివరకు ఉరిశిక్ష విధించ బడింది. ఐదేండ్ల తర్వాత ఇందిరా గాంధీని చంపారన్న నేరారోపణలపై తీహార్ జైలులో బియాంత్‌సింగ్, సత్వంత్ సింగ్, కేహర్ సింగ్ ముగ్గురికి జనవరి 6 జనవరి 1989న శిక్ష అమలు చేయబడింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

# బహుముఖ ప్రజ్ఞాశాలి బాడిగ నరసింహారావు

## జనవరి 6. బాలబంధు బాడిగ వెంకట నరసింహారావు వర్ధంతి



ఆయన నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వర్ కు నట జీవిత ఆరంభం లో స్త్రీ పాత్ర ధారణలో అభినయం నేర్పారు. ఆయన నటి సావిత్రికి నృత్యంలో శిక్షణ ఇచ్చారు. బందా, స్థానం, బళ్ళారి, సిఎస్ఆర్, కస్తూరి, రేలంగి లాంటి మేటి నటులతో కలిసి నటించారు. కవి సామ్రాట్ విశ్వనాథచే తన నాట్యానికి భావ నాట్యం అనే పేరు పెట్టబడి, హరికథ పితామహుడు ఆదిభట్ల నారాయణ దాసు అతి కవితాశీ స్సులు, స్థానం నరసింహా రావుచే బంగారు పతకం అందుకున్నారు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, నండూరి వంటి కవుల గీతాలకు నాట్యాన్ని కూర్చారు. స్త్రీ పాత్ర ధారణలో సాటిలేని మేటి అనిపించు కున్నారు. ఆయనే బహుముఖ ప్రజ్ఞాశాలి బాడిగ వెంకట నరసింహారావు. ఒకటిన్నర శతాబ్దాల తెలుగు నాటక రంగ చరిత్రలో ప్రత్యేక స్థానం పొందిన గుడివాడ నాటక రంగం. పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక నాటకాల ప్రదర్శనలకు కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచింది. ఎందరో నటులు, నటీమణులు, సంగీత విద్వాంసులు, నృత్యకారులు, రచయితలు, చిత్రకారులు, జానపద కళాకారులు, నాటక సంస్థలు, డ్రామా ఫైన్ ఆర్ట్స్ కంపెనీలు, వివిధ వాయిద్య కారులతో సుసంపన్న మయింది. వెండితెరకు తళుకు లీనిన తారలను, నేపథ్య సంగీతానికి, గానానికి ఆభరణ మరమైన స్వరాన్ని అలంకరించింది గుడివాడ. బీవి స్వగ్రామం కొతవరం అయినా, గుడివాడ లో స్థిర నివాసం ఏర్పర చుకొని కళాకా రునిగా ప్రసిద్ధి కెక్కారు బి.వి.నర సింహారావుగా లబ్ధ ప్రతిష్టులయిన బాడిగ వెంకట నరసింహారావు. 1913 ఆగస్టు 15న కృష్ణాజిల్లా కొతరం గ్రామంలో జన్మించిన బి.వి. వందల సంఖ్యలో బాలగేయాలు రాశారు. కథలు, నాటికలు, గేయ నాటికలు, బాల సాహిత్యంపై అనేక వ్యాసాలు రాశారు. బాల సాహిత్యం తయారు చేయడమే గాక, ఆడి, పాడి ప్రచారం చేశారు. బాడిగ వెంకట నరసింహా రావు (ఆగస్టు 15, 1913 – జనవరి 6, 1994) బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రముఖ కవి, సాహితీ వేత్త, బాల సాహిత్య కారుడు, నటుడు, నాట్యా చార్యుడు, చిత్రకారుడు, బాల గేయ రచయితగా గుడివాడ పేరును దేశమంతటా చాటిన బహుముఖ ప్రజ్ఞాశాలి. రంగస్థలం మీద స్త్రీ వేషధారణ చేయటంలో అందెవేసిన చేయి. వెండి తెర వేల్పులు... అక్కినేని నాగేశ్వర్ రావు కు ఆడవేషాలు వేసే కాలంలో అభిన యంలో ఆయన శిక్షణ ఇచ్చారు. మహా నటి సావిత్రికి నృత్యంలో శిక్షణ ఇచ్చిన గురు వీరే కావడం విశేషం. ఆభినయం, సంగీ తం, చిత్రలేఖనం పుట్టుకతో ప్రాప్తిం చాయి. తోటి పిల్లలతో కలిసి అష్టా పులి, హరిశంద్ర, ధ్రువ, మొదల యిన చిన్న నాటకాలు వేయడంతో ప్రారంభమయింది బి.వి. రంగస్థల జీవితం. కాకినాడ ఆంధ్ర సేవా సంఘంలో ఉప్పల కృష్ణా శివరావు, రేలంగి వెంకట్రామయ్య ఆయనకు సహా ధ్యాయులుగా ఉండేవారు. గయో పాఖ్యానం లోని కృష్ణార్జునుల సంవాదాన్ని పరబ్రహ్మ శాస్త్రి వేయించారు. ఇందులో అర్జును డుగా బి.వి నటించారు. గజేంద్ర మోక్షం కథ గీతాన్ని ఆనంద భైరవి రాగాన్ని, ఆది తాళంలో నేర్చు కున్నారు. కూచిపూడి భాగవతుల యక్ష గానాలు, దేవదాసి నృత్యం, చూసిందే తడవుగా అభినయించే వారు. కిలాంబిక్రిష్ణమాచార్యులు వద్ద అనార్కలి నాట్య శిక్షణ తీసు కున్నారు బి.వి. తులాభారం లో సత్యభామ, రుక్మాంగదలో మోహిని, చింతామణిలో చింతా మణి, పాత్రాభినయాన్ని కళ్లగా అభ్యసించి ప్రదర్శించారు. 1940లో మద్రాసు ఆంధ్ర సంఘం లో బి.వి సరసన సలీంగా బందా కనక లింగేశ్వర రావు నటించారు. స్థానం నరసింహారావు, బళ్ళారి రాఘవ, సిఎస్ఆర్ , నగరాజారావు, కస్తూరి శివరావు, రేలంగి వెంకట్రా మయ్య, మొదలయిన గొప్ప నటులతో కలిసి ఎన్నో స్త్రీ పాత్రలు లో నటించారు. క్షణం లో చీర సింగారించు కోవటం ఆయనకే సొంతం. సినీ నటి సావిత్రికి నృత్యంలో, అక్కినేనికి ఆడవేషాలు వేసే కాలంలో అభినయంలో శిక్షణ ఇచ్చారు. ఆంధ్ర జాలరి సంపత్ కుమార్ ఆయన ప్రశిష్యులు. అంతర్జాతీయ ఖ్యాతి పొందిన కోరాడ నరసింహా రావు బి. కి.సి ఏకలవ్య శిష్యుడు. చల్లపల్లి, ముక్త్యాల, జయంతి పురం, బొబ్బిలి, వేమయ్య పేట, సంస్థానాలలో జానపద నాట్యం చేశారు. బందరు టౌన్ హాల్ లో మునిమాణిక్యం నరసింహారావు బి.వి. నాట్య ప్రదర్శన ఏర్పాటు చేసారు. ఆనాటి ప్రదర్శనకు చిత్రకారుడు, రచయిత అడవి బాపిరాజు వ్యాఖ్యాత. బి.బి. నాట్యం తిలకించిన కవి సామ్రాట్ విశ్వనాథ ఆయన నాట్యానికి భావనాట్యం అని పేరు పెట్టారు. 1942లో పాలకొల్లులో బి.వి. నాట్యాన్ని తిలకించిన ఆదిభట్ల నారాయణ దాసు మనసు పులకించి ఆశువుగా పద్యం చెప్పి ఆశీర్వదించారు. 1944లో బందరు నాటక కళా పరిషత్తు లో స్థానం నరసింహా రావు, బి.వి నాట్యానికి ముగ్ధులై బంగారు పతక మిచ్చారు. బి.వి. ఏకబిగిన మూడు గంటల ప్రదర్శన చేసే వారు. దాదాపు 30 ఏళ్లపాటు నాట్య రంగానికి బి.వి. విశేషసేవ చేశారు. జానపదాలకు నాట్యాభినయం కూర్చారు. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, నండూరి వంటి కవుల గీతాలకు నాట్యాన్ని కూర్చారు. బాలరసాలు, పాలబడి పాటలు, ఆవు – హరి శ్చంద్ర, విరిసిన పూలు, నా కథలు, ప్రియదర్శి, బాలతరం, చిన్నారి లోకం, పూల బాలలు, ముత్యాల వంటి 17 పుస్తకాలు రచించారు. బి.వి. తనకు చాలా రాసిన బేలలను పుస్తకంగా వెలువరించారు. 1958 నుండి నాట్య ప్రదర్శనలు ఇవ్వటం ఆపేసి బాల రచయితగా మారి పేరు ప్రఖ్యాతులు గాంచారు. సామాన్య కుటుంబం నుండి బహు ముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగిన బివి 1968లో ఉద్యోగ విరమణ చేసి గుడివాడలో స్థిర నివాసం ఏర్పరచు కొని వివిధ రకాల సేవలు అందిస్తూ, శేష జీవితాన్ని గడిపారు. పిల్లల కోసం ఎన్నో రచనలు చేసి బాల బంధు గా సత్కరించ బడ్డారు. ఆయన రచించిన పాల బడి పాటలకు 1958లో జాతీయ బహుమతి పొందింది. 1975లో ప్రపంచ తెలుగు మహా సభలలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ 'బాలబంధు' బిరుదాన్ని వారికి ప్రసాదించింది. భారత కళా నిధి గా బిరుదు పొందిన బివి, తమ సన్నిహితులు, ఆప్త మిత్రులు గుడిపాటి వెంకట చలం శత జయంతి సభకు అధ్యక్షత వహించి విజయవాడ పుస్తక మహోత్సవం వేదిక పైనుండి ప్రసంగిస్తూ, గుండె పోటుకు గురై,1994 జనవరి 6న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

# ఆధునిక జన్యుశాస్త్ర పితామహుడు...గ్రెగర్ జోహన్ మెండల్ - జనవరి 6...గ్రెగర్ జోహన్ మెండల్ వర్ధంతి

గ్రెగర్ జోహన్ మెండల్ 19వ శతాబ్దంలో జీవశాస్త్రానికి పునాది వేసిన శాస్త్రవేత్త. ఆయన తన సాంకేతిక పరిశోధనల ద్వారా జీవుల జన్యు లక్షణాల సంక్రమణను అర్థం చేసుకుని, ఆధునిక జన్యుశాస్త్రానికి దిశానిర్దేశం చేశారు.

**మెండల్ జీవిత నేపథ్యం...** గ్రెగర్ జోహన్ మెండల్ 1822 జూలై 20న ఆస్ట్రియాలోని హెన్జెండర్ఫ్ గ్రామంలో పుట్టారు. ఆయన ఒక సామాన్య రైతు కుటుంబానికి చెందినవారు. చిన్ననాటి నుంచే మెండల్ చదువుపై ఆసక్తిని కనబరిచారు. వాతావరణం, వృక్షశాస్త్రం, గణితశాస్త్రంలో ఉన్నత శ్రేణి విద్యను పొందటానికి వియన్నా విశ్వవిద్యాలయంలో చేరి విద్యాభ్యాసం పూర్తి చేశారు. తరువాత బౌద్ధ సన్యాసిగా మారి ఆగస్ట్ విన్ అనే మఠంలో చేరి, అక్కడ తన శాస్త్ర పరిశోధనలకు సమయం కేటాయించారు.

**మెండల్ ప్రయోగాలు...** మెండల్ తన పరిశోధనలకు పిసం సటైవం (పెసలు మొక్కలు) ను ఎంచుకున్నారు. ఇవి తక్కువ సమయంలో సంతానం ఇస్తాయి, స్పష్టమైన లక్షణాలు కలిగి ఉంటాయి, సంకరీకరణకు అనువుగా ఉంటాయి.

**ఎందుకు పెసలు మొక్కలే?** పెరుగుదల త్వరితగతిన ఉంటుంది. వీటిలో పుష్పాలు స్వీయసంకరీకరణకు అనువుగా ఉంటాయి. విత్తనాల రంగు, ఆకారం, పుష్పాల రంగు వంటి స్పష్టమైన లక్షణాలు ఉంటాయి.

**మెండల్ ప్రయోగ విధానం...** స్వీయ సంకరీకరణ: మొదట మెండల్ స్వచ్ఛమైన రకాలను తీసుకుని స్వీయసంకరీకరణ జరిపారు. సంకరీకరణ: తల్లిదండ్రులుగా విభిన్న లక్షణాలున్న మొక్కలతో సంకరీకరణ చేసి, వాటి సంతానం (ఫ్1 తరగతి) ను పరిశీలించారు. ద్వితీయ తరగతి (ఫ్2): ఫ్1 తరగతిలోని మొక్కల స్వీయసంకరీకరణ ద్వారా ఫ్2 తరగతి సంతానాన్ని పరిశీలించారు.

**మెండల్ గమనించిన లక్షణాలు...** మెండల్ తన ప్రయోగాలలో ఏడు ముఖ్య లక్షణాలను గుర్తించారు, వాటిలో ముఖ్యమైనవి:విత్తనాల రంగు (పసుపు లేదా ఆకుపచ్చ), విత్తనాల ఆకారం (గుండ్రంగా లేదా ముడతలతో), పుష్పాల రంగు (పర్పుల్ లేదా తెలుపు), కాండం పొడవు (తక్కువ లేదా ఎక్కువ).

**మెండల్ సూత్రాలు...** మెండల్ తన పరిశోధనల ఆధారంగా మూడు ప్రధాన సూత్రాలను ప్రతిపాదించారు. లక్షణాల విడిపోయే సూత్రం: ప్రతి తల్లిదండ్రుల నుంచి వచ్చే లక్షణాలు సంతానంలో విడిపోతాయి. ఈ సూత్రం ప్రతి లక్షణం రెండు జన్యువుల ఆధారంగా నియంత్రితమవుతుందని సూచిస్తుంది.

**స్వతంత్ర లక్షణాల వేరుపు సూత్రం:** ఒక లక్షణం సంక్రమణ మరొక లక్షణంపై ప్రభావం చూపదు. జన్యువులు స్వతంత్రంగా తరతరాల మధ్య సంక్రమిస్తాయి.

**ఆధిపత్య సూత్రం :** కొన్ని జన్యువులు ప్రబలంగా (ఆధిపత్యం) ఉంటాయి, మరికొన్ని అణచి వేయబడతాయి (=వఫియంటాజవ).

**మెండల్ పరిశోధనల ప్రాముఖ్యత...** మెండల్ పరిశోధనలు ఆయన కాలంలో పెద్దగా గుర్తింపు పొందలేదు. 1900లో, దాదాపు 16 సంవత్సరాల తరువాత, హ్యూగో డివ్రీస్, కార్ల్ కొరెన్స్, ఎరిక్ వాన్ చెర్మాక్ అనే శాస్త్రవేత్తలు మెండల్ పరిశోధనలను తిరిగి గుర్తించి ప్రచారం చేశారు.

**ప్రభావం:** జన్యు ఇంజనీరింగ్, క్రాస్బ్రీడింగ్, క్లోనింగ్ వంటి ఆధునిక సాంకేతికతల అభివృద్ధికి మెండల్ సిద్ధాంతాలు పునాది వేశాయి. మెండల్ సూత్రాలు బహుళ జీవాల జాతుల వారసత్వం గురించి లోతుగా అర్థం చేసుకోవడానికి ఉపయోగ పడుతున్నాయి.

**మెండల్ చివరి దశ:** గ్రెగర్ జోహన్ మెండల్ 1884 జనవరి 6న మరణించారు. ఆయన జీవితం ఆయన పరిశోధనల కంటే తక్కువ ప్రాచుర్యం పొందింది, కానీ మరణానంతరం ప్రపంచం ఆయన విలువను గుర్తించింది. జన్యుశాస్త్ర పితామహుడు గా ఆయనకు గుర్తింపు లభించింది. మెండల్ కృషి ద్వారా జీవుల వారసత్వం, సంక్రమణ గురించి మనం తెలియని అనేక విషయాలను తెలుసు కున్నాము. ఈ జ్ఞానం ఆధునిక జీవశాస్త్రానికి దిశానిర్దేశం చేసింది. మెండల్ జీవితాన్ని శ్రద్ధగా అధ్యయనం చేయడం, శాస్త్రవేత్తలకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

## సంపాదకీయం

### మీడియాలో 'స్తబ్దత'.. మంచిదేనా?

రెండు తెలుగు రాష్ట్రాలలోనే కాదు.. దేశవ్యాప్తంగా కూడా మీడియాలో ఒక స్తబ్దత రాజ్యమేలుతోంది!. ఇది మీడియా అంటే గిట్టని వారు.. మీడియా పై నిందలు వేసే వారు చెబుతున్న మాట కాదు. ఐక్యరాజ్యసమితి లోని మీడియా విభాగం ప్రపంచ స్థాయి మీడియాపై చేసి సర్వేలో ఇటీవల వెల్లడించిన విషయాలు. భారత దేశానికి వచ్చే సరికి.. ఒక స్తబ్దత రాజ్యమేలుతోందన్నది ఈ సర్వే సారాంశం. ముఖ్యంగా భావప్రకటనా స్వచ్ఛకు అగ్రతాంబూలం ఇచ్చే భారత్ వంటి దేశాల్లో.. మీడియాకు ప్రాధాన్యం ఉంది. కానీ, 2014 తర్వాత.. ఎందుకో.. మీడియా స్తబ్దతకు తార్కాణంగా మారిందన్నది ఐక్యరాజ్యసమితి చేసిన విశ్లేషణ. అంతేకాదు.. భారత్‌లో చోటు చేసుకున్న అనేక పరిణామాలను.. ప్రపంచ దేశాలకు చెందిన మీడియా ప్రాజెక్టు చేసేవరకు కూడా బయటకు రాకపోవడాన్ని ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి నివేదిక స్పష్టం చేయడం గమనార్హం. ఉదాహరణకు ఏపీలో జరిగిన సెకి ఒప్పందం.. ఈ క్రమంలో చేతులు మారిన సొమ్ము.. వంటివి అమెరికా పత్రిక వాషింగ్టన్ పోస్టు వెలికి తీసే వరకు బయటకు రాలేదు. అదేవిధంగా ఇటీవల గౌతం అదానీకి.. ఎల్ ఐసీ షేర్లను బదలాయిస్తున్న వ్యవహారం కూడా.. ఫ్రెంచ్ పత్రిక బయట పెట్టే వరకు వెలుగు చూడని విషయాన్ని కూడా ఐక్యరాజ్య సమితి ప్రస్తావించింది. ఇవి మీడియాలో నెలకొన్న స్తబ్దతకు ఉదాహరణలని పేర్కొంది. ఇదేసమయంలో 2014కు ముందు 2-జీ స్పెక్ట్రం కుంభకోణం స్థానిక మీడియా ద్వారానే వెలుగు చూసిన విషయాన్ని ప్రస్తావించింది. ఇక, ప్రత్యేకంగా పేర్కొనకపోయినా.. స్థానిక మీడియా సంస్థల్లోనూ విధానపర మైన పక్షపాతం (ఆర్గనైజేషనల్ పెరాలిసిస్) కొనసాగుతోందని సమితి తెలిపింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు ఇబ్బంది కలిగించే అంశమని అభిప్రాయపడడం గమనార్హం. అయితే.. ఒక్క భారత్‌లోనే ఇలా ఉందా? ఇతర దేశాల్లో లేదా? అనే ప్రశ్నలకు కూడా సమాధానం చెబుతూ.. విశ్వగురుగా ప్రపంచ దేశాలకు దిశానిర్దేశం చేస్తున్న భారత్‌ను తలమానికంగా భావిస్తున్నట్టు పేర్కొనడం గమనార్హం.


# వెండి తెరపై వెన్నెల కురిపించిన వెన్నెలకంటి - జనవరి 5.. వెన్నెలకంటి వర్ధంతి



ప్రఖ్యాత సినీ గేయ రచయిత వెన్నెలకంటి వెన్నెలకంటి రాజేశ్వర ప్రసాద్. అయితే వెన్నెలకంటి గానే అయన సుపరి చితులు. మాటరాని మౌనమిది... మౌనవీణ గానమిది పాట వినగానే వెంటనే స్ఫురణకు వచ్చేది ఆయనే. ఆయన నవంబర్ 30న నెల్లూరులో జన్మించారు. పూర్తిపేరు వెన్నెలకంటి వెంకట శివ సుబ్రహ్మణ్య రాజేశ్వర ప్రసాద్. స్కూల్ రికార్డుల్లో మాత్రం వెన్నెలకంటి సుబ్బు రాజేశ్వర ప్రసాదః అని ఉంది. హరికథలు, అత్యాత్మిక ప్రసంగాలు వినడం అంటే చాలా ఇష్టపడే వారు. కాలేజి రోజుల్లో ‹రస వినోదిని› రేడియో ప్రసంగాలు వినేవారు. 11 ఏళ్లకే కవితలు, పద్యాలూ రాశారు. పదకొండో ఏట ఒకేరోజు 108 భక్తి పద్యాలు రాశారు. టీనేజీ లోకి వచ్చేసరికి నేను ఎక్కువగా సామాజిక స్పృహతో అభ్యుద య కవిత్వం రాయడం మొదలలు పెట్టారు. నూనూగు మీసాల వయసు లోనే సినిమా రైటర్ కావాలని అనుకున్నారు. బికాం చదవడం పూర్తికాగానే బ్యాంకు పరీక్షలు రాసి, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా లో క్లర్క్ అండ్ క్యాషియర్ జాబ్ సంపాదిం చారు. 1975లో విజయవాడ రేడియో కేంద్రం కవితల పోటీలలో 9 కవితలు సెలెక్టు అయ్యాయి. జంధ్యాల రాసిన ఏక్ దిన్కా సుల్తాన్, ఈ చరిత్ర ఏ సిరాతో, ఎవ్వనిచే జనించు, దర్పణం వంటి నాటకాలలో నటించారు. శ్రీరామ చంద్రుడు సినిమా ప్రొడ్యూసర్ ప్రభాకర్‌రెడ్డి... బిడ్డకోసం ఇద్దరు తల్లులు పాడే లాలిపాట రాయమని అడిగారు. ప్రభాకర్ రెడ్డి చొరవ, ప్రోత్సాహం కారణంగా శ్రీరామ చంద్రుడు సినిమాలో చిన్ని చిన్ని కన్నయ్యకు వెన్నెల జోల పాట రాయడం ద్వారా తెలుగు చిత్ర సీమలో గీత రచయితగా పరిచయం అయ్యారు. తరువాత అన్నా చెల్లెలులో పాటలు వ్రాసారు. నాయకుడు సినిమాతో అనువాదంలో ప్రవేశించారు. ప్రేమాగ్ని సినిమాకు తెలుగులో మాటలు వ్రాసారు. కమల్ హాసన్ కు సత్యభామ సినిమాకు డబ్బింగు వ్రాసారు. భామనే సత్య భామఃతో మొదలైంది డబ్బింగ్ ప్రస్థానం. 300 సినిమాలకు మాటలను డబ్ చేశారు. సుమారు మూడు వేల పాటలను తెలుగు లోకి మార్చారు. చైనీస్ సినిమాకు కూడా డబ్ చేశారు. సుమారు 2000 పాటలు వ్రాసారు. ఎస్పీ బాలు వెన్నెలకంటి ని చక్రవర్తికి పరిచయం చేసి.. ఇతని పాటలు నచ్చితేనే అవకాశ మివ్వండి అని చెప్పారు. ఆయనకు వెన్నెలకంటి పాటలు నచ్చడం, వరుసగా అవకాశా లివ్వడంతో మిగతా సంగీత దర్శకులూ పాటలు రాయించు కోవడం మొదలు పెట్టారు. తాను ఈ స్థితిలో ఉన్నానంటే దానికి కారణం కేవలం బాలూగారే. ఆయన నాకు తల్లి దండ్రుల కన్నా ఎక్కువ అని వెన్నెలకంటి చెపుతుండే వారు. 2021 జనవరి 5న వెన్నెలకంటి (63) తీవ్రమైన గుండెపోటు రావడంతో చెన్నైలో తుదిశ్వాస విడిచారు. బిరియాని (2013), ఆవారా (2010), ఆకాశమంత (2009), ఒక్క మగాడు (2007), కొంచెం టచ్ లో ఉంటే చెపుతాను (2005), చంద్రముఖి (2005), పల్నాటి బ్రహ్మానాయుడు (2003), టక్కరి దొంగ (2002), నరసింహా నాయుడు (2001), అన్నయ్య (2000), సమర సింహా రెడ్డి (1999),శీను (1999), దెయ్యం (1996), శ్రీకృష్ణార్జున విజయం (1996), భైరవ ద్వీపం (1994), ముగ్గురు మొనగాళ్ళు (1994), వన్ బై టూ (1993), అల్లరి ప్రియుడు (1993), స్వాతి కిరణం (1992), ఆదిత్య 369 (1991), ఏప్రిల్ 1 విడుదల (1991), తేనెటీగ (1991), భార్గవ్ (1991), శ్రీరామ చంద్రుడు (1989), చెట్టుకింద ప్లీడరు (1989), మహర్షి (1988), పంచం (1987) చిత్రాలకు వెన్నెలకంటి పాటలు రాశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**


# పాత్రోచిత మాటల మాంత్రికుడు పాత్రో - జనవరి 5... గణేష్ పాత్రో వర్ధంతి

తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంత సులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలామంది రచయితలకు ఎక్కువమంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాల చందర్ తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండతెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్యతరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు. గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేర్లు. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్బై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు. బాలచందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలకపాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్‌పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్‌పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభిం చింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రోకు గుర్తింపు తెచ్చాయి. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథ వస్తువును పరి గ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుంజయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమకూర్చారు. 125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ



వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. ‹హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం›... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం. ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (2013) (సంభాషణలు, శ్రీకాంత్ అడ్డాలతో కలిసి), 9 నెలలు (2001), నిర్ణయం (1991) (సంభాషణలు, పాటలు), సీతా రామయ్య గారి మనవరాలు (1991), రుద్రవీణ (1988), గౌతమి (1987), తలంబ్రాలు (1986), ప్రేమించు పెళ్ళాడు (1985), మయూరి (1984), మనిషికో చరిత్ర (1984), గుప్పెడు మనసు (1979) (సంభాషణలు), ఇది కథ కాదు (1979), మరో చరిత్ర (1978), అత్తవారిల్లు (1976) తదితర చిత్రాలకు పనిచేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొంది, గణేష్ 69 ఏళ్ళ వయసులో 2015, జనవరి 5న తెలుగు సినిమా పుస్తకంలో చెరగని సంతకం చేసి కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494**

# కూచిపూడి యక్షగానాల సృష్టికర్త చింతా వెంకటరామయ్య - జనవరి 6... చింతా వెంకటరామయ్య వర్ధంతి



కూచిపూడి నృత్యం గురించి తెలియని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. ఇది ఒక భారతీయ నాట్యం. కూచిపూడి భారతదేశంలో ఉన్న శాస్త్రీయ నృత్య రూపం, ఇది నాట్య శాస్త్రాన్ని 100% వరకు అనుసరిస్తుంది. ఆంధ్ర రాష్ట్రానికి చెందిన నాట్య రూపం. ఇది కృష్ణా జిల్లాకు చెందిన కూచిపూడి (మొవ్వ మండలం) గ్రామంలో పురుడు పోసుకుంది. కూచిపూడి గ్రామం విజయవాడ నుండి 32 మైళ్ళ దూరంలో ఉంది. శాతవాహన రాజన్యులు కూచిపూడి కళారాధకులుగా ప్రసిద్ధి గాంచారు. వైష్ణవారాధనకే అంకితమైన ఈ రూపాన్ని భాగవత మేళ నాటకం అనేవారు. చాలాకాలం వరకు, కూచిపూడి నృత్యం దేవాలయాలలో ప్రదర్శింప బడేది. సాంప్రదాయం ప్రకారం, పూర్వం బ్రాహ్మణ కులానికి చెందిన మగవారే కూచిపూడి నృత్యాన్ని చేసేవారు. అందుకే వీరిని కూచిపూడి భాగవతులు అంటారు. 15 వ శతాబ్దంలో సిద్ధేంద్ర యోగి, కూచిపూడి నాట్యంలో ఆడవారు నాట్యం చేయడానికి అనుగుణంగా, కొన్ని మార్పులు చేసి, దానిని పరిపుష్టం గావించాడు. బ్రాహ్మణులు కూచిపూడిలో స్థిరపడి ఈ నాట్యాన్ని అభ్యసించటంతో ఆ ఊరి పేరే ఈ నాట్యానికి సిద్ధించింది. కూచిపూడి నాట్యానికి యక్షగాన సొబగులు అద్దిన ప్రతిభాశాలి, నాట్యాచార్యులు, నాట్య గురువు, కూచిపూడి నాట్యత్రయంలో ఒకరు చింతా వెంకట్రామయ్య. పురాణాల ఆధారంగా గ్రహించిన కథకు, సంగీతం, నృత్యం, నటనల మేలు కలయిక వల్ల రూపొందించ బడి, అభివృద్ధి పరచబడిన వినూత్న ప్రక్రియ కూచిపూడి యక్షగాన కళా రూపం. సదరు కళా రూప సృష్టికర్త వెంకట్రామయ్య. ఈ కూచిపూడి నాట్య కళా రూపానికి ప్రాచుర్యం కల్పించడం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ముగ్గురిలో ఆయన ఒకరు కాగా, మిగతా ఇద్దరు వేదాంతం లక్ష్మనారాయణ శాస్త్రి, వేంపతి వెంకటనారాయణ శాస్త్రి. వెంకట్రామయ్య ఎనిమిది సంవత్సరాల వయస్సులో సత్యభామ, గొల్లభామ, యెరుకల సాని, నారద, హరిశ్చంద్ర తదితర స్త్రీ, పురుష పాత్రలను పోషించారు బీ తరువాత సంవత్సరాల్లో, ఆయన కూచిపూడి నృత్య నాటకాలకు సూత్రధారుని (ప్రధాన కథకుడు) పాత్రను పోషించారు. సూత్రధారుడు అనగా నాట్యము నడిపించే వ్యక్తి. ఆయన వెంకటరామా నాట్య మండలిని కూచిపూడిలో 145 సంవత్సరాల క్రితం స్థాపించి, అవిచ్ఛిన్నంగా నిర్వహించి, ఆ సంస్థ ద్వారా అనేక మంది ఉత్తమ నట శ్రేష్ఠులను సృష్టించి, ఈ నాటి కూచిపూడి నాట్య కళకు భవ్య యశస్సును సమ కూర్చి పెట్టిన ప్రముఖ నాట్యాచారుడు. ప్రయాణ సౌకర్యాలు అంతగా లేని కాలంలో ఎడ్ల బండ్లపై ఆంధ్రావని అంతటా తిరిగి ప్రదర్శనలు ఇవ్వడం సామాన్యమైన విషయం ఏమీ కాదు. దీన్ని బట్టి వెంకట్రామయ్య కూచిపూడి నాట్య, నాటక కళా ప్రచారానికి చేసిన కృషి స్పష్టం అవుతున్నది. గోల్కొండ నవాబులలో చివరివాడు, కళలు మరియు అక్షరాల యొక్క అన్నీ తెలిసిన వ్యక్తి అబ్దుల్ హసన్ తనీషా, గ్రామం గుండా వెళుతున్నప్పుడు వారు ప్రదర్శనను చూశారు. వారి అద్భుతమైన నటనకు ప్రతిఫలంగా, అతను కుచిపుడి అనే ఈ గ్రామాన్ని వారికి బహుకరించారు. యక్షగాన పితామహుడిగా, కూచిపూడి నాట్య మహామహోపాధ్యాయునిగా పేరు తెచ్చుకున్న చింతా వెంకట రామయ్య... తమ అగ్రజుడు చింతా రత్తయ్య, ఏలేశ్వరపు నారాయణప్పల సాన్నిధ్యంలో నాట్య శిక్షణలో ఆరితేరారు. భక్త ప్రహ్లాద, ఉషా పరిణయం, హరిశ్చంద్ర, శశిరేఖా పరిణయం వంటి నాటకాలలో స్వయం ప్రతిభ సంతరించుకుని, భారతదేశ మంతటా వాటిని సుప్రసిద్ధం చేశారు. నాట్య శాస్త్ర ప్రకాండులైన వేదాంతం చలపతి, ఆది నారాయణ, భరత కళా ప్రపూర్ణ వేదాంతం రాఘవయ్య, వెంపటి సత్యనారాయణ శర్మ (పెద్ద సత్యం), పసుమర్తి కృష్ణమూర్తి, వేదాంతం పార్వతీశం, భాగవతుల రామకోటయ్య, పసుమర్తి వేణుగోపాల శర్మ, వేము పూర్ణచంద్రరావు, ఆయన కుమారులూ, భరత నాట్య కళాప్రపూర్ణ చింతా కృష్ణమూర్తి ఆయన శిష్యులే కావడం విశేషం. చింతా వెంకటరామయ్య 1860 వ సంవత్సరంలో జన్మించారు. తండ్రి శివరామయ్య, తల్లి అరుంధతమ్మ. చిరు ప్రాయంలోనే పాటలో, ఆటలో, హాస్యంలో అనుభవం సంపాదించి, సత్యభామ వేషపు హావ భావాలను, దరువుల్ని, పాటను మమేకం చేస్తూ, ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే రీతిలో శ్రమించారు. వెంకట రామయ్య ప్రతిభా పాట వాలను గమనించి, ఏలేశ్వరపు నారాయణప్ప, వారి బృందంలో చేర్చు కున్నారు. 12 వ సంవత్సరం లోనే అన్నగారైన వెంకటరత్నం వద్ద నాట్య శిక్షణను ప్రారంభించి 16 సంవత్సరాలకే విశేష నాట్యశాస్త్ర అనుభవాన్ని సంపాదించారు. ఆయన భాగవత మేళాన్ని 1875 నుండి దాదాపు 1936 వరకూ నిర్వహించారు. ఈనాటికీ కొనసాగుతున్న వెంకటరామా నాట్యమండలి 1875 లో వెంకట రామయ్య ప్రారంభించి, నిర్వహించిందే. కొంతకాలం భాగవతమనే పేరుమీద, భామా కలాపాన్ని ప్రదర్శించారు. ప్రజాభిరుచుల్ని అర్థం చేసుకుని, అనుసరించి యక్షగానాలను ప్రవేశపెట్టి, భక్త ప్రహ్లాద, ఉషాపరిణయం, గయోపాఖ్యానము, రుక్మాంగద, హరిశ్చంద్ర, శశిరేఖా పరిణయం మొదలైన నాటకాలను ప్రదర్శించి ప్రజాదరణను, మన్ననలను పొందారు. వెంకటరామయ్య శిక్షణ ఇవ్వడంలో పూర్తిగా నిమగ్నం అయ్యేవారు. నిరంతరం ప్రదర్శన గురించే ఆలోచిస్తూ, ఆయనకు ఏ సమయంలో, ఏ అడుగు, ఏ భావం, ఏ రీతి, ఏ భంగిమ స్ఫురణకు వస్తే దానిని అప్పుడే అక్కడే శిష్యులకు నేర్పే వారు. ప్రయాణ సౌకర్యాలు లేని ఆనాడు ఆంధ్రదేశపు నాలుగు చెరగులా ఎడ్ల బండ్లలో ప్రయాణం చేసి ప్రదర్శనలిచ్చి, ఉన్నతాధికారుల వద్దా, సంస్థానాధీశ్వరుల వద్దా పారితోషికాలు పొందారు. వేదాంతం రాఘవయ్య పాత్ర నిర్వహణలో సర్వసమర్థునిగా తయారు చేసి 1934 లో మద్రాసులో గూడవల్లి రామబ్రహ్మం అధ్యక్షతన జరిగిన ఆంధ్ర నాటక కళా పరిషత్తులో, తాను సూత్రధారునిగా ప్రదర్శన ఇప్పించి, ఃసెహభాష్ః అనిపించి, వేదాంతం రాఘవయ్య ఉన్నత స్థానానికి చేరుకునే క్రమానికి పునాదులు వేశారు. వెంకట్రామయ్య శిష్యులలో పసుమర్తి వేణుగోపాలకృష్ణ శర్మ చివరి వారు. వేదాంతం రాఘవయ్య, వెంపటి పెదసత్యం, పసుమర్తి కృష్ణమూర్తి ఆయన వద్ద శిక్షణ పొందిన వారే. ఇంతటి ప్రతిభావంతుడైన వెంకట్రామయ్య 90 సంవత్సరాలు ధ్రువతారగా వెలుగొంది 1949 జనవరి 6 న కీర్తిశేషులైనారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# పంజా విసురుతున్న చైనా మాంజా

హైదరాబాద్ : చైనా మాంజా పంజా విసురుతోంది. నిషేధం ఉన్నప్పటికీ యథేఛగా విక్రయాలు సాగుతున్నాయి. చాలామంది వాటి బారిన పడుతున్నారు. మేడలు, అపార్ట్‌మెంట్లపైకి వెళ్లి పతంగులను ఎగరవేస్తుండగా కొన్నిసార్లు అవి చెట్లకు చిక్కుకొని తెగిపోతున్నాయి. మాంజా వేలాడుతుంటుంది. ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల మెడకు అది చుట్టుకొని గాయపడుతున్నారు. బైక్ వేగాన్ని బట్టి ప్రమాద తీవ్రత ఉంటుంది. పక్షులు కూడా వాటికి చిక్కుకొని చనిపోయిన ఘటనలున్నాయి. ఇటీవల షంషీర్‌గంజ్‌లో యువకుడు బైక్‌పై వెళుతుండగా చైనా మాంజా గొంతుకు చుట్టుకొని తీవ్రంగా గాయపడ్డాడు. మల్లికార్జున్‌నగర్‌లో మరో యువకుడిమెడకు చుట్టుకోవడంతో గాయపడి ఆసుపత్రిలో చేరాడు. మెడకింది వరకు 19 కుట్లు వేశారు. ఏటా ఈ తరహా ప్రమాదాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. ఎక్కడపడితే అక్కడ వాటి అమ్మకాలు జరుగుతున్నప్పటికీ మొక్కుబడి చర్యలతో సరిపెడుతున్నారు.

**జాగ్రత్తలు అవసరం...**

బైక్‌పై వీధులు, సందుల్లో వెళ్లేటప్పుడు పరిసరాలను గమనిస్తూ తక్కువ వేగంతో ప్రయాణించాలి. గాలి పటం తెగితే ఎగరేసిన వ్యక్తే మాంజా తొలగించాలి. ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు ఫుల్‌హెల్మెట్ ధరించాలి. మాంజా, రోడ్డు ప్రమాదం జరిగినా కాపాడుతుంది.



నిరంతరం తిరిగేవారు బైక్ హ్యాండిల్‌పై కైట్ గార్డ్‌లు అమర్చుకోవాలి. గాలిపటాలను ఎగరవేసేందుకు కాటన్, పర్యావరణ హిత దారాలు వాడటం మేలు. చైనా మాంజా వినియోగించొద్దు.

రోడ్లు, విద్యుత్తు తీగలు, చెట్లు, పైవంతెనల సమీపంలో పతంగులు ఎగురవేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రోడ్లపై మాంజా ఉంటే జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగించాలి.

**తయారీ ప్రమాదకరం...** చైనా మాంజా తయారీ ప్రమాదకరంగా ఉంటుందని నిపుణులు తెలిపారు. నైలాన్, సింథటిక్ ఫైబర్ దారాలతో తయారుచేస్తారు. ఇందులో గాజుపొడి, అల్యూమినియం ఆక్సైడ్, లోహచూర్ణం, రంగులు, కృత్రిమ జిగురు మిశ్రమాన్ని పూసి ఎండలో ఆరబెడతారు. ఇలా చేయడం వల్ల తెగిపోకుండా పదునుగా ఉంటుంది. దారాన్ని గట్టిగా లాగితే చేయి తెగిపోయే పరిస్థితి. మెడలాంటి సున్నిత భాగానికి చుట్టుకుంటే గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఒక్కోసారి తీవ్ర రక్తస్రావమై ప్రాణం పోయే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొన్నారు.

# గూడు లేని 'గ్రామ'స్వరాజ్యం..!

కొత్తగూడెం :ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం రుక్కీతండాలో రూ.20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. మూడేళ్లవుతున్నా పిల్లర్ల దశ దాటలేదు. నిధులు లేకపోవటం, గుత్తేదారులు చేతులెత్తేయటంతో పక్కా భవన నిర్మాణం పక్కదారి పట్టింది. ప్రస్తుతం ఓ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు.

ములకలపల్లి, పినపాక, కామేపల్లి: జిల్లాల పునర్విభజన తరువాత పదుల సంఖ్యలో కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా గిరిజన తండాలు పంచాయతీలుగా మారటంతో ఆయాచోట్ల అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. కానీ అసలు సమస్య అక్కడే మొదలైంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీల పరిస్థితి 'అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని' అన్నట్టుగా తయారైంది. చేతికందిన అధికారాన్ని చెలాయించటానికి సొంత భవనం లేకపోవటం స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు తలనొప్పిగా మారింది. ఉభయ జిల్లాల్లో 2025 మార్చి నాటికి 332 భవనాల నిర్మాణం చేపట్టగా సుమారు 132చోట్ల పనులు పూర్తయ్యాయి. మిగతావి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

**సర్కారు బడులు, అద్దె ఇళ్లల్లో 'పంచాయతీ'**

సొంత భవనాలు లేకపోవటంతో నూతన పాలకవర్గాలు అరకొర వసతులతోనే నెట్టుకొస్తున్నాయి. కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలల్లోని అదనపు గదులు, మరికొన్నిచోట్ల అద్దె ఇళ్లు, ఇంకొన్నిచోట్ల ఖాళీగా ఉన్న ప్రభుత్వ కార్యాలయాల్లో గ్రామ సచివాలయాలను నిర్వహిస్తున్నారు. నూతన గ్రామపంచాయతీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అనేక గ్రామాల్లో శాశ్వత భవనాలు నిర్మించటంలో పాలకులు విఫలమవుతున్నారు. నిధుల లేమి, స్థల వివాదాలు వెరసి కొత్త పంచాయతీ భవనాల నిర్మాణం 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్నట్లుగా తయారైంది. కొత్తగా కొలువుదీరిన పాలకవర్గాలు శాశ్వత భవన నిర్మాణ అంశాన్ని సవాల్‌గా తీసుకోవాల్సిన అవసరముంది. లేనిపక్షంలో కొత్త పాలకవర్గాలు సైతం పాత సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడాల్సిందే. నూతన గ్రామ పంచాయతీల్లో సచివాలయ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన వాటికి నిధుల కొరత రాకుండా చూస్తున్నాం. లక్ష్యాలకు అనుగుణంగా శాశ్వత భవనాలు నిర్మిస్తాం. విద్యాచందన, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం

# ప్రమాదం తెలిసేలా.. ప్రయోజనం కలిగేలా

ఆదిలాబాద్ : జాతీయ రహదారిపై ఇక నిఘా పెంచనున్నారు. ఎక్కడ ప్రమాదం జరిగినా.. ప్రమాదకరంగా వాహనాలు నడిపినా.. క్షణాల్లో కంట్రోల్ రూంకు సమాచారం అందేలా జాతీయ రహదారుల ఆధీకృత సంస్థ దేశవ్యాప్తంగా ఈ వ్యవస్థకు ఏర్పాట్లు చేస్తోంది.. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుంచి దాదాపు 111 కి.మీ పొడవుతో ఉన్న 44వ జాతీయ రహదారిపై నిఘా కెమెరాలు, ఆర్చిలను ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కిలోమీటరుకు ఒక నిఘా కెమెరా ఏర్పాటు, వాహన చోదకుల సౌలభ్యం కోసం ఓవర్‌హెడ్ ఆర్చిలను నిర్మించి ఆయా గ్రామాలు, పట్టణాల పేర్లు, ఎంత దూరంలో ఉన్నాయనే వివరాలను ప్రదర్శించనున్నారు. ఆరేడు నెలల్లో ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.జైనథ్ మండలంలోని డొల్లార నుంచి సోన్ మండలం గంజాల్ వరకు ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలో 44వ జాతీయ రహదారి విస్తరించి ఉంది. ప్రస్తుతం జాతీయ రహదారిపై అక్కడక్కడా సీసీ కెమెరాలున్నా పని చేయడం లేదు. ఇటీవల పట్టణ సమీపంలోని మావల వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం చోటుచేసుకోగా ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. అక్కడున్న సీసీ కెమెరా పనిచేయకపోవటంతో ప్రమాదం జరిగిన తీరును పోలీసులు గుర్తించటం కష్టంగా మారింది.

కంట్రోల్ రూం ఏర్పాటు

జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సహాయంతో కంట్రోల్‌రూంలో నిరంత నిఘా కొనసాగిస్తారు. ప్రమాదాలు జరిగితే క్షణాల్లో కంట్రోల్‌రూంకు సమాచారం అందుతుంది. ప్రతి టోల్‌ప్లాజా వద్ద ఒక కంట్రోల్‌రూం అందుబాటులోకి తీసుకురానున్నారు.చోదకుల కోసం..సుదూరంగా ప్రయాణించే చోదకుల సౌకర్యార్థం జాతీయ రహదారిపై ఓవర్ హెడ్ ఆర్చిల నిర్మాణం చేపడుతున్నారు. వీటితో అత్యధిక ఎత్తు లోడ్‌తో వెళ్లే వాహనాలను నిలువరించవచ్చు. ప్రస్తుతం రహదారి మధ్యన డివైడర్‌లో సీసీ కెమెరాల కోసం స్తంభాలు వేస్తున్నారు. జాతీయ రహదారిపై వాహనాలు ఏ ప్రాంతంలో ఎంత వేగంగా వెళ్తున్నాయనే అంశంతోపాటు ఎక్కడైనా వాహనం ప్రమాదానికి గురైతే తక్షణమే నిఘా కెమెరాల ద్వారా తెలిసిపోతుంది.

# నోటరీపై సంతకాలు.. ప్లాట్లుగా విక్రయాలు



హైదరాబాద్ : శంషాబాద్‌లో కొందరు అక్రమార్కులు.. మాజీప్రజాప్రతినిధులు కలిసి భారీ అక్రమాలకు తెరలేపారు. బెంగళూరు జాతీయ రహదారిపై మదనపల్లి గ్రామంలో భూమిలేని రైతులు, స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ సైనికులకు ఇచ్చిన అసైన్డ్ భూములను సొంతం చేసుకుంటున్నారు. వీరికి కిందిస్థాయి రెవెన్యూ అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెరవెనుక సహకరిస్తున్నారు. రెండేళ్ల నుంచి భూములు కొంటున్న అక్రమార్కులు అధికారుల సహకారంతో ఐదారు నెలల్లో వంద ఎకరాలకుపైగా విక్రయించారు. ప్రస్తుతం వీటి విలువ రూ.2వేల కోట్లు. రియల్ వెంచర్ల ఏజెంట్లు, స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించేందుకు మరో 200 ఎకరాలు సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**నాలుగైదేళ్ల క్రితమే ప్లాన్..** మదనపల్లి అసైన్డ్ భూములను కాజేసేందుకు కొందరు మాజీ ప్రజాప్రతినిధులు నాలుగైదేళ్ల క్రితం ప్లాన్ వేశారు. నోటరీ పత్రాలపై వారితో సంతకాలు చేయించుకుని రిజిస్ట్రేషన్ ద్వారా విక్రయించేందుకు కిందిస్థాయి అధికారులతో మాట్లాడుకున్నారు. మూడేళ్ల క్రితం అసైన్డ్ భూముల్లో ఒక ఎకరాను విక్రయించి దానికి ఇంటి నంబర్ వేయిం చారు. ఇక అప్పటి నుంచి నోటరీ పత్రాలతో కొనుగోలు చేయడం, అమ్మేయడం చేస్తున్నారు. స్థానికులు గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా కొందరు అధికారులు అడ్డుపడడంతో అక్రమాలపై విచారణ ప్రారంభం కాలేదు.

**పంటలు కనుమరుగై..** వాస్తవానికి మదనపల్లి రెవెన్యూ నం.50లో మొత్తం 559.16 ఎకరాల ప్రభుత్వ భూములను 196162లో పేద రైతులు, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులకు పంపిణీ చేశారు. అసైనీలంతా 2010 వరకూ పంటలు పండించారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రారం భం కావడం, భూముల ధరలు పెరగడంతో వ్యవసాయం కనుమరుగైంది.

# ఆయువు తీస్తున్న వాయువేగం




సంగారెడ్డి: ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అతివేగం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. పోలీసుశాఖ విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. వికారాబాద్‌లో 2025 సంవత్సరంలో 146 రోడ్డు ప్రమాదాలు జరగగా.. 160 మంది దుర్మరణం చెందారు. ఆయా కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపారు. వీటిలో అధిక శాతం ప్రమాదాలు అతివేగం కారణంగానే జరిగినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

**పోలీసు అధికారులు ఏమంటున్నారంటే..**

రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారులపై పలుచోట్ల స్పీడ్ గన్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. మరిన్ని ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలో హైదరాబాద్-ముంబయి(ఎన్‌హెచ్-65), శ్రీనగర్-కన్యాకుమారి(ఎన్‌హెచ్-44), సంగారెడ్డి-నాందేడ్-అకోలా(ఎన్‌హెచ్-161), బీజాపూర్-హైదరాబాద్ లాంటి కీలక మార్గాలున్నాయి. వాహనాలు, ప్రయాణికుల రాకపోకలతోనిత్యం రద్దీగా ఉంటాయి. ఉమ్మడి జిల్లాలో రోజుకు సగటున ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. వారం కిందట మెదక్ జిల్లా కేంద్రం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడిపి కంది వద్ద టిప్పర్‌ను ఢీకొట్టి ప్రమాదానికి కారణమయ్యారు. పదిహేను మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు.

గత ఏడాది చేవెళ్ల-మీర్జాగూడ మధ్య ఆర్టీసీ బస్సు - టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో 17 మంది దుర్మరణం చెందారు. 34 మంది గాయపడ్డారు.

అదుపు చేయలేకపోవడంతో..

జాతీయ రహదారులపై 80 కి.మీ., ఇతర మార్గాల్లో 70 కి.మీ. గరిష' వేగపరిమితిని నిర్దేశించారు. సాఫీగా రవాణా సాగుతున్న సమయంలో 100 కి.మీ. వేగంతో ప్రయాణిస్తున్నా డ్రైవర్‌కు ఇబ్బందిగా ఉండదు. ఆకస్మికంగా నియంత్రించాల్సిన పరిస్థితి ఏర్పడినప్పుడు అదుపు చేయలేక ప్రమాదాలకు కారణమవుతోంది.

పలు పరిశోధన సంస్థల నివేదికల ప్రకారం ప్రయాణ సమయంలో రోడ్డుపై ఏదైనా వస్తువును 35 మీటర్ల దూరంలో గమనించినప్పుడు మాత్రమే వాహనాన్ని డ్రైవర్ సమర్థంగా ఆపగలుగుతారు.

సాధారణంగా వాహనాలు 65 కి.మీ. లోపు వేగంతో వెళుతుంటాయి. అంతకంటే ఎక్కువ వేగం పెరిగితే సమర్థంగా నియంత్రించే అవకాశాలు తగ్గిపోతాయి.

# బాల్యం.. బలహీనం



బొంరాస్‌పేట: పిల్లల ఎదుగుదలకు పోషకాహార లోపం శాపంగా మారుతోంది. మానసిక, శారీరక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా బంగారు బాల్యం బలహీనమవుతోంది. వారి ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలు ఏటా రూ.కోట్లు వెచ్చిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన మార్పు కనిపించడం లేదు. జిల్లాలో తక్కువ బరువు, వయసుకు తగిన ఎత్తు లేని పిల్లల సంఖ్య చాలానే ఉండడం ఆందోళన కలిస్తోంది. ప్రతినెలా పిల్లల ఎత్తు, బరువును కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్‌హెచ్‌టీఎస్ (న్యూట్రిషన్ అండ్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం) యాప్‌లో నమోదు చేస్తున్నారు. వీటి గణంకాలు చూస్తే పౌష్టికాహార లోపం స్పష్టంగా తెలుస్తోంది.

**బాలామృతం, గుడ్లు సరఫరా చేస్తున్నా..**

మూడేళ్ల వరకున్న పిల్లలకు బాలామృతం, నెలకు 16 గుడ్లు ఇస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు రోజూ ఒకపూట భోజనం, నెలకు 30 ఉడికించిన గుడ్లు అందిస్తున్నారు. తక్కువ ఎత్తు, సరైన బరువు లేని వారికి ప్రత్యేకంగా బాలామృతం ప్లస్, తీవ్ర పోషకాహార లోపమున్న వారికి పాలు, సంపూర? భోజనం వడ్డిస్తున్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపం నివారించడానికి ప్రభుత్వం వారికి పల్లి చిక్కీలు అందించాలని తాజాగా నిర?యించింది. ఇంత చేస్తున్నా క్షేత్రస్థాయిలో అవి సక్రమంగా అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో చాలాచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ వాటి నిర్వహణ ఆయాలే చూస్తున్నారు. ఇలాంటి కేంద్రాల్లో పోషకాహారం పంపిణీ, పిల్లలకు ఆటపాటలు నేర్పడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారం సక్రమంగా పంపిణీ అవుతోందా.. లేదా అనేది పర్యవేక్షించడం లేదు. సర్కారు ఇచ్చేదానికి తోడు ఇంటి వద్ద బలమైన ఆహారం అందించాలి. తల్లిదండ్రుల్లో అవగాహన లోపంతో వాటిని అందించడం లేదు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచి పౌషకాహారం సరిగ్గా అందేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్, మర్పల్లిలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో 1129 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. మూడేళ్లలోపు పిల్లలు 31225, 3-6 ఏళ్లలోపు వారు 18546 మంది ఉన్నారు.

పోషకాహార లోపం తీవ్రత తక్కువున్నవారు: 1874

తీవ్రత ఎక్కువున్న వారు: 320

వయసుకు తగిన బరువు లేనివారు: 4263

మధ్యస్థం ఉన్నవారు: 861

# ఊరు మురిసేలా.. ఏరు మెరిసేలా!

భద్రాచలం : పర్యాటక రంగం ప్రపంచంలోని ఎక్కువ దేశాలకు ప్రధాన ఆదాయ వనరుగా విరాజిల్లుతుండటంతో తెలంగాణ సైతం ఈ దిశగా ముమ్మర ప్రయత్నాలు సాగిస్తోంది. ఇందులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సహజసిద్ధమైన ప్రకృతి వనరుల సందర్శనానికి ప్రాధాన్యం పెరుగుతోంది. సరైన ప్రచారం లేక ఇవి ఇంతకాలం అనుకున్నంత ఆదరణ పొందలేదు. గత ఏడాది ముక్కోటి ఉత్సవాలకు ఏరు మహోత్సవం ప్రారంభమైంది. కొంతకాలం ప్యాకేజీలు అమల్లో ఉన్నప్పటికీ రకరకాల కారణాలతో భద్రాచలంలోని గుడారాలను తొలగించాల్సి వచ్చింది. ఈసారి ముక్కోటికి మళ్లీ వీటికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రచారంపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం 12 గుడారాలను ఏర్పాటు చేశారు. గడిచిన వారంలో సుమారు 30 మంది ఇక్కడ విడిది చేశారు. క్యాంప్ ఫైర్, సీసీ కెమెరాల పర్యవేక్షణ, సోలార్ దీపాలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం సమకూర్చారు. కొన్ని గుడారాలలో ఇద్దరు, ఇంకొన్నింటిలో నలుగురు చొప్పన విడిది చేయవచ్చు. గోదావరి అందాలను వీక్షిస్తు సెల్ఫీలు తీసుకునేందుకు ప్రత్యేక సదుపాయం కల్పించారు. ఒక్కరికి రోజుకు రూ.500 అద్దె ఉండగా బృందాలుగా వచ్చేవారికి, చిన్నారులకు కొంత తగ్గింపు ఇస్తుండటంతో సంక్రాంతి వేళ ఆదరణ వస్తుందని వీటిని నిర్వహిస్తున్న గులాబీ స్వయం సహాయక సంఘం ఆశాభావం వ్యక్తం



చేస్తోంది. ఒకప్పుడు ఐటీడీఏలోని గిరిజన మ్యూజియానికి తాకిడి తక్కువగా ఉండేది. ఆటో యూనియన్ల సహకారం తీసుకోవడంతో పాటు భక్తులు పర్యటించే ప్రాంతాల్లో ప్రచార గోడపత్రికలను అంటించడంతో మ్యూజియానికి రద్దీ పెరుగుతోంది. ఇదే సూత్రాన్ని ఏరు మహోత్సవానికి అన్వయించి అందరి సహకారంతో పర్యాటకులను ఆకట్టుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. బాలారిష్టాలను అధిగమించగలిగితే మన్యానికి కొత్తగా వచ్చే వారికి మనోరంజకంగా ఇక్కడి వాతావరణం స్వాగతం పలకనుంది.

**దేవుడి పెళ్లికి ప్రసాద్**

రాముడు కొలువైన భద్రాచలంతో పాటు సీతారామ లక్ష్మణులు వనవాసం కాలంలో నివాసం ఉన్న పర?శాలలో మూడేళ్ల కిందటే ప్రసాద్ పథకం ద్వారా రూ.41.3 కోట్లతో అభివృద్ధి పనులు మొదలయ్యాయి. భద్రాచలం గోదావరి ఒడ్డున ఉన్న క్యాంటిన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఆవరణను సుందరంగా తయారు చేసి ఫ్లోరింగ్ పనులు పూర్తయ్యాక దీన్ని ఉపయోగంలోకి తీసుకు రావాలని పర్యాటక శాఖ భావిస్తోంది. గుత్తేదారుకు ఇవ్వాల్సిన నిధులు ఆలస్యం కాకుండా చూస్తే పనుల్లో పురోగతి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అన్నదానం కోసం ఉపయోగించాల్సిన వ్రత మండపం పనుల్లో వేగం పెరిగింది. మార్చి 27న శ్రీరామ నవమి ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారు. వచ్చే శ్రీరామనవమి నాటికి ఈ పనులన్నీ ఉపయోగం లోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. మార్చి 31కి ముందే ప్రసాద్ పనులు ఉపయోగంలోకి తెస్తామని ఈ పథకం ఏఈ ప్రసాద్ తెలిపారు.

# వసతి.. వణుకు!

గద్వాల : ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులు చలికి వణికిపోతున్నారు. గదులకు కిటికీలు, తలుపులు సరిగా లేకపోవడం, వేడి నీటి వసతిలేక ఉదయాన్నే చన్నీటి స్నానం చేయాల్సి రావడంతో నానా అవస్థలు పడుతున్నారు.జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతిగృహాల్లో సగానికిపైగా కిటికీలకు రెక్కలు విరిగిపోయాయి. దీంతో చలి నుంచి రక్షణ పొందేందుకు విద్యార్థులు టవల్స్, దుప్పట్లను అడ్డంగా కిటికీలకు అడ్డంగా పెట్టుకుంటున్నారు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఏళ్లుగా సమస్య ఉన్నా సంక్షేమశాఖ అధికారులు దృష్టి సారించడం లేదు. జిల్లాలో ఒక్కోసాసి 12 నుంచి 15 డిగ్రీల ఉష్ో?గ్రత నమోదవుతోంది. ఇంత ఎముకల కొరికే చలిలోనే వసతిగృహ విద్యార్థులు చన్నీటి స్నానాలు చేయాల్సిన దౌరాగ్యం ఉంది. దీంతో పలువురు విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. వేడి నీటి వసతి కల్పించాలని మొరపెట్టుకున్నా సంబంధిత అధికారుల నుంచి పట్టింపు కరవైంది.

ప్రతిపాదనలు పంపించాం.. వసతిగృహాల్లో కిటికీలు, తలుపుల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా వేడి నీటి వసతి లేదని ప్రభుత్వం నిర?యం తీసుకోవాల్సి ఉందని సంక్షేమశాఖ జిల్లా అధికారులు అక్బర్ (బీసీ), నుషిత (ఎస్సీ) తెలిపారు.

గద్వాల పట్టణంలో చింతలపేటలోని ఎస్సీ, బీసీ, ఆనందనిలయం వసతిగృహాల్లో కలిపి సుమారు 645 మంది విద్యార్థులున్నారు. వేడి నీటి వసతి లేకపోవడంతో ప్రతి రోజూ విద్యార్థులు చలిలో ఇలా చన్నీటి స్నానమే చేయాల్సి వస్తోంది. గద్వాల పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతిగృహంలో కిటికిలు, తలుపులు విరిగిపోయాయి. దీంతో కిటికీలకు దుప్పట్లు, టవల్స్ ఇదిగో ఇలా అడ్డం పెట్టుకుని చలి నుంచి కాస్త ఉపశమనం పొందుతున్నారు.

# కల్తీ.. కల్తీ.. తనిఖీ పల్టీ!

గద్వాల, కృష్ణవేణి చౌక్, న్యూస్‌టుడే: జోగులాంబ జిల్లాలో ఫలహార శాలలు, ప్రధాన రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసాహార దుకాణాలను, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు ప్రతి నెలా విధిగా తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ఏదైనా ఘటనలు జరిగిన సమయంలో మాత్రమే హడావిడి చేసి, తర్వాత పట్టించుకోకపోవటంతో ప్రజల ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.

ముఖ్యంగా ప్రధాన హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగించే నూనెల్లో ఎక్కువగా కల్తీవి వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దానికి తోడు హోటళ్లు రెస్టారెంట్లలో వంట గదుల్లో పూర్తి స్థాయిలో పరిశుభ్రత లేకపోవటంపై పరిశీలించే వారు కరవైన పరిస్థితి ఉందని ప్రజలంటున్నారు. మరి ముఖ్యంగా కూరగాయాల విషయంలో కూడా తక్కువ గ్రేడ్‌వి కొనుగోలు చేసి వినియోగిస్తున్నారనే ఆరోపణ ఉంది. వీటిన్నింటిపై తనిఖీలు లేకపోవటంతో గత మూడు రోజుల కిందట సాక్షాత్తు జిల్లా పాలనాధికారి ఆహార కల్తీనిరోధక శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటికైనా అధికారుల్లో కదలిక వస్తుందేమో చూడాలి.జిల్లాలో 2,600 పైగా హోటళ్లు రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసాహార, బేకరీలు, మిఠాయి దుకాణాలున్నాయి. నిర్వాహకులు ఆహార కల్తీ నిరోధక శాఖ నుంచి తప్పక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతి తీసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వారు అసలు తీసుకోవటం లేదన్న మాట తెలుస్తోంది.కొత్తగా ఏర్పాటు చేసుకున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్, మాంసాహార దుకాణాలు ఇతర ఫలహార శాలలు నమోదు చేసుకోనివి ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలి కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. అలాగే ప్రతి నెలా 25 హోటళ్లు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఆహార నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపి నివేదికలు సమర్పించాలని జిల్లా పాలనాధికారి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

# పాలనలో.. 12 మంది ఐఏఎస్‌లు

హైదరాబాద్: తెలంగాణ కేంద్ర పట్టణ ప్రాంతం(టీసీయూఆర్) పరిధికి జీహెచ్ఎంసీని విస్తరించడంతో.. అంతే స్థాయిలో నగరాన్ని అభివృద్ధి చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక నిర?యాలు తీసుకుంది. డివిజన్ల పునర్విభజన, పరిపాలన కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ పూర్తి చేసి.. ఇప్పటివరకు గ్రూప్-1, గ్రూప్-2 స్థాయి అధికారులు మున్సిపల్ కమిషనర్లుగా ఉన్న ప్రాంతాలకు.. ఐఏఎస్ అధికారులను జోనల్ కమిషనర్లుగా నియమించింది. పాతబస్తీ, ప్రధాన నగరం, సైబరాబాద్ అనే తేడా లేకుండా.. 12 జోన్లలో 9 జోన్లను యువ ఐఏఎస్‌లకు అప్పగించింది. తాజాగా మరో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను అదనపు కమిషనర్లుగా నియమించడంతో.. కమిషనర్ ఆర్వీ.కర?న్‌తో కలిపి ప్రస్తుతం జీహెచ్ఎంసీలోని ఐఏఎస్ అధికారుల సంఖ్య 12 మందికి పెరిగింది. దేశంలో ఇంతమంది ఐఏఎస్ అధికారులున్న స్థానిక సంస్థ మరెక్కడా లేదు.

**ఆ ఇద్దరు.. అందుకేనా..?**

ప్రస్తుత జీహెచ్ఎంసీ మూడు మహా నగరపాలక సంస్థలుగా ఏర్పాటు కానుందని సమాచారం. మూడు మహా నగరాల ఏర్పాటును దృష్టిలో ఉంచుకునే రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్ జోన్లకు వినయ్‌కృషా?రెడ్డిని, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి జోన్లకు జి.సృజనను అదనపు కమిషనర్లుగా నియమించింది. ఫిబ్రవరిలో ప్రస్తుత గ్రేటర్ పాలకమండలి సభ్యుల పదవీకాలం పూర్తవనుందని, ఆ తర్వాత మూడు మహానగరపాలక సంస్థలను



ఏర్పాటు చేసి.. ఆ ఇద్దరికి అదనపు కమిషనర్లుగా కమిషనర్ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

"మూడొందల మంది అధికారుల్లోంచి.. మిమ్మల్ని ఎంపిక చేశాను. జోనల్ కమిషనర్లుగా నియమించా. నగరాన్ని అభివృద్ధి చేయండి. నా నమ్మకాన్ని నిలబెట్టుకోండి."- ఇటీవల కొత్త జెడ్సీలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్న మాటలివి.

**జెడ్సీలుగా నియమితులైన వారు వీరే..**

మల్కాజిగిరి జోన్‌కు సంచిత్ గన్వార్, ఉప్పల్‌కు రాధిక గుప్తా, ఎల్బీనగర్‌కు హేమంత్ కేశవ్ పాటిల్, రాజేంద్రనగర్‌కు అనురాగ్ జయంతి, గోల్కొండకు ముకుంద్‌రెడ్డి, ఖైరతాబాద్‌కు ప్రియాంక ఆల, శేరిలింగంపల్లికి హేమంత్ సహదేవ్‌రావు, కూకట్‌పల్లికి అపూర్వ చౌహాన్, కుతుబ్లాపూర్‌కు సందీప్‌కుమార్ ఝా జెడ్సీలుగా నియమితులయ్యారు.

# క్లిక్ చేస్తే ఉచ్చులో చిక్కినట్టే

గంగాధర : గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి చెందిన శ్రీవర్ధన్ రూ.47 వేలు, బూర్గుపల్లికి చెందిన మధు రూ.57 వేలు, సర్వారెడ్డిపల్లికి చెందిన కుమార్ రూ.46,540, మంగపేటకు చెందిన భవాని రూ.70 వేలు పోగొట్టుకోగా.. కోర్టు ఆర్డర్ ద్వారా బాధితులకు రికవరీ చేసే పనులను స్థానిక పోలీసులు పూర్తి చేశారు. త్వరలోనే వీరి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి.

అపరిచిత వెబ్‌సైట్లు, తెలియని వ్యక్తులు పంపే లింకుల నుంచి యాప్స్ డౌన్‌లోడ్ చేయొద్దు. కొన్నింటికి కెమెరా, గ్యాలరీ పర్మిషన్లు అవసరం ఉండదనే విషయాన్ని గమనించాలి.

ఇటీవల కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూర్గుపల్లి ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ ఏపీకే ఫైల్ ఓపెన్ చేయడంతో ఆయన రెండు బ్యాంకు ఖాతాల్లోంచి సైబర్ నేరగాళ్లు రూ.13 లక్షలు కాజేశారు.

పెద్దపల్లి జిల్లా వ్యవసాయ శాఖలో ఇద్దరు అధికారుల చరవాణులను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి ఓ అధికారిణి భర్త బ్యాంకు ఖాతా నుంచి రూ.10 లక్షలు మాయం చేశారు.



**మూడు నెలల్లో రూ.23 కోట్లు**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో గత మూడు నెలల్లోనే 485 కేసులు నమోదుకాగా రూ.23,69,50,800 నగదును బాధితులు పోగొట్టుకున్నారు. వీటిలో రూ.47,92,767 రికవరీకి పోలీసులు చర్యలు చేపట్టారు. బాధితులు రూ.లక్షల్లో కోల్పోతుండగా.. రూ.వేలల్లో కోల్పోయిన కేసుల్లోనే రికవరీ జరుగుతుంది. అది కూడా చాలా రోజులు పడుతుండటంతో బాధితులు ఆవేదన చెందుతున్నారు. అయితే రూ.లక్షల్లో మోసాలు జరిగిన సమయాల్లో ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన సైబర్ నేరగాళ్లను పట్టుకునేందుకు స్థానిక పోలీసులకు ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలుస్తోంది.

**1930ని సంప్రదిస్తే..**బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకున్నట్లు చరవాణికి సందేశం వస్తే వెంటనే మొదటి గంటనే గోల్డెన్ అవర్‌గా భావించి 1930 నంబర్‌ను సంప్రదించాలి. లేదా %cybercrime.gov.in% లో లాగిన్ అయి పూర్తి వివరాలతో ఫిర్యాదునమోదు చేయాలి. ఇలా చేయడంతో తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు స్పందించి కొన్ని సెకన్లలోనే ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు రిక్వెస్ట్ పెట్టి ఖాతాను ఫ్రీజ్ చేయిస్తారు. ఇందుకుగాను ప్రతి పోలీసు స్టేషన్‌లో సంబంధిత కానిస్టేబుల్ బాధితులతో మాట్లాడి రూ.25 వేల కంటే ఎక్కువగా కోల్పోతే కేసు నమోదు చేసి బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేసిన సొమ్మును ఇప్పిస్తారు.

# బాగుంటే చప్పట్లు.. కాదంటే చివాట్లు



హైదరాబాద్: ఒకే కాలనీలో నివసించే 50 మంది గృహిణులు షాపింగ్‌లు, వంటకాల ముచ్చట్లు పంచుకునేందుకు గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. చీరలు, వంటల విషయంలో జరిగే చర్చ కాస్త పక్కదారి పట్టింది. ఒకర్నొకరు తిట్టుకోవటంతో గొడవ ముదిరింది. దీనిపై ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పంచాయితీ ఠాణాకు చేరింది. ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి సర్దుబాటు చేసేందుకు రెండ్రోజుల సమయం పట్టిందని పోలీసు అధికారి తన అనుభవాన్ని పంచుకున్నారు.

**గొడవలకు వేదికగా సామాజిక మాధ్యమాలు**

దూరాల్ని దగ్గర చేసిన సామాజిక మాధ్యమాలు రణరంగ వేదికలుగా మారుతున్నాయి. సహోద్యోగులు, మిత్రులు, అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీస్‌లో ఉండే కుటుంబాలు వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. విందులు, వేడుకలు చేసుకున్నప్పుడు బాగుందంటూ చప్పట్లు కొట్టినవారే.. ఏదైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే తిట్ల దండకం అందుకుంటున్నారు. యూసుఫ్‌గూడలో ఓ అపార్ట్‌మెంట్‌వాసులు తమ వాట్సప్ గ్రూప్‌లో నిర్వహణ సరిగా లేదంటూ ఒకరు పోస్టు చేశారు. ఇది గొడవకు దారి తీసింది. ఇరువర్గాల ఫిర్యాదుతో కేసు నమోదైంది. సామాజిక మాధ్యమాల్లో పోస్ట్‌చేసే అంశాలను కొందరు తీవ్రంగా పరిగణిస్తుండటంతోనే గొడవలు జరుగుతున్నాయని పోలీసు అధికారి తెలిపారు.

**ఈ ప్రాంతాల్లోనే ఫిర్యాదులెక్కువ**

నార్సింగి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, బంజారాహిల్స్, సికింద్రాబాద్, అబిడ్స్‌ల్లో అధికశాతం ఈ తరహా ఫిర్యాదులు వస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

**ఏం చేయాలి?**తమకు నచ్చని అంశం పోస్ట్ చేయటం, షేర్ చేసినపుడు వారితోనే తమ అభిప్రాయం పంచుకుంటే సమస్య పరిష్కారమవుతుందని పోలీసు ఉన్నతాధికారి సూచించారు. గొడవలతో ఠాణా వరకు రావటం వల్ల విలువైన సమయంతో పాటు ఆత్మీయులను నష్టపోతారని గుర్తుంచుకోవాలన్నారు.

# ఏసీల్లేని 'ఫ్యూచర్‌సిటీ'



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్‌సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం(డీసీఎస్) వినియోగించనున్నారు. ఏసీ లేకుండానే చల్లబర్చే డీసీఎస్‌ను కొత్తగా నిర్మించే నగరాలు, మాల్స్, టౌన్‌షిప్పుల్లో వాడుతున్నారు. తెలంగాణలో మొదటగా ఫ్యూచర్‌సిటీలో అమలుకు సర్కారు ప్రణాళికలు రూపొందించింది. ఇటీవల తెలంగాణ విజన్ 2047 పత్రంలో దీని గురించి ప్రకటించింది. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట ప్రాంతంలో 30 వేల ఎకరాల విస్తీర?ంలో భారత్ ఫ్యూచర్‌సిటీని సర్కారు ఏర్పాటు చేస్తోంది. ఇందులో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ) కీలకం. సీబీడీని పలు జోన్లుగా అభివృద్ధి చేస్తారు. 300 ఎకరాల్లో ఏఐ సిటీ, 200 ఎకరాల్లో హెల్త్‌సిటీ, 500 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతారు. 3 వేల ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్‌ను అభివృద్ధి చేస్తారు. ఇక్కడ డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్ని చేపట్టనున్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్‌సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం ఉంది. పోచారంలోని ఇన్ఫోసిస్, ఐటీ కారిడార్‌లోని ఒక గేటెట్ కమ్యూనిటీలో ఈ తరహాలోనే ఏర్పాటు చేశారు. ఇప్పుడుమరింత అధునాతమైన డీసీఎస్‌ను సిటీకి సర్కారు పరిచయం చేయబోతోంది.

**ఎలా పనిచేస్తుంది?**

ఇటీవల కాలంలో ఏసీల వినియోగం పెరగడంతో నగరాలు హీట్ ఐలాండ్స్‌గా మారుతున్నాయి. దీంతో మరింతగా ఏసీల వాడకం అవసరం అవుతోంది. ఎక్కడ చూసినా భవనాల బయట ఏసీ అవుట్‌డోర్ యూనిట్లే దర్శనమిస్తున్నాయి. ఫ్యూచర్‌సిటీలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి అవకాశం ఉండటంతో సాధారణ ఏసీల స్థానంలో చల్లని నీటిని పైపుల ద్వారా పంపి భవనాల లోపల ఉష్ణో?గ్రతలను తగ్గించే సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనింగ్ విధానం డిస్ట్రిక్ట్ కూలింగ్‌కు అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం శుద్ధి చేసిన జలాలను 5 డిగ్రీలకు శీతలీకరిస్తారు. పైపులైను ద్వారానే ప్రతి భవనం, గదికి సరఫరా చేస్తారు. భవనాల్లో ఉన్న ఎయిర్ హ్యాండ్లింగ్ యూనిట్లు గదులను చల్లబరుస్తాయి. ఈ క్రమంలో గదిలోని ఉష్ణో?గ్రతకు పైపులోని నీరు వేడెక్కుతుంది. తిరిగి నీటిని శీతలీకరణ ఛాంబర్‌కు తరలించి చల్లబర్చాక మళ్లీ సరఫరా చేస్తారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. సాధారణ ఏసీలతో పోలిస్తే 30 శాతం విద్యుత్తును ఆదా చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. తద్వారా పర్యావరణానికి మేలు జరుగుతుందని ప్రభుత్వ అంటోంది.

# క్యాంపస్‌లో మత్తు .. నిఘాతో చిత్తు



హైదరాబాద్: విశ్వవిద్యాలయాల ప్రాంగణాల్లో మాదక ద్రవ్యాల పేరు వినిపించకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ అధికారులు కార్యాచరణ రూపొందించారు. యూనివర్సిటీ క్యాంపస్‌లు, వసతి గృహాల్లో మత్తుపదార్థాలు కనిపించకుండా చర్యలు చేపట్టనున్నారు. 'డ్రగ్స్ ఫ్రీ' క్యాంపస్‌లుగా మార్చేందుకు నిర?యం తీసుకున్నారు. రెండు వర్సిటీల్లో చదువుకుంటున్న కొందరు గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడటం, మరికొందరు డ్రగ్స్ విక్రయిస్తూ దొరికిపోవడం వంటి ఘటనలను పరిగణనలోకి తీసుకుని ఆ ఒరవడికి చెక్‌పెట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా నిఘా బృందాలను నియమించనున్నారు.

నిరంతరాయంగా పర్యవేక్షణక్యాంపస్‌లలో మత్తు పదార్థాల వినియోగంపై నిరంతర నిఘా ఉంచనున్నారు. వసతి గృహాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద కదలికలను గుర్తించేందుకు సీసీ కెమెరాలను అమర్చనున్నారు. దీంతోపాటు డ్రగ్స్ వినియోగం, విక్రయాలపై సమాచారం తెలుసుకునేందుకు వాలంటీర్లను నియమించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వాలంటీర్లుగా పనిచేయవచ్చు. వీరు విద్యార్థులతో కలిసి తిరుగుతూ రాత్రివేళల్లో క్యాంపస్‌లను వదిలేసి తరచూ బయటకు వెళ్తున్న విద్యార్థుల వివరాలను సేకరించనున్నారు. విద్యార్థులకు గంజాయి విక్రయించేందుకు ఎవరైనా ప్రయత్నించినా వెంటనే సమాచారం వచ్చేలా ప్రతి వసతిగృహంలో కొందరు వేగులను ఏర్పాటు చేసుకోనున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయన్న సమాచారాన్ని ఈగల్ బృందాలతో పంచుకున్నారు. దీంతో కొద్దిరోజుల నుంచి అక్కడ గంజాయి సరఫరా, వినియోగం తగ్గిపోయాయి.

**అవగాహన సదస్సుల నిర్వహణ**

మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలను విద్యార్థులకు తెలిపేందుకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. మత్తు పదార్థాలు వినియోగించి పట్టుబడితే ఎదురయ్యే ఇబ్బందులు, జైలుకు వెళ్లే పరిస్థితులపై వివరించనున్నారు. 'మాదకద్రవ్య రహిత' క్యాంపస్‌గా మార్చేందుకు కార్యాచరణను సిద్ధం చేశామని, త్వరలో అమలు చేస్తామని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా.కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

# బల్దియాల్లో డీజిల్ దొంగలు!

కరీంనగర్ : పుర, నగరపాలికల్లో వాహనాల వినియోగం పెరిగింది. పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఇతరత్రా పనుల కోసం రూ.15 లక్షల నుంచి రూ.80 లక్షల విలువైన ఆధునిక యంత్రాలను కొనుగోలు చేశారు. వీటికి డీజిల్ వినియోగంపై నమోదులో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌లలో ఏటా లక్షలాది రూపాయలను కేవలం ఇంధనం కోసమే వెచ్చిస్తున్నారు. రెండు వాహనాలు తిరిగిన చోట నాలుగైదు రాసి ప్రజాధనం కొల్లగొడుతున్నారు.

**జీపీఆర్ఎస్ లేక..**

పుర, నగరపాలికల్లో నడిచే ప్రతి వాహనానికి జీపీఆర్ఎస్‌ను ఏర్పాటు చేస్తే ఎక్కడికి వెళ్తుందనే సమాచారం ఇట్టే తెలుస్తుంది. దీంతోపాటు రోజులో ఎన్ని కిలోమీటర్లు నడిచిందో సమాచారం లభిస్తుంది. దీనివల్ల బిల్లుల చెల్లింపు విషయంలో ప్రామాణికత కనిపించేది. కానీ ఇలా ఏ ఒక్కచోట కూడా పారదర్శకమైన విధానాన్ని అవలంబించడం లేదు. మరోవైపు అధికారుల వాహనాలతోపాటు గతంలో ప్రజాప్రతినిధులుగా ఉన్న కౌన్సిలర్లు, కార్పొరేటర్లలో కొందరికి బల్దియా సొమ్ముతోనే డీజిల్ పోయించారనే విమర్శలున్నాయి. అసలే అరకొర నిధులతో అభివృద్ధి కుంటుపడుతున్న తరుణంలో ఇంధన సొమ్మునైనా పక్కాగా ఖర్చుచేస్తే



విలువైన ప్రజాధనం ఆదా కానుంది.

జమ్మికుంట పురపాలిక కార్యాలయంలో గత నెల 26న అనిశా అధికారులు విచారణ చేపట్టారు. చదును చేసే ట్రాక్టర్‌కు రోజుకు రూ.5 వేల డీజిల్ వినియోగించినట్లు రికార్డులో పేర్కొనడంతో అనుమానించారు. అప్పుడప్పుడు వినియోగించే ఆ ట్రాక్టర్‌కు ప్రతి రోజూ డీజిల్ ఖర్చులెందుకు రాశారని ప్రశ్నించగా సిబ్బంది నుంచి పొంతన లేని సమాధానమొచ్చింది. డీజిల్ వినియోగంలో అక్రమాలు గుర్తించినట్లు అనిశా అధికారులు ప్రకటించారు. దీంతో పాటు కార్యాలయ తనిఖీల్లో రూ.41 వేలు రసీదులకు అదనంగా ఉండటంతో వాటిని సీజ్ చేశారు.

గతంలో కరీంనగర్ కార్పొరేషన్‌లోనూ డీజిల్ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా నీటి ట్యాంకర్ల ట్రాక్టర్‌ల నుంచి డీజిల్‌ను సిబ్బంది బయటకు తీస్తున్న వీడియోలు బయటకొచ్చాయి. జనరేటర్లకు ఇంధనం వినియోగించకున్నా రోజూ పోస్తున్నట్లు లెక్కలు రాశారని కొందరు సామాజిక కార్యకర్తలు సహచట్టం వివరాలతో బహిర్గతం చేశారు. విద్యుత్తు అంతరాయం లేకున్నా డీజిల్ కోసం రూ.15-20 వేలు వెచ్చించిన తీరు, అదనంగా లీటర్ల కొద్దీ ఇంధన దుర్వినియోగంపై విమర్శలొచ్చాయి.

రామగుండం కార్పొరేషన్‌లో ప్రతి నెలా పెట్రోల్, డీజిల్ ఖర్చులో రూ.6 లక్షల వరకు అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాల విషయంలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఇంధన లెక్కలు తీశారు. జగిత్యాల పురపాలికలో గతేడాది మార్చిలోనే రూ.16 లక్షలు నకిలీ బిల్లులు రికార్డుల్లో పొందుపర్చినట్లు విమర్శలొచ్చాయి. ఏటా రూ.అర కోటికి పైగా దుర్వినియోగమవుతుండటంపై ఫిర్యాదు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

# మీ ఊరు.. మీ హక్కు

గ్రామపంచాయతీలో నిర్వహించే 'గ్రామసభ' సర్పంచి నుంచి సామాన్యుడి వరకు ఒకే వేదికపై కూర్చొని సమస్యలపై గొంతెత్తే ప్రజాస్వామ్య వేదిక. గ్రామాభివృద్ధికి నిర?యాలు, తీర్మానాలు చేసేచోటు. ఇందులో చేసే ప్రతి సంతకం, తీర్మానం ఊరి భవిష్యత్తును నిర?యించే శాసనం. గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులు, ఏదైనా పని జరగాలంటే గ్రామసభ ఆమోదం తప్పనిసరి. గ్రామ పంచాయతీలో నిర్వహించే గ్రామసభకు గైర్హాజరవటం అంటే ఊరి అభివృద్ధిని ఇతరుల చేతుల్లో పెట్టడమేనని గుర్తుంచుకోవాలి.

**గ్రామసభలో సభ్యులెవరంటే?**

గ్రామసభలో గ్రామంలోని ఓటర్లందరూ సభ్యులుగా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి సభకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, ఎమ్మెల్యే, మంత్రులు, కలెక్టర్ శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. సర్పంచి అధ్యక్షతన గ్రామసభలో గ్రామ అభివృద్ధిపై చర్చిస్తారు.



**ఫిర్యాదు చేయొచ్చు**

తీర్మానాల్లో అవకతవకలు జరిగాయని ఎవరైనా భావిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయొచ్చు.తీర్మానాలను సమీక్షించే అధికారం కలెక్టర్‌కు ఉంటుంది. ఆమోదయోగ్యంగా లేనివాటిని కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో రద్దు చేస్తారు. పంచాయతీరాజ్ చట్టంప్రకారం ఏడాదికి ఆరుసార్లు గ్రామసభ నిర్వహించాలి. సర్పంచి అధ్యక్షతన గ్రామసభ కొనసాగుతుంది. సర్పంచి లేనిపక్షంలో ఉపసర్పంచి నిర్వహిస్తారు.గ్రామ సభలో చర్చించిన అంశాలు, నిర?యాలను తీర్మానాల రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. మెజారిటీ సభ్యులు ఒక పనికి అంగీకరిస్తే దాన్ని తీర్మానంగా మారుస్తారు. తీర్మాన ప్రతిని మూడు రోజుల్లోగా ఉన్నతాధికారులకు పంపిస్తేనే నిధులు మంజూరవుతాయి.

**కోరం తప్పనిసరి!**సాధారణంగా మొత్తం ఓటర్లలో పదోవంతు లేదా గ్రామ జనాభాను బట్టి నిర?యించిన సంఖ్యలో సభ్యులు హాజరుకావాలి. నిరీ?త గడువులోగా కోరం లేకపోతే సభను రెండు గంటల పాటు వాయిదా వేస్తారు. అప్పటికీ లేకపోతే ఉన్నవారితోనే గ్రామసభను కొనసాగిస్తారు. గ్రామ ఓటర్లు గ్రామసభకు హాజరుకాకపోవడంతో సర్పంచి, ఉపసర్పంచి అనుకూలమైన వారితో తీర్మానాలు చేయించుకునే ఆస్కారముంది.

# కొత్త బస్సులు.. అధునాతన హంగులు

హైదరాబాద్ : అధునాతన హంగులతో రూపుదిద్దుకున్న 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కాయ్. అత్యాధునిక భద్రత ప్రమాణాలు, దివ్యాంగులు , వృద్ధుల ప్రయాస తీర్చే అనేక సదుపాయాలు వీటిలో ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి కొండాపూర్, ఇస్నాపూర్, బోరబండ, రామాయంపేట్, గచ్చిబౌలి, మియాపూర్ క్రాస్‌రోడ్స్ మార్గాల్లో వీటిని తిప్పనున్నారు.

**సదుపాయాలివే..**

ప్రయాణికుల సామర్థ్యం 36. సీట్‌బెల్ట్ తప్పనిసరి.

12 మీటర్ల లోఫ్లోర్ యాక్సెల్ – గుంతల్లో బస్సుకు డ్యామేజీ జరగకుండా లోఫ్లోర్ యాక్సెల్ సదుపాయం ఉంది. దీని ద్వారా బస్సును 12 మీటర్ల వరకు ఎత్తు పెంచొచ్చు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, వికలాంగులు బస్సు ఎక్కే సమయంలోనూ ఈ సదుపాయం ఉపయోగపడనుంది

లిథియం అయాన్ బ్యాటరీలు – 1.5 గంటల ఛార్జింగ్‌తో 250 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.

అడ్వాన్స్‌డ్ మోటార్ కంట్రోల్ సిస్టమ్ – ఆటోమెటిక్ వ్యవస్థ ద్వారా బటన్ నొక్కితే ముందుకు, వెనక్కి వెళ్లొచ్చు.



ఫైర్ డిటెక్షన్ అండ్ సస్పెన్షన్ సిస్టమ్ – 3 ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు (డ్రైవర్ వద్ద 1, ప్రయాణికులకు సమీపంలో 2)

న్యూమాటిక్ డోర్స్ – బస్సు తలుపులు మూస్తేనే ముందుకు కదిలే వ్యవస్థ, ఫుట్‌బోర్డుకు ఆస్కారం ఉండదు.

ఛార్జింగ్ – ప్రతి సీటు వద్ద యూఎస్‌బీ సదుపాయం.

నాలుగు సీసీ కెమెరాలతో నిఘా – ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండేలా నాలుగు సీసీ కెమెరాలు అమర్చారు.

ఎత్తైన ప్రదేశాల్లో బస్సు ఆగిపోతే వెనక్కి కదలదు.

వేగం గంటకు 55 కిలోమీటర్లకు పరిమితం.

దివ్యాంగులు ఎక్కేలా వీల్‌ఛైర్ కోసం ప్రత్యేక ప్రదేశం.

డ్రైవర్‌కు సందేశం పంపేలా ప్రయాణికులకు ప్రత్యేక 'స్టాప్' బటన్.

అత్యవసర సమయాల్లో కిటికీలు బద్దలు కొట్టేలా విండో బ్రేకింగ్ సిస్టమ్.

# మూడు రోడ్లు.. ఆరు షెడ్లు

హైదరాబాద్ : అవుటర్ రింగ్ రోడ్డు గ్రోత్ కారిడార్ మాస్టర్‌ప్లాన్‌కు కొందరు తూట్లు పొడుస్తున్నారు. హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకోకుండానే గ్రిడ్ రోడ్లు, షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. తాజాగా కోకాపేట ట్రంపెట్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు స్థలంలోకి గ్రిడ్ రోడ్డు నిర్మించిన వైనం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ తరహా అక్రమాలు ఇతర ప్రాంతాల్లోనూ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే ప్రాంతంలో ఓ ప్రైవేటు వ్యక్తి తన స్థలంలో ఏకంగా భవనాలను నిర్మించాడు. ఇది ప్రస్తుతం జీఓ 111లో భాగం. 158 కిలోమీటర్ల మేర చాలా ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ నిర్మాణాలున్నాయి. ఐటీ కారిడార్, పటాన్‌చెరు, శంషాబాద్, కొల్లూరు, ఘట్‌కేసర్, నార్సింగి.. ప్రాంతాల్లో ఓఆర్ఆర్ గ్రోత్‌కారిడార్ మాస్టర్‌ప్లాన్‌ను తుంగలోకి తొక్కినట్లు స్పష్టమవుతోంది. అక్రమ లేఅవుట్లతోపాటు వాటికి గ్రిడ్ రోడ్లు నిర్మించి నేరుగా ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లకు కలపడం.. షెడ్లు, భవనాలు, ఇళ్లు నిర్మించడం గమనార్హం. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతోపాటు హెచ్‌ఎండీఏ నుంచి అభ్యంతరాలు లేకపోవడంతో అక్రమాలు మూడు పూలు ఆరు కాయలుగా నడుస్తున్నాయి.

**నిబంధనల ఉల్లంఘన ఇలా..**

ఈ జోన్‌లో రోడ్ల వెడల్పు, ఓపెన్ స్పేస్, పార్కులు, గ్రీన్ బఫర్లు, బిల్డింగ్ నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. అలా జరగలేదు. ః అవుటర్ రింగ్ రోడ్డు పైకి ఎలా పడితే అలా రాకుండా నియంత్రణ ఉంది. కేవలం 22 జంక్షన్ నుంచే అవుటర్‌పైకి వెళ్లాలి. అవుటర్ పైకి రావాలంటే సర్వీసు రోడ్లే కీలకం. ఈ సర్వీసు రోడ్లకు



అనుసంధానంగా గ్రిడ్ రోడ్లు ఉంటాయి. మాస్టర్‌ప్లాన్‌లో ఎక్కడ గ్రిడ్ రోడ్లు నిర్మించాలో కూడా స్పష్టంగా ఉంది.

అవుటర్ రింగ్ రోడ్డుకి ఇరువైపులా ఒక కిలోమీటర్ వెడల్పుతో ఉన్న ప్రత్యేక అభివృద్ధి జోన్‌ను గ్రోత్‌కారిడార్‌గా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతానికి హెచ్‌ఎండీఏ ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేసింది. భవిష్యత్తులో అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ కీలకం కానున్న దృష్ట్యా ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. భవిష్యత్తులో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీతోపాటు ప్రమాదాలకు నెలవు కానున్నాయి. ఇప్పటికైనా హెచ్‌ఎండీఏ అధికారులు దృష్టిసారించి ఇలాంటి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

అవుటర్ పరిసర ప్రాంతాల్లో భారీ స్థాయిలో రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు రానుండటంతో అస్తవ్యస్తంగా కాకుండా ఒక ప్రణాళికాబద్ధంగా ఉండేందుకు ఈ ప్రత్యేక గ్రోత్ కారిడార్ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంటోంది.

ఈ నిబంధనలు పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ గ్రిడ్ రోడ్లు నిర్మిస్తున్నారు. వాటిని నేరుగా సర్వీసు రోడ్లకు కలుపుతున్నారు. ఇది చాలా ఇబ్బందికరం.

# పట్టణ రోడ్లు.. నడ్డి విరుస్తున్నాయ్



సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ పరిధిలోని పలు రహదారులు గుంతలమయం అయ్యాయి. దీనికితోడు మిషన్ భగీరథ పైప్‌లైన్, కేబుల్ వైర్ల తవ్వకాలతో ఏర్పడిన గుంతలతో పట్టణ ప్రజల గుండెల్లో వణుకు పుట్టిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో రహదారులు తవ్వారు. దీంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు కాకుండా వార్డుల్లో వేసిన సీసీ, బీటీ రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. ఇలా చాలాచోట్ల గుంతలను అలాగే వదిలేశారు.

**ప్రధానంగా ఎక్కడెక్కడంటే..**

పట్టణంలోని గాంధీనగర్ కూరగాయాల మార్కెట్ లోపలికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గుంతలు పడి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో.. రైతులు, వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే గుంతలు పూడ్చి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**కేబుల్ తీగల కోసం..**

పలు టెలికాం సంస్థలు ప్రభుత్వ అనుమతులు తీసుకొని రహదారులను ఇష్టానుసారంగా తవ్వి కేబుల్ తీగలు వేస్తున్నారు. ఎప్పటికప్పుడు రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉండగా అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎంత జాగ్రత్తగా ప్రయాణించినా కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడక తప్పడంలేదు. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పెద్దబజార్ నుంచి విమల్ థియేటర్‌కు వెళ్లే రోడ్డు ఏళ్లుగా గుంతలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి వేళ గుంతలు కనిపించపోవడంతో వాహనాలు అదుపుతప్పి వాహనదారులకు గాయాలవుతున్నాయి. బాగు చేయాలని పలుసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా.. పట్టించుకునేవారే లేరని వాపోతున్నారు.

కోనరావుపేట ప్రధాన చౌరస్తా వద్ద, అంబేడ్కర్ కూడలి నుంచి కొత్త బస్టాండ్ ప్రధాన రహదారికి ఇరువైపులా, గీతానగర్ ప్రభుత్వ పాఠశాల నుంచి ఎల్లమ్మ కూడలి వరకు అధ్వానంగా ఉన్నాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ఆసుపత్రికి వెళ్లాల్సిందే అనేలా ఉన్నాయి.

# సన్న బియ్యంలో నూకలు



జగిత్యాల : చిత్రంలో కనిపిస్తోంది జగిత్యాల అర్బన్ మండలంలోని ఓ రేషన్ దుకాణం పరిధిలో లబ్ధిదారుకు అందజేసిన సన్న బియ్యం. ఇందులో దాదాపు 30 శాతం నూకలుండగా 5 శాతం వరకు దొడ్డు బియ్యం వచ్చాయి. రేషన్ దుకాణాల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతుండగా దొడ్డు గింజలు, నూకలతో కూడిన సరకు వస్తోందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

షన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇన్నాళ్లూ దొడ్డు రేషన్ బియ్యం తినలేక, బయటి మార్కెట్‌లో అధిక ధరలతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు సన్న బియ్యం ఉచితంగా అందడంతో సంతోషించారు. కాగా ఈ నెలలో నూకలతో కూడిన బియ్యం వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 592 రేషన్ దుకాణాలుండగా ఆహారభద్రత, అంత్యోదయ కార్డులు కలిసి 348,058 ఉన్నాయి. వీటన్నింటికీ ప్రతి నెలా దాదాపు 6,391 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు.

సన్న బియ్యంలో వచ్చిన దొడ్డు గింజలు

మిల్లుల్లోనే కల్తీ!

సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద ప్రభుత్వం ధాన్యాన్ని మర ఆడించేందుకు మిల్లర్లకు ఇస్తోంది. వారు బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థకు అప్పగిస్తారు.

బియ్యాన్ని గోదాములకు తరలించే క్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించాల్సి ఉంటుంది. కాగా మిల్లర్ల నుంచి వచ్చే మామూళ్లకు అలవాటు పడి పరీక్షలు చేయకుండానే గోదాములో దించుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దీంతో సన్న బియ్యంలో నూకలు, దొడ్డు బియ్యం కలుపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత నెలలోనూ సన్న బియ్యంలో నూకలు రాగా డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

పెద్దపల్లి నుంచి వచ్చే బియ్యమే కల్తీ జరుగుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. పరిశీలించకుండా బియ్యాన్ని రేషన్ దుకాణాలకు ఎలా సరఫరా చేస్తారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇలాగే సరఫరా చేస్తే తమకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అధికారులు పర్యవేక్షించి నూకలు రాకుండా నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రేషన్ బియ్యంలో నూకలు వచ్చినట్లు నా దృష్టికి రాలేదు. దుకాణాల్లో పరిశీలించి నూకలుంటే ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మరోసారి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ డీఎం

# లక్షల లీటర్ల శుద్ధ జలం వృథా

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో లీకేజీల కారణంగా రోజుకు లక్షల లీటర్ల శుద్ధజలం వృథాగా పోతోంది. నగరంలో కొన్ని ప్రాంతాలకు రోజూ నీటి సరఫరా జరుగుతుండగా.. మరికొన్ని చోట్ల రోజు విడిచి రోజు అందిస్తున్నారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆయా రిజర్వాయర్ల పరిధిలో నగరవాసులకు శుద్ధజలం పంపిణీ చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు అవుతుండగా, నియంత్రణ వాల్వులు చెడిపోతున్నాయి. వాటిని సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల తాగునీరు కలుషితం కూడా అవుతోంది.

**కార్మికుల కొరత.. లీకేజీల వెత**

హైలెవల్, లోలెవల్ జోన్ పరిధిలో 17 రిజర్వాయర్లు ఉన్నాయి. హైలెవల్ ప్రాంతంలో మొత్తం నలుగురు ఉండగా అందులో ఒకరు ఉద్యోగ విరమణ పొందారు. మరొకరు తరచూ విధులకు గైర్హాజరవుతుంటారు. ఇద్దరిపై భారం పడుతోంది. లోలెవల్ పరిధిలో ముగ్గురు ఉన్నారు. తక్కువ మంది కార్మికులతోనే లీకేజీలను పరిష్కరించాల్సి రావడంతో పైపులు పగిలిన చోట మరమ్మతులకు జాప్యం అవుతోంది.

**పది నెలలుగా అవస్థలు**

నగరవ్యాప్తంగా లీకేజీలను, వాల్వ్‌ల మరమ్మతులు చేసేందుకు 55 మంది లీకేజీ కార్మికులు పని చేసే వారు. వీరిని పది నెలల కిందట తొలగించడంతో పని భారం అధికమైంది. ప్రస్తుతమున్న ఇన్‌ఛార్జి లైన్‌మెన్లను లీకేజీలు సరి చేసేందుకు పంపుతుండటంతో ట్యాంకుకు ఇద్దరే మిగిలారు. అందులో ఒకరు పంపు ఆపరేటర్, మరొకరు లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఏ ఒక్కరూ సెలవు పెట్టినా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేళాపాళా లేకుండా తిరగడంతో సరఫరా సమయాల పై ప్రభావం పడుతోంది. అంతేకాకుండా లీకేజీల మరమ్మతులు చేసే వారు లేకుండా పోతున్నారు.

**పట్టించుకోని అధికారులు**



అన్ని డివిజన్లలో తాగునీటి పైపులైన్లు పగలడం, వాల్వులు చెడిపోయి నీరంతా బయటకు రావడం, శుద్ధజలం రోడ్లపై ప్రవహిస్తున్నా మరమ్మతులు చేయడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయాల్సి ఉండగా రోజుల తరబడి అలాగే ఉంటున్నాయి. నీటి విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో వీటి సంఖ్య పెరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నల్లా కనెక్షన్లు : 64,003

ప్రతి రోజు శుద్ధ జలం సరఫరా : 60 ఎంఎల్‌డీ

పైపులైన్ల దూరం : 609 కి.మీ

లీకేజీలు(సుమారు): 600

# నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన..!

ఖమ్మం : ఏటీసీ(ఐటీఐ)లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వివిధ రకాల కోర్సులను ప్రవేశపెడుతోంది. పారిశ్రామిక అవసరాలు తీర్చటానికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులను ఎంపిక చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇలాంటి పలు రకాల కోర్సులకు అర్హుల నుంచి ఖమ్మం నగరం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని సర్కారు భావిస్తోంది. కేవలం పదోతరగతి అర్హతపైనే ఈకోర్సులు చదువుకునే అవకాశముంది. ఎలాంటి వయోపరిమితి లేకపోవటం విశేషం. నైపుణ్య శిక్షణ ద్వారా సొంతంగా యూనిట్లు నెలకొల్పవచ్చు లేదా ప్రైవేటుగా ఉద్యోగాలు చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో టర్నర్, సోలార్ టెక్నీషియ




న్, డ్రోన్ ఆపరేటర్ లాంటి కోర్సులకు ఎక్కువ డిమాండ్ ఉంది.

**మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ..**

ప్రధానమంత్రి కౌశల్ పథకం ద్వారా ఖమ్మం ఏటీసీలో వివిధ రకాల స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ కోర్సులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ట్రైనింగ్ పూర్తయినట్లు సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ కోర్సులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది.

**కులవృత్తుల వారికీ..**

పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కులవృత్తుల వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇవి కేవలం 15 రోజుల కోర్సులు మాత్రమే. ప్రస్తుతం కార్పెంటర్(వడ్రంగి) పనిలో 20 మందికి శిక్షణ ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. త్వరలోనే శిక్షణ మొదలుపెడతారు. 'విద్యార్థులు స్వల్పకాలిక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని కులవృత్తులవారు తమ నైపుణ్యం పెంచుకునేందుకు ఇక్కడ శిక్షణ పొందవచ్చు. మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తాం' అని ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావుకు తెలిపారు.

# నోరూరించే.. నాంచారి పచ్చళ్లు

ఇల్లెందు : మెప్మా రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఏదైనా వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదగాలనే మహిళలకు మెప్మా అందిస్తున్న రుణాలు భరోసానిస్తున్నాయి. మెప్మా ద్వారా తీసుకున్న రుణంతో వ్యాపారం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పట్టణానికి చెందిన గిరిజన మహిళగొగ్గెల నాంచారిపై ప్రత్యేక కథనం..

ఇల్లెందు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన నాంచారి 18 ఏళ్ల క్రితం మెప్మాలో చేరి మణికంఠ గ్రూపు ద్వారా రూ.50వేలు రుణం తీసుకుని అల్లికలు, మగ్గం పనులు చేసేవారు. ఆ పనిలో ఆశించిన అభివృద్ధి లేకపోవడంతో మరో వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. నాంచారి వంటలు ఎంతో రుచికరంగా ఉంటాయని పలువురు ప్రోత్సహించడంతో ఆమెకు పచ్చళ్లు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. 8 ఏళ్ల క్రితం పచ్చళ్లు తయారు చేయడం ప్రారంభించారు. మొదట్లో మామిడి, ఉసిరి, కాకర, టమాటా, పచ్చిమిర్చి, నిమ్మకాయ వంటి పచ్చళ్లు తయారు చేసి సింగరేణి కార్మిక కుటుంబాలకు విక్రయించేవారు. దశలవారీగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని చికెన్, చేప, నాటు కోడి, ప్రాన్స్ తదితర పచ్చళ్లు తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ప్రస్తుతం రూ.2 లక్షల రుణం తీసుకుని రుచికరమైన పచ్చళ్లు చేయడంతో ఆర్డర్లు పెరిగి కుమారుడు ప్రశాంత్, కోడలు భవానీ సైతం పచ్చళ్ల తయారీలో నిమగ్నమై చేతి నిండా సంపాదించుకుంటున్నారు.

ఆర్నెళ్లుగా విదేశాలకు కొరియర్ ద్వారా వివిధ రకాల పచ్చళ్లు ఎగుమతి చేస్తున్నారు. ఇల్లెందులోని తన కుమారుడి దుకాణంలోనూ విక్రయాలు చేస్తున్నారు. నెలకు రూ. 40 వేలకు పైగా సంపాదిస్తున్నానని నాంచారి అన్నారు. కిలో చికెన్ పచ్చడి రూ.1000, ఉసిరి కాయ పచ్చడి పావుకిలో రూ.150 చొప్పున అమ్ముతున్నానన్నారు.

విదేశాలకు ఎగుమతి..నాంచారి తయారు చేసే పచ్చళ్లు ఇంటి వద్ద అమ్మడంతోపాటు, ఇల్లెందు, చుట్టు పక్కన మండలాలు, ఖమ్మం, కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెంనకు సరఫరా అవుతున్నాయి. సింగరేణి కార్మికుల కుటుంబాల్లోని పిల్లలు చాలా మంది అమెరికా, దుబాయ్ వెళ్లి స్థిరపడిన వారున్నారు. ఆమె పచ్చళ్లకు అలవాటు పడిన వారంతా ఆర్డర్లపై కుటుంబ సభ్యులతో తెప్పించుకుంటున్నారు. తేగాక సామాజిక మాధ్యమాలను ఆమె వినియోగించుకుంటూ పచ్చళ్ల వ్యాపారాన్ని పెంపొదించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

# అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

ఖమ్మం : ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కుకు వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉంది. నిర్మాణ పనులు నిలిచిపోవటంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. నిత్యం వేల మంది ఈ రహదారిలోనే అటవీ పార్కును సందర్శించేందుకు వెళ్తుంటారు. రోడ్డు నిర్మాణం కోసం 2024, నవంబరు నెలలో నగరపాలక సంస్థ నిధులు రూ.2కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వైరారోడ్డు నుంచి పార్కు వరకు సీసీ రోడ్డును, డివైడర్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రధాన రోడ్డు నుంచి కొద్ది దూరం వరకు రోడ్డు పూర్తి కాలేదు. కంకరలేచి ఉంది. అదేవిధంగా మధ్యలో కొంతదూరం వరకు డివైడర్లను నిర్మించారు. వాటికి ఇరువైపులా ఉన్న రోడ్డును ఇంతవరకు పూర్తి చేయలేదు. స్థల వివాదం నేపథ్యంలోనే పనులకు బ్రేక్ పడిందని తెలుస్తోంది. ఇంకోపక్క కంకర లేచి ఉండటంతో సందర్శకులు నడవాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కు నుంచి బయలుదేరి ప్రధాన రోడ్డు వరకు రావాలంటే తల ప్రాణం తోకకు వచ్చినట్టవుతోంది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు సైతం వెళ్లేందుకు కూడా రోడ్డు అనుకూలంగా లేదు. శని, ఆదివారాల్లో పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ అధికారులను వివరణ కోరగా నిర్మాణ స్థలం తమదంటూ కొందరు ప్రతిఘటించటంతో పనులు నిలిచిపోయినట్టు తెలిపారు.

# కోళ్లకు చలిగండం

ఎలమంచిలి : జిల్లాలో చలిబాగా పెరగడంతో బాయిలర్, లేయర్ కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోతున్నాయి. రెండురోజుల్లో 30 వేలకు పైగా పిల్లకోళ్లు, 20 వేలకు పైగా పెద్దకోళ్లు చనిపోయాయి. కోళ్ల మరణాలను నిలువరించడానికి రైతులు షెడ్ల చుట్టూ పరదాలు కడుతున్నారు. తాగడానికి వేడి నీళ్లు, బొగ్గు కుంపట్లు పెట్టి వెచ్చదనాన్ని కలిగిస్తున్నారు. ఇన్ని చేసినా మరణాలు తగ్గకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పిల్ల దశలో ఉన్న కోళ్లకు కుంపట్లు పెట్టడానికి భారీ ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వీస్తున్న చలిగాలులు కోళ్లకు ఇబ్బందిగా మారాయి. ఈ గండం నుంచి కోళ్లను కాపాడుకోవడానికి రైతులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. వేడిని ఇచ్చే అత్యధిక ఓల్టేజి గల



విద్యుత్ బల్బులను వాడుతున్నారు. గుడ్డుకు, మాంసానికి ధర బాగున్న సమయంలో వాతావరణం ప్రతికూలంగా మారడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

**వేల సంఖ్యలో చనిపోతున్నాయి**

జిల్లాలో చలిపెరగడంతో ఒక్క మా ఫారంలోనే పిల్లకోళ్లు 3 వేలు, పెద్దకోళ్లు రెండు వేలు చనిపోయాయి. పిల్లకోళ్లకు కుంపట్లు పెట్టి తాగడానికి వేడినీళ్లు ఉంచుతున్నాం. పెద్ద కోళ్లకు ఉదయాన్నే బోరు నుంచి వచ్చే నీరు మారుస్తున్నాం. అయినా మరణాలు ఆగడం లేదు. పాపారెడ్డి, ఎలమంచిలి ఉమ్మడి విశాఖ జిల్లాలో గుడ్లు పెట్టే కోళ్ల సంఖ్య : 21 లక్షలు

బాయిలర్ కోళ్ల సంఖ్య : 50 లక్షలు

పెరుగుతున్న పిల్ల కోళ్లు : 20 లక్షలు

# సీమ గుమ్మం.. పరిశ్రమల గమ్యం

కర్నూలు : సీమ గుమ్మంలో పారిశ్రామికాభివృద్ధికి చకచకా అడుగులు పడుతున్నాయి. ఓర్వకల్లులోని 'మెగా ఇండస్ట్రియల్ హబ్'లో పరిశ్రమల ఏర్పాటుకు పలు కంపెనీలు ముందుకొస్తున్నాయి. హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారిలో ఉన్న ఓర్వకల్లు నోడ్ అభివృద్ధికి రూ.2,870.39 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం ముందుకొచ్చింది. ఇప్పటికే రూ.వెయ్యి కోట్లు విడుదల చేసింది. తొలి దశలో 2,600 ఎకరాల్లో భారీ పారిశ్రామిక వాడను అభివృద్ధి చేస్తున్నారు. రూ.56,244.25 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకోగా.. ఇందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోద ముద్ర పడింది. వీటి ఏర్పాటు వల్ల ప్రత్యక్షంగా 17,826 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. పరోక్షంగా పదివేల మందికి ఉపాధి దక్కే అవకాశం ఉంది.

**బ్రాహ్మణపల్లిలో అతిపెద్ద ప్లాంటు**

రియలన్స్ సంస్థ బ్రాహ్మణపల్లి పరిధిలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బేవరేజెస్ ప్లాంటును ఇక్కడ నిర్మిస్తోంది. 170 ఎకరాల్లో రూ.2,380.02 కోట్ల వ్యయంతో బేవరేజెస్, కన్జూమర్ ఉత్పత్తుల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది.

చాకొలెట్లు, స్నాక్స్, నూడుల్స్, ఆటా, బియ్యం, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తుల ప్యాకేజింగ్ కూడా ఈ ప్రాంగణంలోనే చేయనుంది. ఈ ఒక్క సంస్థ కారణంగానే సుమారు 5 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

గుట్టపాడులో ఉపాధి వెలుగులు

సిగాచి ఇండస్ట్రీస్ సంస్థ గుట్టపాడులో 25 ఎకరాల్లో రూ.280 కోట్లతో ఓ పరిశ్రమను స్థాపించబోతోంది. దీంతో పాటు ఆర్పీఎస్ ఇండస్ట్రీస్ సంస్థ 11 ఎకరాల్లో రూ.90 కోట్ల వ్యయంతో మరో పరిశ్రమను ఏర్పాటు చేయబోతోంది. ఈ రెండు కర్మాగారాల ఏర్పాటుతో 1130



మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. వీటితో పాటు సిగాచి సంస్థ మరో రూ.వెయ్యి కోట్లు కర్నూలులో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చింది.

సెమీ కండక్టర్ల రూపకల్పన

ఓర్వకల్లు సెమీ కండక్టర్ల తయారీ కేంద్రంగా రూపాంతరం చెందడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జపాన్‌కు చెందిన ఇటోయే మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, భారత్‌కు చెందిన హైడ్రస్, బీఎస్ గ్రూప్‌లు కలిపి మొత్తం రూ.14 వేల కోట్లతో సెమీ కండక్టర్ల పరిశ్రమ ఏర్పాటుకు ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్నాయి.

ఇండిచిప్ సెమీ కండక్టర్ సంస్థ కర్నూలులో రూ.22,976 వేల కోట్లతో పరిశ్రమ స్థాపించేందుకు ముందుకొచ్చింది. ఈ రెండు పరిశ్రమలు ఏర్పాటైతే ఉమ్మడి జిల్లా యువతకు కనీసం 20 వేల ఉద్యోగాలు వస్తాయని నిపుణుల అంచనా వేస్తున్నారు.

ఇక్కడే.. డ్రోన్ నగరం

డ్రోన్ల రంగంలో రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో పరిశ్రమలు ఏర్పాటు చేయించే లక్ష్యంతో ప్రభుత్వం కర్నూలులో డ్రోన్ సిటీని ఏర్పాటు చేసింది. గతేడాది నవంబరు 14వ తేదీన దీనికి విశాఖ సీఐఐ సదస్సు నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.

లేఅవుట్ ఏర్పాటు చేసిన వెంటనే ఇక్కడ డ్రోన్ల తయారీ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. కర్నూలు ట్రిపుల్ ఐటీ డీఎం భాగస్వామ్యంతో డ్రోన్ల రంగంలో గణనీయ అభివృద్ధి సాధించేందుకు వీలుగా ప్రభుత్వం మార్గసూచీని సిద్ధం చేసింది. డ్రోన్ల రంగంలో పెద్దఎత్తున ఉపాధి లభించేలా త్వరలో శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది.

**మన వద్దే విద్యుత్తు వాహనాల తయారీ**

విద్యుత్తుతో నడిచే వాహనాలకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కర్నూలును ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రంగా మార్చడానికి వీలుగా 'ఈవీ పార్క్' ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర?యించింది.

1,200 ఎకరాల్లో ఏర్పాటు కాబోయే ఈ ప్రాజెక్టులో మొత్తం రూ.13 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయి. ఈ ఒక్క ఈవీ పార్క్ ద్వారానే ఏకంగా 25 వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

# గర్భిణులు కేజీహెచ్‌కు వెళ్లక్కర్లేదిక!



అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ఆధునిక స్కాన్‌ను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టారు. జిల్లా ఆసుపత్రికి తగ్గట్టుగా సౌకర్యాలు మెరుగుపరిచేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష? ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వసతులు కల్పించేలా చొరవ చూపుతున్నారు. ఈ ఆసుపత్రిలో నెలకు 300కి పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. రోజుకు 200కి పైగాగర్భిణులు చికిత్సకు వస్తుంటారు. టిఫా స్కాన్ అందుబాటులోకి లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి ఎమ్మెల్యే కొణతాల తీసుకు రాగా వెంటనే ఆయన స్పందించి మంజూరుచేశారు. గరరేలో బిడ్డ ఎదుగుదలతో ఏమైనా లోపాలుంటే వాటిని ఈ స్కాన్ ద్వారా గుర్తించడానికి వీలుంటుంది. ఇది ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటుగా తీయించుకోవాల్సి వస్తోంది. దీనికి రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ప్రైవేటు క్లినిక్‌లలో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ సేవలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నారు.

ఆసుపత్రిలో ప్రస్తుతం ఒక రేడియాలజిస్టుతో సేవలు అందిస్తున్నారు. గరిణుల్లో అవసరమైన వారికి ఈ స్కాన్‌ను తీస్తారు. ఇది చేయడానికి ఒక్కొక్కరికీ గంట వరకు సమయం పడుతుంది. ఆసుపత్రిలో ఈ సేవలను మరింత మెరుగుపరిచేలా పీజీ రేడియాలజిస్టులతో సేవలు అందించేలా చర్యలు చేపట్టేలా వైద్యాధికారులు చర్యలు చేపడుతున్నారు.

**మెరుగైన సేవలందేలా చర్యలు**అనకాపల్లి జిల్లా ఆసుపత్రిల్లో అన్ని రకాల వైద్య సేవలందించేలా చర్యలు చేపడుతున్నాం. ఆసుపత్రిలో గైనిక్ సేవలు బాగున్నాయి. సాధారణ ప్రసవాలు ఎక్కువగా జరుగుతున్నాయి. టిఫా స్కాన్‌ను అందుబాటులోకి తెస్తున్నాం. సీటీ స్కాన్, డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్ అందుబాటులోకి వస్తుంది. సీఎస్ఆర్ నిధులతో ఆధునిక శస్త్రచికిత్స గదులు, రోగుల బంధువుల నిరీక్షణ భవనం నిర్మించాం. కేజీహెచ్‌కు పంపకుండా ఇక్కడే పేదరోగులకు వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం.కొణతాల రామకృష, అనకాపల్లి ఎమ్మెల్యే

# వాగైనా కప్పేస్తాం.. ఏదైనా చేసేస్తాం!!



విశాఖపట్నం : కొనుగోలు చేసిన భూములకు దగ్గర మార్గాన్ని ఎంచుకునే క్రమంలో జలవనరుని కప్పేశారు. రాత్రికి రాత్రే రోడ్డు నిర్మించేశారు. జాతీయ రహదారి నుంచి ఆ భూములకు వేగంగా చేరుకునేందుకే ఆ దారుణమంతా. ఆనందపురం మండలం గిడిజాలలో ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విశాఖ నగర సమీప భూములకు ఇటీవల భాగా విలువ పెరుగు తుండటంతో ఎక్కడికక్కడ ఇలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**రాత్రికి రాత్రే:** విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంత కొండలు, ఆనందపురంలోని బృహదాచల కొండల నుంచి ప్రవహించే వాగును గిడిజాల రెవెన్యూ పరిధిలో కొందరు దర్జాగా పూడ్చేశారు. వీరి భూములకు నీళ్ల కుండీల నుంచి దిబ్బడపాలెం గ్రామం మీదుగా వెళ్తే రెండు కిలోమీటర్ల దూరం ఉంటుంది. అలా కాకుండా నీళ్లకుండీలను ఆనుకొని ఓ ప్రైవేట్ లేఅవుట్ మీదుగా గెడ్డను దాటుకొని వెళ్తే జాతీయ రహదారికి 300 మీటర్ల దూరంలోనే ఉంటుంది. అందుకే ఎటువంటి అనుమతులు లేకుండా ఏకంగా నీటి ప్రవాహ వాగుపై 25 అడుగుల మేర రోడ్డు నిర్మించేశారు. రాత్రికి రాత్రి లారీలతో గ్రావెల్ తెచ్చి, గొట్టాలు ఏర్పాటు చేసి కప్పేశారు. గతంలో ఆ ప్రాంతం చెట్లు, పొదలతో ఉండేది. ఇప్పుడు వాటన్నింటినీ తొలగించారు. దీంతో ఆ ప్రాంతమంతా ఖాళీగా కనిపిస్తోంది. **ఎంతో కీలకమైన వనరు:** ఈ వాగు ఆనందపురం మండలంలోని గుడిలోవ ఛానల్‌కు ఆధారం. సుమారు 50 చెరువులు నిండాలంటే ఇది ప్రవహించాలి. మరో వైపు గంభీరం జలాశయానికి ప్రధాన వరద గెడ్డ కూడా ఇదే. సుమారు 25 కిలోమీటర్ల మేర వివిధ గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. అంతటి ప్రాధాన్యమున్న వాగును భూముల విలువ పెంచుకునేందుకు మూసేయడంపై విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి జలవనరులపై రోడ్డు నిర్మించాలంటే రెవెన్యూ, జలవనరులశాఖల నుంచి అనుమతి తీసుకోవాలి. ఇక్కడ అవేమీ లేకుండానే ఇష్టానుసారంగా చేపట్టారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

# 'గాలి'స్తుంది.. చుట్టేస్తుంది!!



విశాఖపట్నం: విశాఖలో గాలి నాణ్యతలో ఊహించనిరీతిలో మార్పులొచ్చాయి. ఉదయం, రాత్రి వేళల్లో నాణ్యత క్షీణించి ఒక్కోసారి కాలుష్య స్థాయిల్లో దిల్లీని దాటేస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (గాలి నాణ్యతా సూచీ) విశాఖలో గంటగంటకూ మారుతోంది.

గతేడాది డిసెంబరు 31 ఉదయం 4:30–5:30 గంటల మధ్య 732గా, 7:30–8:30 మధ్య 392గా నమోదైంది. 2025 డిసెంబరు 19న 350గా ఏక్యూఐ నమోదైంది. సాధారణంగా 200 దాటితే ప్రమాదం ఎక్కువ. ఈ ఏడాది జనవరి ఒకటిన సాయంత్రం గాలి నాణ్యత 216–240 వరకు నమోదైంది. ధూళి కణాలూ భయపెదుతున్నాయి.'విశాఖలో వాతావరణ కాలుష్యం ఇలా ఉందంటే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనం. ప్రజల ఆరోగ్యానికి అపారమైన హాని కలుగుతుంది. గాలిలో వ్యాపిస్తున్న కాలుష్యాన్ని శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా అరికట్టడానికి ప్రభుత్వాలు సమగ్ర ప్రణాళికలను అమలు చేయాలి' అని ఏపీపీసీబీ అధ్యక్షులు పి.కృష?య్యకు విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ గురువారం లేఖ రాశారు.

గతేడాది డిసెంబరు 31 ఉదయం 6:30 సమయంలో గాలిలో పీఎం 2.5 188 మైక్రోగ్రామ్/క్యూబిక్ మీటరుగా, పీఎం10 507గా నమోదైంది. ఈ ఏడాది జనవరి 1న పీఎం2.5... 131గా, పీఎం10 217గా నమోదైంది. సాధారణంగా పీఎం2.5...60బీ పీఎం10...100 దాటితే ప్రమాదకరం.

**కారణాలు ఇవే..**

భౌగోళికంగా చూస్తే విశాఖకు మూడు వైపులా కొండలు, ఒకవైపు సముద్రం ఉన్నాయి. శీతాకాలం గాలిలో వేగం తక్కువ. దీంతో కాలుష్యం దూరంగా వెళ్లలేని పరిస్థితి. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ గాల్లోనే ఉండి నగరాన్ని కమ్మేస్తోంది. ఉదయం, రాత్రి వేళల్లో... పైకి వెళ్లాల్సిన కాలుష్య కణాలు కిందనే నిలిచిపోతున్నాయి. పోర్టు నుంచి బొగ్గు రవాణా సమయంలో కోల్ డస్ట్ భారీగా గాలిలో కలుస్తుంది. స్టీలుప్లాంటు, హెచ్‌పీసీఎల్ వంటి ఆయిల్ రిఫైనరీలు, ఇతర భారీ పరిశ్రమల నుంచి ఉద్గారాలు విడుదలవుతున్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇవి వ్యాపిస్తున్నాయి. విశాఖ పోర్టులో కోల్ హ్యాండ్లింగ్ (బొగ్గు నిర్వహణ)పై దృష్టిపెట్టాలి. కన్వేయర్ బెల్టులకు డస్ట్ సప్రెషన్ సిస్టమ్స్, నిల్వలకు కవర్‌షెడ్లు, బహిరంగ నిల్వలపై నీటి తుంపర్లు, పరిశ్రమల చుట్టూ గ్రీన్‌బెల్ట్‌ల నిర్వహణపై దృష్టిపెట్టాలి. ఈ అంశాలపై పీసీబీ ఈఈ పైడి వెంకట ముకుందరావు'తో మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన ఐదు కంపెనీలకు నోటీసులివ్వడంతోపాటు రూ.10 కోట్లు జరిమానాగా విధించినట్లు తెలిపారు.వాతావరణం ఇలా ఉంటే.. ఆస్తమా బాధితులపై తీవ్రప్రభావం కంటి మంట, గొంతు నొప్పి వంటి లక్షణాలు వేధిస్తాయి.

# అన్న క్యాంటీన్ల పండగ

ఆచంట :: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలోని అన్న క్యాంటీన్లు పునరుద్ధరించడమే కాక మరో రెండు మంజూరు చేసింది. ఆచంట, ఉండి నియోజకవర్గాలకు కేటాయించిన వీటి నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. ఇప్పటికే శ్లాబులు పూర్తయ్యాయి. జిల్లాలో ఇప్పటికే 9 అన్నక్యాంటీన్లు అందుబాటులో ఉన్నాయి. కొత్తవి అందుబాటులోకి వస్తే ఆచంట, ఉండిలో నిరుపేద వర్గాల ఆకలి తీరనుంది.

గ్రామీణులకు సంక్రాంతి కానుక..

సంక్రాంతి కానుకగా ప్రభుత్వం ఒకేసారి 70 క్యాంటీన్లు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇప్పుడున్న వాటికి అదనంగా గ్రామీణ నియోజకవర్గ, మండల కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో



ఒక్కోటి రూ.60 లక్షల వ్యయంతో ఆచంట, ఉండిలో నిర్మిస్తున్నారు. వీటి ద్వారా కేవలం పూటకు రూ.5కే ఆహారం సరఫరా చేస్తారు. ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం లభించనుంది. కొత్త నిర్మాణాలు జనవరి 10లోపు పూర్తి చేసి సంక్రాంతి సమయంలో 13–15 మధ్య ప్రారంభించాలని ప్రభుత్వం నిర?యించింది. ఆచంటలో క్యాంటీన్ కచేరీ కూడలిలో అందరికీ అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్నారు. వీటి గురించి ప్రజారోగ్య డీఈ విజయ్‌ను సంప్రదించగా వీలైనంత తొందరగా నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు.

# మార్కాపురానికి కొత్త రూపు!

మార్కాపురం : కొత్త జిల్లా ఒకట్రెండు రోజుల వ్యవధిలోనే ఏర్పాటు కావడంతో వసతులు పెద్ద సమస్యగా మారింది. కేవలం మొక్కుబడిగా జిల్లా ప్రారంభోత్సవాలు చేసేసి వదిలేయకుండా ప్రజలకు పూర్తిస్థాయి సేవలు స్థానికంగా లభ్యమయ్యేవిధంగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. తక్షణం కలెక్టరేట్‌కు తగిన వసతులు కల్పించేందుకు దృష్టిసారించింది. అన్ని అనుకూలిస్తే, వచ్చే సోమవారం గ్రీవెన్స్ కూడా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ప్రస్తుత సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష? సెలవులో ఉండడంతో డీఆర్వో ఓబులేసు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ఇన్‌ఛార్జి జేసీ హోదాలో ఓబులేసు గురువారం మార్కాపురంలో బాధ్యతలు చేపట్టారు. అన్ని జిల్లా శాఖలు మార్కాపురంలో ప్రారంభించేందుకు ఆయన పర్యవేక్షిస్తున్నారు. రెండో రోజు గృహ నిర్మాణశాఖ, ఉద్యానశాఖ జిల్లా కార్యాలయాలను ప్రారంభించారు. మరికొన్ని జిల్లా కార్యాలయాలు శుక్ర, శనివారాల్లో తెరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సంవత్సరాంతం కావడంతో అధికారులు బిజీగా ఉండడం, సచివాలయంలోని ఆయా శాఖల డైరెక్టరేట్, కమిషనరేట్‌ల నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో జిల్లా శాఖల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది.

కొన్ని శాఖల్లో సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డ్వామా జిల్లా కార్యాలయం తెరవాలంటే కొత్తగా ఏర్పడిన జిల్లా పరిధి విషయమై ఎన్ఐసీలో మార్పులు చేపట్టాలి. ఏది ఏమైనా జిల్లా ప్రారంభించి వదిలేయకుండా అన్ని కార్యకలాపాలు మార్కాపురం జిల్లా కేంద్రంగానే జరగాలని కలెక్టర్ రాజాబాబు అధికార యంత్రాంగానికి ఆదేశాలు



జారీ చేశారు. కొన్ని డివిజన్ కార్యాలయాలను జిల్లా కార్యాలయాలుగా మార్చే పనిలో ఉన్నారు. తదనుగుణంగా కొత్త జిల్లా పరిధి, సిబ్బంది ఎంత అవసరం.. లెక్కలు వేసే పనిలో జిల్లా అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కలెక్టరేట్‌కు కేటాయించిన సూపరిటెండెంట్లు, సిబ్బంది విధుల్లో నిమగ్నమయ్యారు.

**కలెక్టరేట్‌లో సదుపాయాలకు అంచనాలు**

మార్కాపురం జిల్లా కలెక్టరేట్ ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలో మూడు భవనాలుండగా, వాటికి కనీసం కిటికీలు, తలుపులు లేవు. ఇప్పటికే పెట్టిన వాటిని దొంగలు ఎత్తుకెళ్లారు. ఇవన్నీ అమర్చడంతో పాటు ఫర్నీచరు సమకూర్చాల్సి ఉంది. దీనిపై ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఏయే వసతులు కల్పించాలనే దానిపై పరిశీలన చేస్తున్నారు. వెనువెంటనే సౌకర్యాల కల్పించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. తక్కువ వ్యవధిలోనే కలెక్టరేట్‌ను తీర్చిదిద్ది పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కసరత్తు జరుగుతోందని మార్కాపురం ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ శివరామిరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కార్యాలయాలు ప్రారంభించే విషయమై వివిధ శాఖల అధికారులు ఇప్పటికే తమతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఆయన వివరించారు.

# తూచ్... మనది కాదంతే!

కుక్కునూరు : కిన్నెరసాని నది నుంచి తెలంగాణ వ్యక్తులు యథేచ్ఛగా ఇసుక తరలించుకుపోతున్నారు. రెండు నెలల కిందటి వరకూ మన అధికారులు, ఆ ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం ఆంధ్రా పరిధిలోని కుక్కునూరు మండలంలో ఉందంటూ, ఆ రవాణాను ఆపేందుకు ప్రయత్నించారు. తెలంగాణ అధికారులు సహకరించడం లేదంటూ నిందలు వేశారు. బూర్గంపాడు వెళ్లి పత్రికా సమావేశం కూడా ఏర్పాటు చేశారు. తమ భూభాగంలోని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, చట్టరీత్యా నేరమని, ఇకనైనా మానుకోకపోతే కేసులు నమోదు చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆ దందా ఆగలేదు.

అప్పట్లో రెవెన్యూ, పోలీసు సిబ్బందితో గస్తీ కూడా ఏర్పాటు చేశారు. రాత్రి పూట గస్తీ అన్నా, 7–8 గంటల వరకూ ఉండి సిబ్బంది వచ్చేసేవారు. దీంతో రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా పోయింది. ఇక చేసేది లేక ఆంధ్రా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం మానేశారు.

ప్రధాన దారిపై స్థావరాలు.. కొద్దోగొప్పో అడ్డుపెట్టే ఆంధ్రా అధికారులు అటువైపు చూడకపోవటంతో, రవాణాదారులు రాత్రిపూట ట్రాక్టర్లలో తోలి, కుక్కునూరు – భద్రాచలం ప్రధాన రహదారి (తెలంగాణ ప్రాంతం)లో ఇసుక నిల్వ స్థావరాలు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి పగటిపూట లారీలతో ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.అది తెలంగాణ భూభాగమే..రవాణా పెరగటం, అధికారులు పట్టించుకోకపోవటంపై ఇప్పుడు తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం తెలంగాణలో ఉందంటున్నారు అధికారులు. మరి మొదట్లో హడావుడి చేసి, ఇప్పుడు ఆ ప్రాంతం మనదే కాదనడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ఇదే విషయమై కుక్కునూరు తహసీల్దార్ రమేశ్‌బాబు మాట్లాడుతూ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం తెలంగాణదేనన్నారు. తొలుత ఆంధ్రా అనుకొని, నిలిపే ప్రయత్నాలు చేశామన్నారు

# వినీత.. వినూత్న బోధన

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండలంలోని మానిరేవు ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయిని వినీత వినూత్నంగా బోధన చేస్తున్నారు. ఆమె మొదటగా కంబదూరు మండలం కురాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. స్థానికంగా పిల్లల సంఖ్య తక్కువగా ఉండటంతో చదువు పట్ల ఆకర్షితులయ్యేలా చేయాలని ఆటపాటలు, నోకాస్టు –లోకాస్టు పరికరాలు, ఇతర వస్తువులతో బోధన ప్రారంభించారు. దీంతో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే వారు సైతం ప్రభుత్వ పాఠశాలలో చేరడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఆత్మకూరు పడమటి యాలేరు, బెకుగుప్ప



మండలం పి.గొల్లలదొడ్డి ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఇదే స్థాయిలో బోధన చేశారు. ఆరు నెలలుగా కళ్యాణదుర్గం మండలం మానిరేవులో ఆమె పనిచేస్తున్నారు. ఆంగ్లంపై భయం పోగొట్టి సంభాషించుకునేలా చేయడం, అందంగా అక్షరాలు రాయడంపై ఆసక్తి పెంచేలా కృషి చేస్తున్నారు. విద్యార్థులు ఆయా సబ్జెక్టుల అంశాల్లో పాల్గొని నేర్చుకొనేలా చేస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు సైతం సులువుగా చదివేలా చేస్తున్నారు. ఇలాంటి బోధనలకు సంబంధించి వీడియోలు చేసి యూట్యూబ్‌లోనూ ఉంచారు.

**పిల్లలకు ఆసక్తి పెరిగింది**

ప్రతి విద్యార్థికి ఆసక్తి పెంచుకునేలా కృషి చేస్తున్నా. వినూత్న బోధనల కారణంగా పాఠశాలకు క్రమం తప్పకుండా వస్తున్నారు. ఆంగ్లమంటే భయాన్ని వీడి చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు దక్కింది. వినీత

# బియ్యం వారివి.. భోజనం వీరిది!

కాకినాడ : రేషన్‌కార్డుదారులు శాశ్వతంగా ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లినా, కుటుంబ సభ్యులు మరణించినా, ఇతర దేశాలకు వెళ్లిన వారికి యథావిధిగా ప్రభుత్వ ప్రతినెలా రేషన్ బియ్యం విడుదల చేస్తోంది. ఈ విధానంతో పెద్ద ఎత్తున సరకు పక్కదారి పడుతోందని, దీని అడ్డుకట్టకు కార్డులో ప్రతి సభ్యుడు ఈకేవైసీ నమోదు చేసుకోవాలని కేంద్రం ఆదేశించింది. గత కొన్ని నెలలుగా జిల్లాలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటికీ 77 వేల మంది ఈకేవైసీ పెండింగ్‌లో ఉంది. వీరు ఎక్కడున్నారనే వివరాలు తెలియడం లేదు. కానీ కార్డులోని అందరికీ ప్రతినెలా రేషన్ పంపిణీ మాత్రం జరుగుతోంది.

**ఏడాదికి 4,620 టన్నులు**

కాకినాడ జిల్లాలో కార్డుదారులకు ప్రతినెలా 9,300 టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. వీరిలో ఈకేవైసీ చేసుకోని 77వేల మందికి 385 టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇదంతా పక్కదారి పట్టినట్లే.. ఇలా ఏడాదికి 4,620 టన్నుల బియ్యం అక్రమార్కుల పాలవుతోంది.

**నెలకు రూ.1.64 కోట్లు..**

ప్రభుత్వం కిలో బియ్యానికి రూ.46 వెచ్చిస్తోంది. ఈ లెక్కన జిల్లాలో ఈకేవైసీ పెండింగ్‌లో ఉన్న సభ్యులకు ప్రతినెలా రూ.1.64కోట్ల విలువైన బియ్యం సరఫరా చేస్తున్నారు. ఏడాదికి ఈ లెక్క రూ.20 కోట్లకు చేరుతోంది.

**చర్యలు చేపట్టరే..?**



రేషన్‌కార్డుల్లోని సభ్యులు ఈకేవైసీకి 2025, నవంబరు 30 వరకు గడువు ఇచ్చారు. అందరూ డీలర్లు, గ్రామ,వార్డు సచివాలయాల్లో తప్పనిసరిగా ఈకేవైసీ(వేలిముద్ర నమోదు) చేసుకోవాలని సూచించారు. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి చేసుకోకపోతే కార్డుల్లో వారి పేర్లు తొలగిస్తామని ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పటి వరకు పట్టించుకోలేదు. ఫలితంగా ప్రతినెలా రూ.కోట్ల విలువైన బియ్యాన్ని అక్రమార్కులు భోంచేస్తున్నారు. అలాగే వరుసగా ఆరు నెలలు రేషన్ తీసుకోకపోయినా కార్డు రద్దుకు మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలో ప్రతినెలా 10 శాతం కార్డుదారులు సరకులు తీసుకోవడం లేదు. వీటిని ప్రభుత్వ గణాంకాలు రుజువు చేస్తున్నాయి. ఇప్పటికైనా నిజమైన లబ్ధిదారులు ఉండి.. ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకునేలా అధికారులు దృష్టిసారించి, రూ.కోట్ల విలువైన సరకు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.


# పాసు పుస్తకాలపై రాజముద్ర

వి.ఎల్.పురం: జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయనున్నారు. తొలివిడతగా 102 గ్రామాల్లోని రైతులు, భూయాజమానులకు అందించేందుకు 90 వేల పట్టాదారు పాసుపుస్తకాలు సిద్ధం చేశారు. నేటి నుంచి 9 వరకు గ్రామసభల ద్వారా ప్రజాప్రతినిధుల సమక్షంలో సంబంధిత రైతులు, భూయాజమానులకు అందించనున్నారు.

**గత ప్రభుత్వంలో విమర్శలు..**గత వైకాపా ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం కింద జిల్లాలో 272 రెవెన్యూ గ్రామాలకు 190 గ్రామాల్లోని 3,31,635.907 ఎకరాల్లో రీసర్వే చేపట్టింది. పూర్తయిన గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల ముందు వరకు 86,799 జగనన్న భూహక్కు పత్రాలు జారీ చేసింది. ఇందులో తప్పులు ఉండటం, భూయాజమాని ఫొటో కంటే అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం పెద్దగా ఉండటంపై ఆందోళనలు వ్యక్తమైనప్పటికీ గత ప్రభుత్వం పట్టించుకోలేదు. అప్పుడు రైతులు నిరసనలు వ్యక్తం చేశారు.

**ఈసారి పక్కాగా..**కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత భూహక్కుపత్రాల్లో జగన్ ఫొటోను తొలగించి గతంలో మాదిరిగానే ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలని నిర?యించింది. మ్యుటేషన్ పూర్తయిన వారికి ఇవ్వనున్నారు. ప్రభుత్వ రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసుపుస్తకాలు జిల్లాకు ఇప్పటివరకు 1.50 లక్షలు వచ్చాయి. తప్పులు లేకుండా ఆ వివరాలను వెబ్‌ల్యాండ్‌లో సరిపోల్చుతున్నారు. తొలుత 90 వేల పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు డీఆర్వో సీతారామమూర్తి తెలిపారు.

# కరవు నేలలో.. సుగంధ ద్రవ్యాల గుబాళింపు



మడకశిర : కరవు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో రైతులు సుగంధద్రవ్యాల సాగు వైపు అడుగులు వేస్తున్నారు. కరా?టకలో వర్షపాతం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పండించే నల్ల మిరియాలు, జాజికాయ, చెక్క వంటివి ప్రయోగాత్మకంగా సాగు చేసి విజయం సాధించారు. రాష్ట్రంలోనే మారుమూలన ఉన్న ఈ ప్రాంతంలో అత్యధికంగా వక్క పంట సాగవుతోంది. దానిలో అంతర పంటల సాగుకు దక్కిన అవకాశాన్ని ఇక్కడి రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సాధారణంగా వక్క పంటలో తీగ జాతి మొక్క తమలపాకు సాగు చేసేవారు. సదరు పంటకు తెగుళ్ల బెడద ఎక్కువ కావడంతో తీవ్రంగా నష్టపోయారు. దీంతో సుగంధ ద్రవ్యాలపై ఆసక్తి పెంచుకుని అడుగులు వేస్తున్నారు. ప్రధానంగా అమరాపురం మండల రైతులు కొత్త పంటలను ఈ ప్రాంతానికి పరిచయం చేస్తూ మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

**నెలాఖరులో కోతకు సిద్ధంగా..**


ప్రస్తుతం అంతర పంటలుగా నల్లమిరియాలు 50 ఎకరాలు, జాజికాయ 5 ఎకరాలు, చెక్క 2 ఎకరాల్లో సాగవుతోంది. జనవరి చివర్లో నల్లమిరియాల పంట కోత ప్రారంభమౌతుంది. ఎకరాకు క్వింటాలు వరకు దిగుబడి వస్తోంది. మార్కెట్లో కిలో మిరియాల ధర రూ.600 నుంచి రూ.800 వరకు పలుకుతోంది. ఈలెక్కన రూ.10 వేల వరకు పెట్టుబడి పోయినా రూ.60 వేల నుంచి రూ.70 వేల దాకా ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. వీటితో పాటు చెక్క, జాజికాయ పంట ప్రారంభమైతే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పంట ఉత్పత్తులను కరా?టకలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉషో?గ్రతలు అధికంగా ఉన్నా పంటలు బాగా పండుతుండటంతో ఇతర రైతులు కొత్త పంటల సాగుకు మొగ్గుచూపుతున్నారు.

**అదనపు ఆదాయం..**

మూర్కణ?ప్ప, గౌడనకుంట, అమరాపురం మండలం

కొన్నేళ్ల నుంచి 5 ఎకరాల్లో వక్క సాగు చేస్తున్నా. తమలపాకు సాగు చేసి నష్టపోవడంతో పక్కనే ఉన్న కరా?టక రాష్ట్రం హాసన్ జిల్లాలో రైతులు పండిస్తున్న సుగంధ ద్రవ్యాల సాగు చేయాలని నిర?యించుకున్నా. అక్కడికే వెళ్లి ప్రత్యక్షంగా సాగు విధానం తెలుసుకుని వక్కలో అంతర పంటగా మిరియాలు వేశాను. నీడలో పెరిగే జాతి మొక్క కావడంతో వక్క చెట్లు అనుకూలంగా ఉంటాయి. మొక్కలకు మాత్రమే డబ్బులు పెట్టాం. పెద్దగా ఖర్చులు ఉండవు. రెండేళ్ల నుంచి ఎకరాకు క్వింటాలు వరకు నల్లమిరియాలు దిగుబడి వస్తోంది.

# పారని అమృత్ ధార



ధర్మవరం: పట్టణాల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రవేశపెట్టిన అమృత్ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన మున్సిపాలిటీల్లో అమృత్ పథకాన్ని అమలు చేశారు. ప్రజలకు సురక్షితమైన శుద్ధ జలాన్ని అందించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మవరం, హిందూపురం మున్సిపాలిటీల్లో అమృత్ పథకాన్ని అమలు చేశారు. అందులో భాగంగానే ధర్మవరం పట్టణంలో 2016లో రూ.17.65 కోట్లతో ఎల్1, సిద్దయ్యగుట్ట, మారుతినగర్ ప్రాంతాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఎల్‌కేసీపురం, అయప్పస్వామి గుడి సమీపంలో శుద్ధజల కేంద్రాలు(ఎస్టీపీ), 35 కి.మీ మేర పైపులైన్ నిర్మాణాలకు అప్పటి తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గుత్తేదారులు 2019 ఎన్నికల నాటికి దాదాపు 75 శాతం పనులు పూర్తి చేశారు. ఆ తరువాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి.

కేంద్రం అమృత్ పథకానికి కేటాయించిన నిధులు విడుదల చేసినా రాష్ట్ర వాటాను వైకాపా ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో చేసిన పనులకు బిల్లుల చెల్లింపుల్లో జాప్యం కావడంతో మిగిలిన పనులు చేసేందుకు గుత్తేదారులు విముఖత చూపారు. ట్యాంకు నిర్మాణాలు, పైపులైన్, శుద్ధజల కేంద్రాల పనులను గుత్తేదారులు ఆపేశారు. ట్యాంకుల నిర్మాణాలు దిష్టిబొమ్మలా ఉండిపోయాయి. పలు సామగ్రి తుప్పుపట్టిపోయింది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకంపై దృష్టిసారించింది. అమృత్ 2.0 పేరిట మొదటి, రెండో దశలో 11.5 కోట్లు మంజూరు చేసింది. గత ఏడాది నవంబరులో తిరిగి పనులు ప్రారంభించిన నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. తాగునీరు సక్రమంగా అందని కాలనీల్లో శుద్ధజలాన్ని కొనుగోలు చేయాల్సిన దుస్థితి. పనులు నత్తనడకన సాగుతుండటంతో ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. పాలకులు, అధికారులు చొరవ చూపి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

**సకాలంలో పూర్తి చేస్తాం**

మొదటి దశ బిల్లులు జమ కాకపోవడంతో గుత్తేదారులు ఆలస్యం చేస్తున్నారు. వాటి పనుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు శుద్ధజలం అందేలా చర్యలు చేపడతాం. వీరేష్, మున్సిపాలిటీ డీఈ

# మామిడి ఆశలపై మంచుతెరలు



పుత్తూరు : మామిడి రైతులను మంచు ముంచేస్తోంది.. ఏడాది కష్టం నేలపాలయ్యే పరిస్థితి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. ఏటా ఏదోఒక కారణంతో నష్టాలపాలవుతున్నారు.. గతేడాది ఆశించిన దిగుబడి వచ్చినా తోతాపురి రైతుకు నష్టం తప్పలేదు.. గతేడాది నవంబరులో మొంథా, డిసెంబరులో దిత్వా తుపానుతో వర్షాలు కురిశాయి.. మామిడిలో డిసెంబరు 15 నాటికే మొగ్గ దశ ఉండాలి.. అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమవుతోంది.. దీనికితోడు ఈ ఏడాది మంచు అధికంగా పడటం, ఉషో?గ్రతల్లో భారీ తేడాలతో వచ్చిన పూత మగ్గిపోయి బంక పడుతోంది.. ఫలితంగా దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా మామిడి సాగు విస్తీర?ంలో ప్రథమ స్థానంలో ఉంది. జిల్లాలో 1.05 లక్షల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఈ విస్తీర?ం ఏటికేడు పెరుగుతోంది. ఇక్కడ గుజ్జు కంపెనీలు సైతం ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏటా రైతులు దున్నకం, నీటి తడులు అందించడం, సస్యరక్షణ చర్యలకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా ఏదోఒక విపత్తుతో వారు ఆర్థికంగా నష్టపోతున్నారు. దిగుబడి ఎక్కువ వస్తే పల్ప్ ఫ్యాక్టరీల యజమానులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువకు కొనుగోలు చేస్తారు. దీంతో రైతులకు పెట్టుబడి సైతం దక్కడం లేదు. గతేడాది నవంబరు, డిసెంబరులో అధిక వర్షాల వల్ల పూత ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

**పట్టించుకోని యాజమాన్యాలు..**

గుజ్జు పరిశ్రమల యజమానులు టన్నుకు రూ.3,500 నుంచి రూ.6 వేల వరకు తమకు తోచినట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా చాలామందికి నేటికీ డబ్బు అందక, ఆశించిన ధర ఇప్పిస్తామని ఆరాటంగా హామీ ఇచ్చిన జిల్లా యంత్రాంగం సైతం మొక్కుబడి సమావేశాలు నిర్వహించి కంపెనీలను తరచూ బతిమలాడుతుండటంతో చేసేదేమీ లేక రైతులు నగదు కోసం ఆయా పరిశ్రమల చుట్టూ తిరుగుతున్నారు. పూత నల్లగా మారి బంక కారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. **సస్యరక్షణ చర్యలు తప్పనిసరి..** ఉషో?గ్రత అనుకూలిస్తే ఆశించిన దిగుబడులు వస్తాయి. లేదంటే దిగుబడి తగ్గొచ్చు. పూత ఆలస్యమవుతోంది. తేనెమంచు పురుగు నివారణకు ఇమిడాక్లోపిడ్ లీటరు నీటికి 0.33 మి.లీ, కార్బొడైజిన్ ఒక గ్రాము.. లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాదర్ లాంటి రకాల్లో డైజర్ కోనోజిల్.. లీటరు నీటికి 0.5 మి.లీటర్లు కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. గూడు పురుగు నివారణకు అసిఫేట్ ఒక లీటరు నీటికి 125 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

# సముద్ర కోత కట్టడి

అల్లవరం: కోనసీమ ప్రాంతంలో సముద్రం రోజురోజుకూ ముందుకు చొచ్చుకు వస్తోంది. దీంతో అలల ఉధృతికి తీరం కోతకు గురవుతూ గ్రామాలవైపు ముంచుకొస్తోంది. అల్లవరం మండలం ఓడలరేవు, కొమరగిరిపట్నం గ్రామాల ప్రజలు దీనిపై ఆందోళనలో ఉన్నారు. కోత నుంచి రక్షణ కల్పించాలని ప్రజా ప్రతినిధులు, ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్న చమురు సంస్థల ఉన్నతాధికారులను ఎప్పటి నుంచో వేడుకుంటున్నారు. ఎట్టకేలకు వారి ఆవేదన విన్న అధికారులు రక్షణ చర్యలను ప్రారంభించారు.

**వందల ఎకరాలు కనుమరుగు**

సముద్రం– గోదావరి మొగ(అన్నాచెల్లెల గట్టు) నుంచి ఓఎన్జీసీ సంస్థకు చెందిన ప్లాంట్ వరకు తీరం విపరీతంగా కోతకు గురైంది. అలల తాకిడి తీరం వెంబడి ఉన్న అనేక చెట్లు సముద్ర గరరేలో కలిసిపోయింది. అటవీ శాఖకు చెందిన 200 ఎకరాలు, జిరాయితీ భూములు మరో 250 ఎకరాలు కోతకు గురై సముద్రంలో కలిసిపోయాయి.

**300 మీటర్లకు ఒక గ్రోయిన్**

ఓడలరేవు పరిధిలో సముద్రం– గోదావరి కలిసే చోట నుంచి కొమరగిరిపట్నం వైపునకు తీరం వెంబడి 6.5 కిలోమీటర్ల పరిధిలో 21 గ్రోయిన్స్ నిర్మిస్తున్నారు. వీటిని సముద్రపు లోతు ఆధారంగా



తీరం నుంచి 50, 100, 150 మీటర్ల చొప్పున నిర్మించనున్నారు. మొదట రాళ్లతో నిర్మించి పైన కాంక్రీట్‌తో తయారు చేసిన దిమ్మె(టెట్రా పాడ్స్)లను అమర్చుతారు.

**ఇదీ ఉపయోగం**

ప్రతి 300 మీటర్లకు గ్రోయిన్లు నిర్మించడం వల్ల సముద్రపు అలలు నేరుగా తీరాన్ని తాకలేవు. ఈ గ్రోయిన్ల మధ్య ప్రదేశంలోకి భారీగా ఇసుక చేరి పూర్తిగా మెరకగా మారుతుంది. దీంతో తీరం కోతకు గురికాదు. తమిళనాడుకు చెందిన ఐఐటీ సంస్థ నిపుణుల బృందం గతంలో ఇక్కడ పలు మార్లు పరిశీలించి కోత నివారణకు సంబంధించి ఇచ్చిన నమూనా ప్రకారం ఈ రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు ఓఎన్జీసీ అధికారులు తెలిపారు.

**ఈ ఏడాది మార్చినాటికి..**

ఈ పనులకు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్జీసీ) రూ.109 కోట్లు విడుదల చేసింది. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే రక్షణ గోడ పనులు చేపడుతున్నారు. ఈ పనులు 2026 మార్చి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# చప్పిడిచేపల కూర.. గోదారోళ్ల నోరూర..

పి.గన్నవరం: నోరూరించే చేపల కూరలు తయారు చేయడంలో గోదారోళ్లు సిద్ధహస్తులు. సీజన్ల వారీగా దొరికే పులస, దొందు, చీరమీను తదితరాలను కొనుగోలు చేసి బంధుమిత్రులకు పంపుతుంటారు. ప్రధానంగా మహా రుచికరమైన చప్పిడి చేపలను గోదావరి తీరప్రాంతంలో ఉండే మత్స్యకార కుటుంబాలు తయారు చేసి విక్రయిస్తుంటాయి. కొయ్యింగ, కట్టెపరిగి, కడిస, ఇసుకదొందులు వంటి పచ్చిచేపలతో చప్పిడి చేపలు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వీటిని ఎంతోమంది ఇష్టంగా తింటారు.

**తయారీ విధానం**కోనసీమలో జొన్నల్లంక, నాగుల్లంక, వాకలగరువు, బోడసకుర్రు తదితర ప్రాంతాల్లో చప్పిడిచేపలు తయారు చేస్తుంటారు. పచ్చిచేపలను పొలుసు తీయకుండా లోపల పేగులు వంటివాటిని తొలగించి ఎండలో ఆరబెడతారు. డొక్కలపీచును పరుపు మాదిరిగా పరిచి మధ్య నిప్పులు వేస్తారు. దానిపై చెరకుపిప్పు పెట్టి పైన ఆరిన పచ్చిచేపలను చక్కగా పేర్చి పొగతో ఆరుస్తారు. వీటిని చప్పిడిచేపలు లేదా ఆర్చినచేపలు అంటారు. మంట రాకుండా పొగతో ఆర్చడంతో ఎనలేని రుచి వస్తుంది.

**అందుబాటు ధరలో..**

ఆర్చిన చప్పిడిచేపల ధర వినియోగదారులకు అందుబాటులో ఉంటుంది. కొయ్యింగలైతే ఒకటి రూ.200–300, కట్టెపరిగ, కడిస, దొందులు వంటివైతే రూ.100 నుంచి ఆపైన ఉంటుంది.

**ఈ కాంబినేషన్‌లో..**

చప్పిడి చేపలపైన ఉండే చర్మంలాంటి పొరను తొలగించి వండుతారు. చిక్కుడుకాయ, కోడిగుడ్డు, టమాటా, వంకాయ, చింతకాయ, మునగకాడలు.. ఇలా వివిధ కాంబినేషన్లతో ఇగురు తయారు చేసి ఆరగిస్తుంటారు.

**ఇతర ప్రాంతాలకు**

ఈ చేపలు మార్కెట్ నుంచి తెచ్చుకున్న ఒకటి, రెండు రోజుల్లో వండుకోవాలి. ఫ్రిజ్‌లో పెట్టుకుంటే ఎక్కువ రోజులు ఉంటాయి. సంక్రాంతికి వచ్చే వారికి ఈ చేపలతో కూరలు తయారు చేసి ఇక్కడివారు ప్రత్యేకంగా వడ్డిస్తారు.

# నాణ్యత తేలింది.. ఊపిరి ఆగుతోంది

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ జాతీయ రహదారులు వెళుతున్నాయి. ప్రతి వాహనం నుంచి టోల్ వసూలు చేస్తున్నారు. అందుకు తగ్గట్టు వసతులు కల్పించాల్సి ఉంది. చాలా ప్రాంతాల్లో రహదారుల నిర్వహణ అధ్వానంగా మారింది. గుంతలు తేలినా పట్టించుకోవడం లేదు. విశ్రాంత గదుల్లో సౌకర్యాలు కరవయ్యాయి. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్యాచ్‌వర్కులతో సరి..ఉమ్మడి జిల్లాలో ముఖ్యంగా ఎన్‌హెచ్ 40, ఎన్‌హెచ్ 44 రహదారులు వెళుతున్నాయి. వీటి నిర్వహణ అధ్వానంగా మారింది. ఏటా రూ.కోట్లలో వాహనదారుల నుంచి టోల్ రుసుము వస్తున్నా అందుకు తగ్గట్టు సౌకర్యాలు కల్పించడం లేదు.

కర్నూలు–ప్యాపిలి మధ్య చాలా ప్రాంతాల్లో రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. ప్యాచ్‌వర్క్ చేస్తున్నారే తప్ప బీటీ లేయర్ వేయడం లేదు. టోల్‌ప్లాజాకు ఇరువైపులా రహదారి మధ్యలో కొన్ని విద్యుద్దీపాలు వెలగడం లేదు. హైవేలో కొన్ని గ్రామాల వద్ద ఉపరితల వంతెనలు నిర్మించారు. అక్కడ కూడా రహదారి మధ్యలో దీపాలున్నా రాత్రివేళ వెలగడం లేదు.

డోన్ మండలం దొరపల్లి రైల్వే వంతెనపై కొన్ని నెలలుగా దీపాలు వెలగకున్నా పట్టించుకోవడం లేదు.

అమకతాడు టోల్‌ప్లాజా వద్ద ఒకవైపు ఆరు, మరోవైపు ఆరు కౌంటర్లు ఉంటాయి. పనిచేసేది మాత్రం మూడు కౌంటర్లు మాత్రమే.

కొన్ని కౌంటర్ల వద్ద వాహనాలు వెళ్లకుండా అడ్డుగా ప్లాస్టిక్ డబ్బాలు పెట్టారు. అవి దగ్గరికి వస్తేగానీ కనపడవు. ఫలితంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్నానం గదులకు నీటి సరఫరా అంతంత మాత్రంగా ఉంది. కొన్నింటికి తలుపులు సరిగా లేవు. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి.

రూ.కోట్లు సమకూరుతున్నా..డోన్ నుంచి కర్నూలు వైపునకు వెళ్లే జాతీయ రహదారిలో 12 కి.మీ. దూరంలో అమకతాడు టోల్‌ప్లాజా ఉంది. డోన్ హైవే మీదుగా రోజుకు 16 వేలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయి. టోల్‌ప్లాజా పరిధిలో రోజుకు రూ.5 లక్షలకు పైగా వసూలవుతోంది. నెలకు రూ.1.50 కోట్ల వరకు ఆదాయం సమకూరుతూ ఉంటుంది. అయినప్పటికీ వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించడం లేదు. వాహనదారుల ఇక్కట్లుచాగలమర్రి, పట్టణం మీదుగా 40వ నంబరు జాతీయ రహదారి వెళుతోంది. చాగలమర్రి సమీపంలో టోల్‌ప్లాజా ఉంది. దీనికి సమీపంలో ప్రయాణికులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు లేవు. మరుగుదొడ్లకు నిత్యం తాళాలు వేసి ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోజూ 7 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. టోల్‌ప్లాజా వద్ద నామమాత్రంగా మరుగుదొడ్లు ఉన్నాయి.

చురకలు



# కంకర మింగుతున్న కింకరులు

నంద్యాల : ఖనిజ అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా సీనరేజ్ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ప్రభుత్వం ఓ రకంగా ఆలోచిస్తే.. అక్రమార్కులు మరోలా పావులు కదుపుతున్నారు. అందొచ్చిన అవకాశంతో అక్రమ మైనింగ్‌ను మరింత పెంచారు. ప్రైవేటు సంస్థతో కొందరు ఒప్పందాలు చేసుకుని అనుమతుల్లేకుండానే తవ్వేస్తున్నారు. కంకర, రోడ్డు మెటల్‌కు సంబంధించిన అనుమతులు వేళ్లమీద లెక్కపెట్టే స్థాయిలో ఉండగా.. పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

**నిబంధనలకు చెల్లు**

నంద్యాల జిల్లాలో రోడ్డు మెటల్ క్వారీ లీజులు ఎనిమిది మాత్రమే ఉన్నాయి. బనగానపల్లి కార్యాలయ పరిధిలో మూడు, నంద్యాల పరిధిలో ఐదింటికి మాత్రమే లీజులున్నాయి. కానీ పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గద్దెలకొండలో రెండు లీజులు మాత్రమే అధికారికంగా ఉన్నాయి. మరికొన్ని రెన్యువల్ దశలో ఉన్నాయి. ఇక్కడ ఏకంగా 35 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. ఆరు క్రషర్ యంత్రాల ద్వారా అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. క్వారీ నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కి తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడ ఏమేరకు మైనింగ్ జరుగుతుందన్న వివరాలు.. అటు రెవెన్యూ, ఇటు గనుల శాఖల వద్ద లేవు. బనగానపల్లిలో రెండింటికి మాత్రమే అధికారిక అనుమతులుండగా మరో మూడింటిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.



**బండరాళ్లను వదలరు..**

కర్నూలు జిల్లాలో ఏడు కంకర లీజులున్నాయి. పత్తికొండ నియోజకవర్గ పరిధి.. కృష్ణగిరి మండలం కంబాలపాడు సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ నిర్మాణంలో భాగంగా బయట పడిన రాళ్లను పగులగొట్టి కంకరగా మారుస్తున్నారు. దీనిని డోన్ సమీపంలోని కంకర క్వారీలకు తరలిస్తున్నారు. మరికొంత రోడ్డు నిర్మాణాలకు వాడుతున్నారు. కల్లూరు మండలం.. ఉలిందకొండ సమీపంలో నాలుగు కంకర క్వారీలకు అనుమతులుండగా మరో క్వారీలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల సమీపంలో ఒకచోట అనధికార క్వారీ నడుస్తోంది.

**కానరాని తనిఖీలు**

అనుమతులున్న లీజుల నుంచి వసూలు చేసిన సీనరేజ్‌ను మాత్రమే సదరు సంస్థ ప్రభుత్వానికి చెల్లిస్తోంది. అనధికారికంగా.. అక్రమంగా తవ్వకాలు చేస్తున్న కంకర, రోడ్డు మెటల్ క్వారీల నుంచి తరలే 'సరకు' నుంచి వసూలవుతున్న మొత్తాన్ని స్వాహా చేస్తోంది. సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు పరం చేసిన నాటి నుంచి గనుల శాఖ అధికారులు దాదాపు తనిఖీలు ఆపేశారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని క్వారీలపై సదరు ప్రైవేటు సంస్థ గురి పెట్టింది. అనుమతి ఉన్న క్వారీల్లో ఎలాగైతే సీనరేజ్ వసూలు చేస్తుందో.. అనధికార క్వారీల్లోనూ అలానే వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతోంది.

# పోగు.. ఉపాధి పేగు

కర్నూలు : గద్వాల పట్టుచీరకు ఎమ్మిగనూరు పుట్టినిల్లు.. ఇక్కడ చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి.. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో మరింత వన్నెరాబోతోంది. ఇక్కడి కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో బనవాసిఫారం వద్ద యుద్ధప్రాతిపదికన టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నారు. 77.37 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 249 ప్లాట్లు అందుబాటులోకి తేనున్నారు. తొలిదశలో 24.38 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి 107 ప్లాట్లు అందుబాటులోకి తెచ్చారు. తమిళనాడులోని ఈరోడ్, సేలం ప్రాంతాల టెక్స్‌టైల్ పార్కుల మాదిరిగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పనులు రెండు నెలల్లో పూర్తి చేసి ప్లాట్లను కార్మికులకు అప్పగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. సమగ్రమైన



నివేదికతో రావాలని ఏపీఐఐసీ అధికారులు సూచించారు.

**విదేశాలకు ఎగుమతి చేసేలా**టెక్స్‌టైల్ పార్క్ నుంచే ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు విక్రయించుకొనే సౌకర్యం కల్పించనున్నారు. ప్రస్తుతం సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చీరలు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వ పరంగా వేగంగా సాయం అందేలా 'ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్'ను ఏర్పాటు చేయనున్నారు.

**కార్మికులకు 22 ఎకరాలు**

టెక్స్‌టైల్ పార్కులో చేనేతల కోసం ప్రత్యేకంగా 22 ఎకరాలు కేటాయించనున్నారు. చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. 1,500 వరకు అధునాతన ఎలక్ట్రానిక్ జాకార్డ్ మగ్గాలు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇందుకు వర్క్‌షెడ్లు నిర్మించనున్నారు. వాటిని వీవర్లకు కేటాయిస్తారు. దీంతో అధునాతన విధానాల్లో పలు రకాల వస్త్రాలు ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. అదేవిధంగా ప్రత్యేక శిక్షణ కేంద్రం, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, డయ్యింగ్ సౌకర్యాలు, గోదాముల సదుపాయం, బ్రాండింగ్, ప్యాకేజింగ్‌లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.

# ఏది అసలు... ఏది నకిలీ..




అనంతపురం: కాదేది కల్తీకి అనర్హం అని కేటుగాళ్లు నిరూపిస్తున్నారు. సబ్బులు, షాంపులు, వాషింగ్ పౌడర్లు, కొబ్బరి నూనె, వంట నూనె, గోధుమపిండి.. ఇలా అన్నింటిలోనూ కల్తీ చేస్తున్నారు. ఆఖరికి నకిలీ సిమెంట్ తయారీ చేసి బ్రాండెడ్ కంపెనీల పేరుతో అమాయకులకు అంటగడుతున్నారు. విజిలెన్స్ అధికారుల దాడుల్లో వెలుగు చూస్తున్న విషయాలను చూస్తే ఏది అసలు, ఏది నకిలీ తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. తాము కొన్న వస్తువుపై కంపెనీ లోగో, ఐఎస్ఐ ముద్ర, బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ ఉన్నా అది అసలు కాదోనని అనుమానించాల్సిన పరిస్థితి దాపురించింది.

**అచ్చం బ్రాండ్‌లాగే..**

నాణ్యత కోసం బ్రాండెడ్ వస్తువులను ఆశ్రయించే ప్రజల నమ్మకాన్ని మోసగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. అచ్చం బ్రాండ్లను పోలి ఉండే నకిలీ వస్తువులను తయారుచేసి అమ్ముతున్నారు. లోగో, ప్యాకింగ్ అన్నీ బ్రాండ్‌నే పోలి ఉండటంతో ప్రజలకు అనుమానం రావడం లేదు. సాంకేతిక సాయంతో బార్ కోడ్‌లను సైతం ట్యాంపరింగ్ చేస్తున్నారు. అనుమానం వచ్చి స్కాన్ చేసినా కంపెనీ పేరే చూపించేలా పకడ్బందీగా నకిలీలు తయారు చేస్తున్నారు. ఇటీవల గోరంట్లలో అల్ట్రాటెక్ పేరుతో తయారు చేస్తున్న నకిలీ సిమెంట్ బస్తాలను కంపెనీ ప్రతినిధులు కూడా గుర్తించలేక పోయారంటే కల్తీ ఏ స్థాయిలో చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

**ఇలా చేస్తున్నారు**

తమిళనాడు ప్రాంతంలోని ప్లాస్టిక్ సంచులు, కవర్లు తయారు చేసే కంపెనీలతో స్థానిక వ్యాపారులు కుమ్మక్కైనట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. తమకు కావాల్సిన కంపెనీ పేరు చెబితే చాలు వాళ్లే ప్యాకింగ్ కవర్లు తయారు చేసి ఇస్తున్నారు. అలాగే లేబుళ్లు, స్టిక్కర్లు వందశాతం అసలైన కంపెనీలాగే తయారుచేసి సరఫరా చేస్తున్నారు. బెంగళూరుతో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో సబ్బులు, షాంపులు, నూనెలు, ఉప్పు, వాషింగ్ పౌడర్లు వంటి నకిలీ వస్తువులు తయారు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రత్యేక డీలర్లను నియమించుకుని జిల్లాలో సరఫరా చేస్తున్నారు. ఒరిజినల్ కంపెనీ కంటే తక్కువ ధరకు ఇస్తుండటంతో హెూల్‌సేల్ వ్యాపారులు నకిలీ వస్తువులనే తెప్పించుకుని జనాలకు విక్రయిస్తున్నారు.

**ఎమ్మార్పీ కంటే తక్కువకు ఇస్తే**

నాగభూషణం, డీఎస్పీ, విజిలెన్స్

నకిలీలపైనా ఒరిజినల్ కంపెనీకి చెందిన బార్ కోడ్‌లను ముద్రిస్తుండటంతో స్కాన్ చేయడం ద్వారా కనుక్కోలేం. అయితే ఒరిజినల్ బ్రాండ్‌తో పోలిస్తే నకిలీ వస్తువుపై ఉన్న రంగుల్లో కచ్చితంగా తేడా ఉంటుంది. మెరిసిపోయే రంగుల్లో ఉండే వస్తువులు నకిలీవి అయ్యే అవకాశం ఉంది. వాస్తవ ధర కంటే తక్కువకే ఇస్తామని చెబితే కచ్చితంగా అనుమానించాల్సిందే.

# జాతీయ రహదారిలో 18 వంతెనలు



అనంతపురం: ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్– బెంగళూరులను కలిపే ఈ రహదారిలో ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. అవసరమైన చోట అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మాణానికి రంగం సిద్ధమైంది. 14 అండర్ పాస్ బ్రిడ్జిలు, 4 ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. కేంద్రం నుంచి వీటి నిర్మాణం కోసం రూ.600 కోట్లు మంజూరయ్యాయి. పామిడి సమీపంలో 2, కల్లూరు, లోలూరు, వడియంపేట, ఆర్.ఫంక్షన్‌హాల్, ప్రసన్నాయపల్లి, రామినేపల్లి, హంపాపురం, మరూరు, యర్రంపల్లి, అమ్మవారిపల్లి, అమ్మినాయనపల్లి, మిషన్‌తాండ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలు ఈ రూ.600 కోట్లతో నిర్మించనున్నారు. ఇందులో పాదచారుల కోసం ఫుట్‌ఓబీ కూడా అనంతపురం వద్ద నిర్మిస్తారు వీటితో పాటు తపోవనం, రాప్తాడు, సోమందేపల్లి, కోడూరు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించారు. వీటికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జనసంచారం, చిన్నవాహనాలు ప్రయాణించే మలుపులు ఎక్కువగా ఉన్నాయి. బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే రాకపోకలకు సజావుగా సాగడానికి, ప్రమాదాలు తగ్గించడానికి అవకాశముంటుంది.

**ఆక్రమణ దారులకు తాఖీదులు**

ప్రసన్నాయపల్లి సమీపాన పెద్దపెద్ద హెూటళ్లు జాతీయ రహదారి స్థలాన్ని ఆక్రమించి నిర్మించారని గుర్తించారు. వాటి యజమానులకు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలు తొలగించడానికి పూనుకొంటున్నారు. ఆక్రమణలు తొలగించడానికి జేసీబీలతో సిబ్బంది వెళ్లారు. కొంత గడువు ఇవ్వాలని, నోటీసులు రాలేదని కొందరు చెబుతున్నారు.

అయితే కొందరు ప్రైవేటు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. సోములదొడ్డి, కోడూరు వద్ద కూడా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించి, నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌ఛెఫ్ సమీపంలో ఆక్రమణలకు వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జాతీయ రహదారుల శాఖకు చెందిన అధికారులు తెలిపారు.

# అడగరులే.. ఆక్రమించేయ్



తనకల్లు : అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలోని అడవిచెరువు, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన కొందరు పేదలమంటూ ప్రభుత్వ భూమిలో పాగా వేస్తున్నారు. రాత్రికిరాత్రి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీరికి ప్రజా సంఘాల సహకారం తోడవడంతో మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికే తొమ్మిది ఇళ్ల నిర్మాణం చేపట్టి తితిదే ఫంక్షన్‌హాల్ నుంచి విద్యుత్తు కనెక్షన్ సైతం అక్రమంగా తీసుకున్నారు. ఇదంతా తనకల్లు మండలంలోని బొంతలపల్లి పంచాయతీ, అన్నమయ్య జిల్లా ములకలచెరువు మధ్యలో ఉన్న సర్వేనంబరు 183–ఎలో జరుగుతోంది.

**విలువ చూసి.. పాగా వేసి**

ములకలచెరువు వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతున్న మండలం. దీనికితోడు 42 జాతీయరహదారి విస్తరించడం.. టమాటా మార్కెట్ ఉండటంతో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఈ ప్రాంతంలో పీటీఎమ్ రోడ్డుకు తితిదే ఫంక్షన్‌హాల్ వద్ద సర్వేనంబర్ 183–ఎలో తనకల్లు మండలానికి చెందిన ప్రభుత్వ భూమి 4.28 ఎకరాలు ఉంది. ఇక్కడ సెంటు ధర రూ.4 లక్షలకుపైనే పలుకుతోంది. గతంలో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు సైతం ఏర్పాటు చేశారు. అయినా అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. అమాయక ప్రజల నుంచి కొందరు రూ.10 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**చర్యలు తీసుకుంటాం..**

సర్వే నంబరు 183–ఎలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను గురువారం తహసీల్దారు షాబుద్దీన్ తనిఖీ చేశారు. సిమెంట్ ఇటుకలను ట్రాక్టర్‌లో తీసుకొచ్చి దింపుతుండగా అదుపులోకి తీసుకున్నారు. నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లు ఎప్పటి నుంచి, ఎవరు నిర్మిస్తున్నారనే వివరాలు ఆరా తీశారు. అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. అంతకుముందు బొంతలపల్లి పంచాయతీలోని వడ్డిపల్లికి చెందిన మహిళలు స్థలాలు ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని, ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నోటీసులు ఇచ్చారు.. మరి వసూళ్లేవి..?

పుంగనూరు: అంతరాయం లేని, నాణ్యతతో కూడిన విద్యుత్తు సరఫరా చేయాలని సామాన్య వినియోగదారుడి నుంచి ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, దుకాణదారులు కోరుకోవడం సహజం. గృహ, వాణిజ్య, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు బిల్లుల చెల్లింపులో నిబంధనలు పాటిస్తున్నారు. కానీ ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు మాత్రం రూ.కోట్లలో పెండింగ్‌లో ఉంటున్నాయి. విద్యుత్తు అధికారులు బకాయిలు ఉన్న కార్యాలయాలకు నోటీసులు పంపుతున్నా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. పుంగనూరు విద్యుత్తుశాఖ డివిజన్ పరిధిలో పుంగనూరు, సదుం, పలమనేరు సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి విద్యుత్తు ఛార్జీలు సక్రమంగా వసూళ్లు కావడం లేదు. బకాయిల వసూళ్లపై దృష్టిసారించామని పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు.




# కౌశలం.. సర్వర్ల విఘ్నం

కర్నూలు : పట్టణ ప్రాంతాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కౌశలం పేరిట ఇంటి నుంచే ఉద్యోగం (వర్క్ ఫ్రం హెూం) కల్పనకు చర్యలు చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతలను తేల్చేందుకు సచివాలయ ఉద్యోగులు చేపట్టిన సర్వే కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 68 శాతం మంది విద్యార్హతల ధ్రువపత్రాలను కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వీరికి ఈనెల 2వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో కౌశలం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**లక్ష మందికి అవస్థ**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,36,596 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను సచివాలయ సిబ్బంది కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రసుతం వీరందరికీ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో కౌశలం పరీక్ష నిర్వహిస్తున్నారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. రెండు పేపర్లు ఉంటాయి. కమ్యూనికేషన్ స్కిల్ అసెస్‌మెంట్‌కు 15 నిమిషాలు, స్కిల్ అసెస్‌మెంట్‌కు 45 నిమిషాలు కేటాయించారు. రోజుకు ఒకరిద్దరు



చొప్పున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తున్నారు.

అభ్యర్థి ఎక్కడి నుంచి పరీక్ష రాస్తున్నారో గుర్తించేందుకు వీలుగా లైవ్ లొకేషన్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంది. ఈ విధానంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

**అభ్యర్థులకు తప్పని పరీక్ష**పరీక్షకూ ఇబ్బందులు తప్పడం లేదు. సమస్య పరిష్కారానికి లైవ్ లొకేషన్ క్యాప్చర్ కోడ్‌ను తొలగించినా చాలాచోట్ల సర్వర్లు పనిచేయడం లేదు. సచివాలయాల్లోని కంప్యూటర్లకు యూపీఎస్, ఇన్వర్టర్ సదుపాయం లేకపోవడం వల్ల కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. మరోవైపు దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో పరీక్షకు గైర్హాజరవుతున్నారు. అనివార్య కారణాల వల్ల పరీక్ష రాయలేని అభ్యర్థులు వారికిచ్చిన లింక్‌లో ఆధార్ నంబరు ద్వారా రీషెడ్యూల్ చేసుకోవచ్చని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

# అడుగు దూరంలో.. ఆశల రేవు

నెల్లూరు: : దశాబ్దాల మత్స్యకారుల కల.. జువ్వలదిన్నె షిషింగ్ హార్బర్ ప్రారంభానికి ముహూర్తం కుదరడం లేదు. పనులు దాదాపు కొలిక్కి వచ్చినా.. దాని బాధ్యతను ఎవరు తీసుకోవాలన్న దానిపై ప్రతిష్టంభన నెలకొంది. మత్స్యశాఖ పేరు వినిపిస్తున్నా.. ఆ శాఖ సముఖంగా లేదు. ఒక వేళ తీసుకున్నా.. ప్రతి నెలా అయ్యే నిర్వహణ ఖర్చును ఏ పద్దు నుంచి భరించాలన్న దానిపై స్పష్టత కొరవడింది. ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులు కృష్ణబాబు, రాజశేఖర్‌లు



పరిశీలించి.. సాధ్యాసాధ్యాలపై సర్వే చేయిస్తున్నా... క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ పరిస్థితి కనిపించడం లేదు.

**దృష్టిసారించాల్సినవి ఎన్నో...**

బోగోలు మండలం జువ్వలదిన్నె సమీపంలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ దేశంలోనే అతిపెద్దది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు కొలిక్కి వచ్చినా.. బకింగ్‌హామ్ కెనాల్‌పై వంతెన నిర్మాణం, సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు తాగునీరు, విద్యుత్తు సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మత్స్యకారులకు రాయితీపై బోట్లు ఇచ్చే ప్రక్రియ పూర్తి కాలేదు. మెకనైజ్డ్ బోట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులను ఎదుర్కొనేందుకు అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బోట్లు అవసరమని భావిస్తున్నారు. వాటి ధర కూడా అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం హార్బర్‌కు వెళ్లే దారిలో వంతెన పూర్తి చేసేందుకు రూ. 2.75 కోట్లు మంజూరు చేసింది. పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రాజెక్టు ఫిషింగ్ హార్బర్

ప్రాంతం జువ్వలదిన్నె

నిధులు రూ.288.80 కోట్లు

విస్తీర్ణం 115.69 ఎకరాలు

జెట్టీ సామర్థ్యం 1250 పడవలు

నిర్మించిన భవనాలు 45

ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి 25వేల మంది

# వీధి ఒక్కటే.. జిల్లాలు రెండు

వరికుంటపాడు: అదో కుగ్రామం.. దానికి రెండు పేర్లు.. రెండు జిల్లాల పరిధి. వీధే హద్దు. ఇదీ వరికుంటపాడు మండలంలోని భోగ్యంవారిపల్లె ప్రత్యేకత. కొత్తవారు వెళితే ఇట్టే తికమకపడే ఈ గ్రామం 565వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. ఇందులో ప్రధాన వీధి ప్రకాశం జిల్లా సరిహద్దుగా ఉండగా– ఉత్తరం వైపున్న ప్రాంతాన్ని పామూరు మండలంలోని తిరగలదిన్నెగా.. దక్షిణం వైపున్న భాగాన్ని మండలంలోని భోగ్యంవారిపల్లెగా పిలుస్తారు. భోగ్యంవారిపల్లెకు ఏడు గృహాలు ఉంటే.. తిరగలదిన్నెలో 100 వరకు ఉన్నాయి. జిల్లాల సరిహద్దులు కావడంతో.. ఎన్నికల సమయంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పోలీసులు 565 జాతీయ రహదారిపై పక్క పక్కనే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుంటారు.

# ఆపరేషాన్ థియేటర్

నంద్యాల : ఆసుపత్రుల్లో అత్యంత కీలకమైన ఆపరేషన్ థియేటర్(ఓటీ) లో సరైన వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగుల ప్రాణాలను రక్షించే అత్యవసర, సంక్లిష్ట శస్త్రచికిత్సలు ఇందులో జరుగుతుంటాయి. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో గత నాలుగేళ్ల క్రితం ఉన్న వసతులే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీంతో శస్త్రచికిత్స లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

నంద్యాల సర్వజన ఆసుపత్రిలో రోజుకు 1200 నుంచి 1600 వరకు ఓపీ ఉంటుంది. అందులో శస్త్రచికిత్సల విభాగానికి సంబంధించి రోజుకు వందకు పైగానే ఓపీలు ఉంటాయి. అన్ని రక్త, ఇతర పరీక్షలు చేసిన తర్వాత శస్త్రచికిత్సలు అవసరమైతే వారిని ఆసుపత్రిలో చేర్చుకుంటారు. 24 గంటల ఓటీని ఏర్పాటు చేసినప్పటికీ సరైన వసతులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.

**ప్రత్యేకంగా లేకపోవడంతో...**

ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు లేవు. దీంతో ఉన్నవాటిలో ఆర్థో వైద్యులకు వారానికి నాలుగు రోజులు.. న్యూరో సర్జన్లకు రెండు రోజులు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అత్యవసరంగా పక్షవాతంతో వచ్చే రోగులకు శస్త్రచికిత్స చేయాలంటే వారికి కేటాయించిన రోజు వరకు




వేచి చూడాల్సిన పరిస్థితి వస్తోంది.

**ఏ విభాగంలో ఎలా..**

సర్వజన ఆసుపత్రిలో వైద్యులు ఉన్నప్పటికీ శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు, స్టెరిలైజర్లు, ఆధునిక శస్త్రచికిత్స సాధనాలు, మానిటర్లు, వెంటిలేటర్లు, లైటింగ్ వంటి ముఖ్యమైన సదుపాయాలు లేవు. శస్త్రచికిత్సల అనంతరం రోగిని ఉంచాల్సిన రికవరీ గదులు కూడా సరిగా లేవు. పవర్ బ్యాకప్‌లో లోపాలు, శానిటేషన్ సమస్యలు, తగిన సంఖ్యలో సాంకేతిక నిపుణులు లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. శస్త్రచికిత్సలు చేసే గదిలో ఏసీలు లేకపోవడంతో ఫ్యాన్లతో నెట్టుకొస్తున్నారు. అనస్థీషియా మందు ఇచ్చే యంత్రం ఉండాలి. కానీ లేకపోవడంతో అనస్థీషియా వైద్యుడు వచ్చే వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి. న్యూరోకు సంబంధించి తల శస్త్రచికిత్సకు, వెన్నెముక వంటి శస్త్రచికిత్సలకు అరకొర వసతులు ఉన్నాయి. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో నెలకు పది కూడా చేయడం లేదు.

# విసుగెత్తిపోతున్న పత్తిరైతు..!

లావేరు : పత్తి రైతులు పంట అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ జిల్లాకు సంబంధించి సాగు వివరాలు నమోదు చేసే సీఎం యాప్ ఓపెన్ కాకపోవడంతో సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడు నెలలుగా చాలా మంది పంటను ఇళ్లలోనే దాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. **ఇదీ పరిస్థితి..**


యాప్ పని చేయకపోవడంతో దళారులు దోచుకుంటున్నారు. పంట బాగుంటే క్వింటా రూ.4 వేల నుంచి రూ.5 వేల మధ్యలో కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో విజయనగరం జిల్లా రాజాంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకెళ్తే తిరిగి పంపిస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నిల్వ చేసుకుంటే రంగు మారి కష్టం వృథా అవుతోందని వాపోతున్నారు. యాప్ పని చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం: 1,970 ఎకరాలు

ఖరీఫ్ పంట వేసిన మండలాలు: లావేరు, కొత్తూరు, మందస, రణస్థలం, హిరమండలం, సరుబుజ్జిలి, పొందూరు, టెక్కలి, ఎచ్చెర్ల, జి.సిగడాం సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రకటించిన మద్దతు ధర రూ.8,110

**ఇందుకే తగ్గుముఖం..**

వర్షాల ప్రభావం, వాతావరణ ప్రతికూల పరిస్థితులతో ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎకరా పొలంలో పత్తి సాగు చేయాలంటే దుక్కి నుంచి ఎరువులు, విత్తనాలు, పురుగు మందు పిచికారీ, కూలీలు ఇతర పనులకు సుమారు రూ.30 వేల నుంచి




రూ.35 వేల వరకు ఖర్చవుతుంది. పంట బాగా పండితే ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల పండుతుంది. ప్రస్తుతం ఈ పరిస్థితి జిల్లాలో ఎక్కడా లేదు. ఫలితంగా క్రమేపీ సాగువిస్తీర్ణం తగ్గిపోతోంది.

**త్వరలోనే పరిష్కారం..**

– ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల

పత్తి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో సీఎం యాప్ పని చేయకపోవడం, పత్తి కొనుగోలు, రైతులు ఎదుర్కొంటున్న అంశాలను వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

# గ్రానైట్.. అక్రమాలకు రైట్‌రైట్



చిత్తూరు:కుప్పం.. ప్రశాంతతకు నిలయం. అలాంటి నియోజకవర్గాన్ని వైకాపా ప్రభుత్వం అక్రమాలు, అరాచకాలకు చిరునామాగా మార్చింది. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు సహజ వనరులను దోచుకుని రూ.కోట్లు సంపాదించుకొని వెళ్లారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రానైట్, మట్టి, బియ్యం అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నేతలున్నా ఉపేక్షించవద్దని హెచ్చరించారు. గనుల శాఖ యంత్రాంగం మాత్రం మొద్దునిద్ర నటిస్తోంది. విచ్చలవిడిగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా తర్వాత చూద్దాంలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అక్రమాల్లో ఆరితేరిన వైకాపా నాయకులే.. తెదేపా నేతలను ముందుండి నడిపిస్తుండటం గమనార్హం.

**చంద్రబాబు తనిఖీ చేసిన ప్రాంతంలోనే**

కుప్పం నియోజకవర్గంలో ఒక్క రామకుప్పంలో మినహా గుడుపల్లె, శాంతిపురం, కుప్పం పట్టణం, కుప్పం మండల పరిధిలో గ్రానైట్ నిక్షేపాలున్నాయి. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని కీలక ప్రజాప్రతినిధి, వైకాపాలో నంబరు 2 నేత అడ్డగోలుగా దందాలకు పాల్పడ్డారు. చివరకు ద్రవిడ విశ్వవిద్యాలయంలో కూడా అక్రమంగా తవ్వకాలు చేశారు. శాంతిపురం మండలం సి.బండపల్లిలో అటవీ శాఖ పరిధిలోని భూముల్లోనూ పేలుళ్లు జరిపి గ్రానైట్ వెలికి తీశారు. ఇక్కడ ముఖ్య ప్రజాప్రతినిధికి నెలకు రూ.లక్ష– రూ.2 లక్షలు మామూళ్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఈవిషయం ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో నాలుగేళ్ల క్రితం ఆయనే స్వయంగా వెళ్లి తనిఖీలు నిర్వహించారు. అనంతరం తమిళనాడు, కర్ణాటక సీఎంలకూ లేఖలు రాశారు. కుప్పం నుంచి వస్తోన్న గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. తాజాగా ఈ ప్రాంతంలోనూ కొందరు తవ్వకాలు ప్రారంభించడం విస్మయానికి గురి చేస్తోంది. వైకాపా హయాంలో నామినేటెడ్ పదవి పొందిన నేత అనుచరులు ఈ దందాలో కీలక భూమిక పోషిస్తున్నారు. తెర ముందు మాత్రం తెలుగు తమ్ముళ్లను ఉంచారు.

**నియోజకవర్గవ్యాప్తంగా 25కుపైగానే**

శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు, కోనేరుకుప్పం, గెసికపల్లి, 64– పెద్దూరు, 121.పెద్దూరు, సోమాపురం, సోలిశెట్టిపల్లె, సి.బండపల్లి, గుడుపల్లె మండలం పొగురుపల్లి, యామగానిపల్లి, కుప్పంలో శీగలపల్లి, తదితర ప్రాంతాల్లో అనధికారిక క్వారీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 25 చోట్ల అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. తమిళనాడు క్రిష్ణగిరిలోని పాలిషింగ్ యూనిట్లకు ఈ సంపద తరలుతోంది.

**అధికారులకూ వాటాలు**

అక్రమ రవాణాకు పచ్చజెండా ఊపినందుకు రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు సైతం వాటాలు అందుతున్నాయి. లారీలు పట్టుబడినప్పుడు నామమాత్రపు జరిమానాలు విధించడమే దీనికి నిదర్శనం. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పుడు మాత్రమే వీటిని పెంచుతున్నారు. ఇప్పటికైనా దాడులతోపాటు భారీగా జరిమానాలు విధిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

# నౌకల మరమ్మతుల కేంద్రంగా దుగరాజపట్నం



గూడూరు : నౌకల మరమ్మతులకు వాకాడు మండలం దుగరాజపట్నం తీర ప్రాంతం కేంద్రం కానుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో భాగంగా ఇక్కడ ఓడరేవు నిర్మించాలని తలపెట్టినా అభ్యంతరాల కారణంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. మళ్లీ ఈ ప్రాంతాన్ని నౌకల మరమ్మతు, నిల్వల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది.

**భూసేకరణలో యంత్రాంగం**

రాష్టంలో నౌకల మరమ్మతులు, నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ లేదు. కేరళలోని కొచ్చిన్, ముంబయితోపాటు గుజరాత్‌లో ఉన్న షిప్‌యార్డులపై ఆధారపడాల్సి వస్తోంది. రాష్టంలో విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మూలపేట, రామయపట్నం, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా వందల మిలియన్ టన్నుల సరకు రవాణా జరుగుతోంది. నౌకల మరమ్మతులు, నిర్వహణ కోసం భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో భాగంగా షిప్ బ్రేకింగ్ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ పనులు జరుగుతున్నాయి

**పోర్టు ప్రాక్సిమల్ ప్రాంతంగా**

దుగరాజపట్నం సముద్ర తీరం నుంచి 100 కి.మీ దూరంలో ఉన్న ప్రాంతాలను పోర్టు ప్రాక్సిమల్ ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాంతంలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పనకు ఏపీ మారిటోరియం బోర్డు తయారు చేసి కేంద్రానికి పంపారు. దీని సమీపంలో ఉన్న గ్రామాలను పోర్టు ఆధారిత సమగ్ర ఆర్థిక నగరాలుగా అభివృద్ధి చేస్తారు. నౌకల మరమ్మతుల కేంద్రానికి అనుబంధంగా మెరైన్ సెజ్, రోబోటిక్ షిప్‌యార్డు మాడ్యులర్ డ్రై డాక్‌యార్డులు, ఏకోసిస్టమ్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. కేంద్రం కూడా ఆమోదం తెలిపింది.

**మారనున్న రూపురేఖలు**

ఈ ప్రాంతంలోని వాకాడు, చిట్టమూరు, కోట, నాయుడుపేట మండలాల్లోని గ్రామాలు అభివృద్ధి చెందనున్నాయి. మౌలికవసతులు మెరుగుపడటంతోపాటు స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయి.

మొత్తం పెట్టుబడి: రూ.3 వేల కోట్లు

సేకరిస్తున్న భూములు: 5.028 ఎకరాలు

ఉద్యోగ అవకాశాలు: 10 వేలు

# గోదాముల్లో ఇంటి గుట్టు



కర్నూలు : గత వైకాపా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం కొనుగోలు చేసిన రూ.కోట్లాది విలువైన ఇంటి సామగ్రి ఎందుకూ పనికిరాకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యం.. సమన్వయ లోపంతో ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు చేరకుండా నిరుపయోగంగా మారింది. ఇంటి నిర్మాణానికి పనికి రాకుండా పోతుండగా.. మరికొంత మాయమవుతోంది. సిమెంట్ గడ్డకట్టుకుపోయి పాడైంది.

**వానకు తడిసి**

లబ్ధిదారుడికి కిలో రూ.65 చొప్పున 343 కిలోల ఇనుము సరఫరా చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాకు 20 లక్షల కిలోల ఇనుము కొనుగోలు చేశారు. అందులో 10.53 లక్షల కిలోలు లబ్ధిదారులకు విక్రయించారు. మరో 9.46 లక్షల కిలోల నిల్వలున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో లక్ష కిలోలకు పైగా స్టీల్ మాయమైందని స్థానికులు అంటున్నారు. మిగిలిన స్టీల్ కూడా ఎండకు ఎండి.. వానకు తడిసి పాడైపోయింది. రూ.6.10 కోట్ల విలువైన స్టీల్ పనికి రాకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు.

**యూనిట్ రూ.20 వేలు**

14 రకాలు కలిపి ఒక యూనిట్ చేసి రూ.20 వేల ధరగా నిర్ణయించారు. ఇందులో ట్యాంకులు తప్ప మిగిలిన అన్ని రకాల సామగ్రి తెప్పించారు. రెండు జిల్లాలకు 7 వేలకు పైగా యూనిట్లను కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 2,500 యూనిట్లను లబ్ధిదారులకు విక్రయించారు. ఇందులో సుమారు 4,500 యూనిట్లు ఉన్నాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సుమారు రూ.9 కోట్ల విలువైన సరకు గోదాముల్లో మూలుగుతోంది.

**సిమెంటు గడ్డకట్టిపోయి..**

గత ప్రభుత్వంలో ఒక సిమెంట్ బస్తా రూ.236 చొప్పున ఒక్కో లబ్ధిదారుడికి 90 బస్తాల సిమెంట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో సుమారు 23.05 లక్షల సిమెంట్ బస్తాలను ఆయా కంపెనీల నుంచి కొనుగోలు చేసి మండల కేంద్రాల్లో గోదాములకు చేర్చారు. అందులో లబ్ధిదారులకు 22.75 లక్షల బస్తాల సిమెంట్‌ను విక్రయించగా.. మరో 30 వేల బస్తాలు ఉండాల్సి ఉంది. అందులో 15 వేల బస్తాల వరకు మాయం కాగా.. మరో 15 వేల బస్తాలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**టన్నుల ఇనుప కడ్డీలు అదృశ్యం**

కోసిగి మండలానికి 109 టన్నుల ఇనుము రాగా.. అందులో ఇప్పుడు 27 టన్నులు మాత్రమే గోదాములో ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. పాత రైతు భరోసా కేంద్రం ఆవరణలో నాలుగేళ్లుగా ఎండ, వానకు తడిచి తుప్పపట్టి పాడైపోయాయి. బయట పెట్టడంతో గతంలో గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న గోదాములో 294 సిమెంట్ బస్తాలు నిల్వ ఉంచారు. సంచులన్నీ గడ్డకట్టి పనికిరాకుండా పోయాయి. రూ.2.75 కోట్ల విలువ చేసే సామగ్రి మాయమైనట్లు సమాచారం. ప్రస్తుతం రూ.16.15 కోట్ల విలువైన ఇంటి సామగ్రిని గోదాములో పెట్టారు.

# ఇఫ్కో.. ప్రగతికి మార్గమిదిగో!

నెల్లూరు: జిల్లా పారిశ్రామిక రంగంలో మరో మేలి అడుగు పడింది. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రాచర్లపాడు సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రత్యేక ఆర్థిక మండలికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భూములిచ్చిన వారికి పరిహారం చెల్లింపు అంశాలు కోర్టులో ఉన్నా.. ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో గతంలో ఎరువుల పరిశ్రమ కోసం తీసుకోగా.. ప్రస్తుతం పారిశ్రామిక పార్కుగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు పరిశ్రమల ఏర్పాటుకు ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం.




**పరిశ్రమలను ఆకర్షించేలా..**

ఇఫ్కో సెజ్ జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం.. రైలు, రోడ్డు, వాయు, జల మార్గాల ద్వారా రవాణా అవకాశాలు పుష్కలంగా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారని అధికారులు భావిస్తున్నారు. మొత్తం రూ. 870 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసును కూడా జారీ చేశారు. ఇప్పటికే మూడు ప్రధాన సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాగా.. రూ. 356 కోట్లతో రామ్కీ బయో ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు డిసెంబరు 30న పర్యావరణ అభిప్రాయ సేకరణ జరగనుంది.

దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలను అందించనుంది. ఈ సెజ్‌తో ఎంఎస్‌ఎంఈ/ఎస్‌ఎంఈలకు, స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయి. పార్కు పూర్తిగా అభివృద్ధి చెందితే కావలి–నెల్లూరు మధ్య కీలక ఆర్థిక కారిడార్‌గా మారుతుంది' అని అన్నారు.

# సకాలంలో చికిత్సే కీలకం..

విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో 'స్క్రబ్ టైఫస్' కేసులు పెరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. తాజాగా వ్యాధి లక్షణాలతో దేవరాపల్లికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి మరణించడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే 'స్క్రబ్ టైఫస్'పై ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇది కొత్తగా వచ్చిన వ్యాధి కాదని, సకాలంలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

కలెక్టర్ సూచనల మేరకు వైద్యులు, సిబ్బందితో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్‌ఆర్‌టీ)లు ఏర్పాటు చేశారు. ఒకే ప్రాంతంలో ఐదు కంటే ఎక్కువ కేసులుంటే ఆ బృందం వెళ్లి పరీక్షిస్తుంది.

ఇక్కడే ఎందుకంటే..ఈ ఏడాది ఇప్పటివరకు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 200కు పైగా కేసులు బయటపడ్డాయి. అందులో ఎక్కువ శాతం విశాఖలోవే.

జిల్లాలో ఆసుపత్రులు, ప్రయోగశాలలు ఎక్కువగా ఉన్నాయి. మెరుగైన వైద్య సదుపాయాలుండటంతో అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి అనుమానిత లక్షణాలున్న బాధితులు ఎక్కువగా ఇక్కడికి వస్తున్నారు. దీంతో ఇక్కడే కేసులు ఎక్కువగా బయట పడుతున్నాయి. అందులో అధిక భాగం కేజీహెచ్‌లో నిర్ధారణ అవుతున్నాయి.

మరోవైపు రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు నమోదైన జాబితాలో విశాఖ ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సూచించారు.

లక్షణాలు..అకస్మాత్తుగా 99 డిగ్రీలకు పైగా జ్వరం, అలసట, తలనొప్పి, వాంతులు, దద్దుర్లు, శరీరంపై నల్లటి మచ్చలు.

అలా.. గుర్తించారుఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన మైక్రోబయాలజీ విభాగ వైద్యులు గతేడాది దీనిపై పరిశోధన చేశారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు కేజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరిన మొత్తం 507 మంది అనుమానితుల నమూనాలు పరీక్షించారు. అందులో 49 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా గుర్తించారు. బాధితుల్లో మహిళల (30.6 శాతం) కంటే పురుషులే (69.4 శాతం) ఎక్కువగా ఉన్నారు. వారిలో ఆరుగురు జ్వరం రావడానికి ముందు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. వారిలోనూ యువత ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిర్లక్ష్యం చేస్తేనే సమస్య..

'స్క్రబ్ టైఫస్'పై భయపడాల్సిన అవసరం లేదు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. జ్వరం వచ్చిన 3 నుంచి 5 రోజుల్లో పరీక్షలు చేయించుకోవాలి. త్వరగా గుర్తించకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతుంది' అని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు.

# నిబంధనలకు నీళ్లు.. నచ్చినట్టు వసూళ్లు!

అనకాపల్లి : జిల్లాలోని వందల సంఖ్యలో క్వారీలు ఉన్నా.. గతంలో ప్రభుత్వానికి సీనరేజ్ రూపంలో ఒక్క రూపాయి కూడా ఆదాయం వచ్చేది కాదు. దీంతోపాటు అధికారిక క్వారీల్లో పరిమితికి మించి తవ్వేసేవారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం.. అక్రమ మైనింగ్, రవాణాను అడ్డుకట్ట వేసేందుకు సీనరేజ్ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించేసింది. దీంతో ఆ సంస్థ జిల్లాలో పలుచోట్ల అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఈ చెక్‌పోస్టుల్లో ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు.

అంచనా ప్రకారం లెక్కేసి.. నిబంధనల ప్రకారం క్వారీలున్న ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలి. గ్రానైట్, గ్రావెల్, క్రషర్, నల్లరాయి, మెటల్ రవాణా వాహనాలకు వే బిల్లు లేకపోతే.. వాటి నుంచి సీనరేజ్ వసూలు చేయాలి. కానీ.. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు వద్ద ఎక్కడా వే బ్రిడ్జిలు లేవు. వాహనంలో ఎంత పరిమాణంలో సరకు వెళ్తోందో కూడా చూడటంలేదు. అంచనా ప్రకారం లెక్కలేసి.. డబ్బులు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇవ్వమంటే.. వాహనాన్ని కదలనీయడం లేదు. కొన్నిచోట్ల వాహనాల వెంట ద్విచక్రవాహనాలపై వెంబడించి మరీ నిలుపుదల చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల పాయకరావుపేట మండలంలోని సత్యవరానికి చెందిన పడాల కృష్ణ సమీపంలోని క్వారీ బూడిదను పశువుల పాకను ఎత్తుచేసేందుకు ట్రాక్టర్‌తో తీసుకెళ్తుండగా.. ఇద్దరు బైక్‌పై వచ్చి ఆపారు. ట్రాక్టర్ బూడిదకు రూ. 800 ఇవ్వాలని ముక్కుపిండి వసూలు చేశారు.

రసీదులు ఇవకుండానే..కాంట్రాక్టు పొందిన సంస్థ ముద్రించిన బిల్లులు కూడా ఇవ్వడంలేదు. కొన్నిచోట్ల చేతి రాతతో.. వాహనం నంబర్, సమయం, తేదీ, చెక్‌పాయింట్ పేరు రాసి అదే రసీదంటూ డ్రైవర్ చేతిలో పెట్టేస్తున్నారు.

# చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లు..!

ఇండస్ట్రీ ఏదైనా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాతోనే సూపర్ హిట్ దక్కించుకోవడం అనేది చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. ఒకవేళ అలా మొదటి సినిమాతోనే సూపర్ హిట్‌ను సొంతం చేసుకుంటే ఆ హీరోయిన్ వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం రాదు. వరుస సినిమా ఆఫర్లు దక్కించుకుని కెరీర్‌లో దూసుకు పోవడం మనం చూస్తూ ఉంటాం. ఆ తర్వాత కెరీర్ గురించి పక్కన పెడితే వరుసగా నాలుగు అయిదు సినిమాలకు సైన్ చేయడం మనం చూస్తూ ఉంటాం. కానీ అర్జున్ రెడ్డి వంటి బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న హీరోయిన్ షాలిని పాండే పాపం కెరీర్ పరంగా ఏమాత్రం ముందుకు సాగలేక పోయింది. షాలిని పాండే మొదటి సినిమా హిట్ అయినా ఆ తర్వాత నుంచి ఆఫర్లు పెద్దగా రాలేదు. ఆ సినిమాలో ఆమె పోషించిన పాత్ర కారణంగా ఆఫర్లు రాలేదా... మరేదైనా కారణమా అనే విషయమై ఇప్పటికీ చర్చ జరుగుతూనే ఉంది.

**అర్జున్ రెడ్డి హీరోయిన్‌కి ఆఫర్లు...** అందంతో పాటు, ప్రతిభ ఉన్న నటి అయినప్పటికీ షాలిని పాండేకు దక్కాల్సిన గుర్తింపు, స్టార్‌డం దక్కలేదు అని ఆమె అభిమానులు అంటూ ఉంటారు. సోషల్



మీడియాలో ఆమెను ఫాలో అయ్యే లక్షల మంది ఆమెకు ఇంకాస్త మెరుగ్గా సినిమా ఆఫర్లు రావాల్సింది అనే అభిప్రాయంను వ్యక్తం చేస్తారు. ముందు ముందు అయినా ఈ అమ్మడికి వరుస ఆఫర్లు వస్తాయి అనే విశ్వాసంతో ఎదురు చూస్తున్నారు. సోషల్ మీడియాలో ఆమె రెగ్యులర్‌గా షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోలు, వీడియోల కారణంగా ఎప్పటికప్పుడు వైరల్ అవుతూనే ఉంటుంది. ఆ సమయంలో ఈమెకు కచ్చితంగా హీరోయిన్‌గా మంచి భవిష్యత్తు ఉందని చాలా మంది అనుకుంటూ ఉంటారు. తీరా చూస్తే సినిమా ఆఫర్లు కనుమరుగు అవుతూ ఉంటాయి. కనీసం చిన్న సినిమాల్లో నటించే అవకాశాలు రాకపోవడంతో ఈ అమ్మడు ఆఫర్ల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**సోషల్ మీడియాలో అందాల ఫోటోలు...** సోషల్ మీడియాలో ఎప్పటి మాదిరిగానే తాజాగా మరో అందమైన ఫోటో షూట్ ను షాలిని పాండే షేర్ చేసింది. వైట్ డ్రెస్‌లో సాధారణంగానే అమ్మాయిలు మరింత అందంగా కనిపిస్తూ ఉంటారు. షాలిని పాండే విభిన్నమైన ఈ వైట్ ఔట్ ఫిట్‌ను ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి నిరూపితం అయ్యింది. క్లీవేజ్ షో చేస్తూ చూపు తిప్పనివ్వకుండా అందంగా కనిపిస్తున్న షాలిని పాండే ఈ ఔట్ ఫిట్ లో అంతకు మించి అన్నట్లుగా ఉందని పలువురు అంటూ ఉన్నారు. ఇక ఈ ఫోటోల్లో షాలిని కాస్త బక్క చిక్కినట్లు గా అనిపిస్తుంది. అందుకే నెటిజన్స్ ఈ అమ్మడు చిక్కినా అందంగానే ఉంది అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. చక్కన్నమ్మ చిక్కినా అందమే అంటూ మరికొందరు సోషల్ మీడియా ద్వారా ఈ ఫోటోలు షేర్ చేస్తూ తెగ కామెంట్స్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

# రుక్కు కోసం స్టార్స్ వెయిటింగ్..?

కన్నడ భామ రుక్మిణి వసంత్ ఇప్పుడు సూపర్ ఫామ్ కొనసాగిస్తుంది. కన్నడలో అమ్మడు చేస్తున్న సినిమాలు సూపర్ హిట్ అవ్వడమే కాదు ఆమెకు సౌత్ లో బీభత్సమైన క్రేజ్ తెచ్చాయి. కాంతారా చాప్టర్ 1లో కనకావతి రోల్ లో అమ్మడి పర్ఫార్మెన్స్, గ్లామర్ అన్నీ రుక్మిణికి మరింత పాపులారిటీ తెచ్చాయి. అందుకే అమ్మడికి వరుస ఆఫర్లు వస్తున్నాయి. ఆల్రెడీ ఈ అమ్మడు ఎన్ టీ ఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్ ప్రాజెక్ట్ లో నటిస్తుంది. ఈ సినిమాలో రుక్మిణికి కూడా మంచి రోల్ దక్కినట్టు తెలుస్తుంది.

**టాలీవుడ్ లో వరుస స్టార్ హీరోలతో రుక్మిణి వసంత్..** రుక్మిణి వసంత్ ఎన్టీఆర్ తర్వాత టాలీవుడ్ లో వరుస స్టార్ హీరోలతో జత కట్టే ఛాన్స్ ఉందని తెలుస్తుంది. అమ్మడికి తెలుగులో కూడా సూపర్ క్రేజ్ ఏర్పడింది. రష్మిక, పూజా హెగ్డే లాంటి వాళ్లను వెనక్కి నెట్టి రుక్మిణి ప్రస్తుతం ట్రెండింగ్ లో ఉంటుంది. అందుకే స్టార్స్ కూడా ఆమెకే



ఓటేస్తున్నారు. రుక్మిణి వసంత్ ఎన్ టీ ఆర్ సినిమా రిలీజ్ అవ్వడమే ఆలస్యం నెక్స్ట్ లిస్ట్ లో అల్లు అర్జున్, రామ్ చరణ్ కూడా ఉన్నారని తెలుస్తుంది. సుకుమార్ చరణ్ కాంబినేషన్ సినిమాలో రుక్మిణి వసంత్ నే హీరోయిన్ గా తీసుకునే అవకాశం ఉందని తెలుస్తుంది. ఇక అల్లు అర్జున్, అట్లీ మూవీ తర్వాత నెక్స్ట్ సినిమాకు యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉన్న రుక్మిణి వసంత్ నే తన సినిమాలో తీసుకోవాలనే ప్లానింగ్ ఉందట. సో రుక్మిణి ఈ కొత్త జోడీలు ఫ్యాన్స్ కి సూపర్ ఎంటర్టైన్మెంట్ అందిస్తాయి. ఐతే రుక్మిణి వసంత్ కేవలం స్టార్ హీరోలతోనే కాదు తెలుగులో మంచి లవ్ స్టోరీస్ చేయాలని ఆడియన్స్ కోరుతున్నారు.

**సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో..** సప్త సాగరాలు దాటి సినిమాలో ప్రియ పాత్రలో అలరించిన రుక్మిణి తెలుగులో కూడా అలాంటి లవ్ స్టోరీస్ ని చేస్తే బెటర్ అని భావిస్తున్నారు. కమర్షియల్ సినిమాలు చేసినా ఆమె మార్క్ నటనతో ఆకట్టుకుంటే మాత్రం రుక్మిణి నెక్స్ట్ టాలీవుడ్ బిగ్ స్టార్ అయ్యే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు. తెలుగులో నిఖిల్ తో అప్పుడో ఇప్పుడో ఎప్పుడో సినిమా చేసింది కానీ అది ఎలా వచ్చిందో అలానే వెళ్లింది. అందుకే ఎన్ టీ ఆర్ సినిమాతో అమ్మడు గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలని ఫిక్స్ అయ్యింది. కన్నడలో పాపులారిటీ ఉన్న రష్మిక తెలుగులో కాస్త ఫామ్ రాగానే అక్కడ సినిమాలు తగ్గించింది ఐతే రుక్మిణి మాత్రం తెలుగు సినిమాలు చేసినా కూడా కన్నడ ఛాన్స్ లను మాత్రం అసలు వదిలేదని అంటుంది. మరి అమ్మడు అక్కడ ఇక్కడ ఎలా బ్యాలెన్స్ చేస్తుంది అన్నది చూడాలి.




# రాజా సాబ్ పై అవతార్ ఎఫెక్ట్.. అందుకే అక్కడ అలా..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్ లో రూపొందుతున్న మూవీ ది రాజా సాబ్. హారర్ కామెడీ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమా.. వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతి పండుగ కానుకగా వరల్డ్ వైడ్ గా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో సందడి చేయనుంది. ఇప్పటికే సినిమాపై ఆడియన్స్ లో భారీ అంచనాలు క్రియేట్ అవ్వగా.. వాటిని అందుకుంటామని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకు తగ్గట్టే హార్డ్ వర్క్ కూడా చేస్తున్నారు. అయితే సినిమాను 2026 జనవరి 9వ తేదీన ఐమాక్స్ వెర్షన్‌తో సహా అన్ని ఫార్మాట్ లలో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుందని ఇప్పటికే తెలిపారు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన టీజర్, గ్లింప్స్ కూడా ఐమ్యాక్స్ లో రిలీజ్ చేశారు.

దీంతో మూవీ ఐమ్యాక్స్ వెర్షన్ కోసం అంతా వెయిట్ చేస్తున్నారు. అయితే ఓవర్సీస్ లో ఆ ఫార్మాట్ లో ఇప్పుడు రాజా సాబ్ సినిమా రిలీజ్ అవ్వడం లేదని తెలుస్తోంది. ఈ మేరకు డిస్ట్రిబ్యూషన్ సంస్థ పోస్ట్ పెట్టింది. ఓవర్సీస్ ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా సినిమాస్.. విదేశాల్లో రాజాసాబ్ ను రిలీజ్ చేయనుంది. అయితే ఇప్పుడు ఓవర్సీస్ లో ఐమ్యాక్స్ ఫార్మాట్ లో రాజా సాబ్ రిలీజ్ అవ్వడం లేదని సోషల్ మీడియాలో తెలిపింది. అవతార్ 3, ఐమ్యాక్స్ మధ్య నాలుగు వారాలు ప్రత్యేక ఒప్పందం ఉండడమే అందుకు కారణంగా వెల్లడించింది. అందుబాటులో ఉన్న అన్ని PLF, DBOX, ఇతర ప్రత్యేక ఫార్మాట్ ల్లో సినిమా చూడండని కోరింది. అయితే ఆ ఫార్మాట్ లు కూడా నాలుగు వారాల పాటు అవతార్ 3తో ఒప్పందం చేసుకుని ఉన్నాయని, కానీ ఎప్పటిలాగే వీలైనన్ని ఎక్కువ ప్రత్యేక ఫార్మాట్ షోలను పొందేందుకు తాము తీవ్రంగా కృషి చేస్తున్నామని ప్రత్యంగిరా తెలిపింది. నిజానికి.. అవతార్ -3 మూవీ డిసెంబర్ 19వ తేదీన రిలీజ్ అయ్యింది. రాజా సాబ్.. జనవరి 9వ తేదీన విడుదల అవ్వనుంది. రెండింటికి మధ్య నాలుగు వారాల కన్నా తక్కువ గ్యాప్ ఉంది. కాబట్టి ఇప్పటికే అవతార్ మేకర్స్.. ఐమ్యాక్స్ తో ఒప్పందం చేసుకోవడంతో రాజా సాబ్ పై ఆ ఎఫెక్ట్ పడింది. ఐమ్యాక్స్ ఫార్మాట్ లో రిలీజ్ కావడానికి వీలు లేకుండా పోయింది. దీంతో కొందరు ఓవర్సీస్ ఫ్యాన్స్ నెట్టింట నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

# రియాలిటీ చెడకుండానే విజువల్ మాయాజాలం



భారతదేశంలో నెవ్వర్ బిఫోర్ అని చెప్పుకునేలా ఒక భారీ చిత్రం 2027లో విడుదలకు వస్తుంది. ఇది వార్నర్ బ్రదర్స్ సినిమాలాగా, కామెరూన్ సినిమాలాగా ఆశ్చర్యపరుస్తుందని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ఇది ఏ సినిమానో ఈపాటికే అర్థమై ఉంటుంది. కచ్చితంగా అది ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి. సూపర్ స్టార్ మహేష్ - ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలలో నటిస్తున్న ఈ సినిమాని ఇండియానా జోన్స్ లైన్స్ లో అత్యంత భారీగా రూపొందిస్తున్నారు. ఈ చిత్రం కోసం దాదాపు 900కోట్ల మేర బడ్జెట్ ని ఖర్చు చేస్తున్నారని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. అడవులు, కొండలు కోనల్లో ఈ సినిమా కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తూ దర్శకధీరుడు అంచనాల్ని మరింత ఎక్కువగా పెంచారు. ఇప్పుడు ఎంపిక చేసుకున్న కాన్వాసు, బడ్జెట్ దృష్ట్యా కూడా ఈ సినిమా రాజమౌళి తెరకెక్కించిన అన్ని ఇతర చిత్రాల కంటే అత్యంత భారీతనంతో కళ్లు మిరుమిట్లు గొలిపే ట్రీట్ ఇస్తుందని అంచనా వేస్తున్నారు. ఇలాంటి సమయంలో రాజమౌళి అనుయాయుడు అయిన దర్శకరచయిత దేవకట్టా ఓ మాట చెప్పారు. ఇది ఈగ, బాహుబలి, ఆర్.ఆర్.ఆర్ లను మించి విజువల్ మాయాజాలంతో కట్టిపడేస్తుందని, కాన్వాస్ మరో లెవల్ లో ఉంటుందని చెబుతున్నారు. అంతేకాదు, విజువల్ గ్రాఫిక్స్, ఎఫెక్ట్స్ తో తెరకెక్కించినా ఎక్కడా వాస్తవికత చెడకుండా లాజిక్స్ మిస్ కాకుండా ఉంటుందని దేవకట్టా చెప్పారు. అంతేకాదు సన్నివేశాల్లో ఎమోషన్ కూడా ఎక్కడా డ్రాప్ అవ్వదని అన్నారు. మొత్తానికి వారణాసి గురించి దేవకట్టా చెబుతున్న విషయాలు మరింత క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఈసారి బడ్జెట్, స్కేల్ దృష్ట్యా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ మార్కెట్ ని దృష్టిలో పెట్టుకుని నిర్మించారని కూడా అర్థం చేసుకోవచ్చు. ఆస్కార్ విన్నింగ్ సినిమా తీసిన డైరెక్టర్ గా అతడి పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగుతోంది. గోల్డెన్ గ్లోబ్స్, హాలీవుడ్ క్రిటిక్స్ పురస్కారాలను కూడా తెచ్చిన ఘనత జక్కన్నకే చెందుతుంది. భారతదేశంలో ఇప్పటివరకూ ఏ ఇతర దర్శకుడికి చేతకాని దానిని కూడా తనకు మాత్రమే సాధ్యమవుతుందని నిరూపించాడు. అందుకే వారణాసి చిత్రంపై ఇప్పుడు అత్యంత భారీ అంచనాలేర్పడ్డాయి. ఇటీవల విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ ఇంటర్నెట్ లో చాలా రికార్డులను బ్రేక్ చేసిన సంగతి తెలిసిందే.

# రకుల్ స్విమ్ సూట్ హొయలు.. ఇది నెవ్వర్ బిఫోర్ లుక్

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్, గ్లామర్ విషయంలో ఎప్పుడూ తగ్గేదే లేదని నిరూపిస్తోంది. ఫిట్?నెస్?కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఈ బ్యూటీ, తన లేటెస్ట్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెంచేసింది. ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం ఆమె ఇచ్చిన పోజులు కుర్రాళ్ళ మనసులను దోచేస్తున్నాయి. ఈ ఫొటోషూట్‌లో రకుల్ నీలి రంగు స్విమ్ సూట్ తరహా డ్రెస్ లో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆ డ్రెస్‌లో ఆమె గ్లామర్ ను హైలెట్ చేస్తూనే తన చూపులతో కూడా ఎట్రాక్ట్ చేసింది. ఆమె గ్లామర్ హొయలు చూసేవారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. స్విమ్మింగ్ పూల్ పక్కన నిలబడి, తీక్షణమైన చూపులతో ఆమె విసిరే గ్లామర్ బాణాలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు.




ఈ లుక్‌ను మరింత ఎలివేట్ చేయడానికి రకుల్ బంగారు ఆభరణాలను ఎంచుకుంది. మెడలో లేయర్స్‌గా ఉన్న గోల్డ్ చైన్స్, చేతికి బ్రాస్లెట్స్, వేళ్లకు రింగులు ధరించి రాయల్ లుక్?ను సొంతం చేసుకుంది. మోడ్రన్ అవుట్‌ఫిట్‌కి ట్రెడిషనల్ టచ్ ఇస్తూ ఆమె చేసిన ఈ ప్రయోగం ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కెరీర్ పరంగా చూస్తే రకుల్ ప్రస్తుతం ఫుల్ స్వింగ్‌లో ఉంది. ముఖ్యంగా బాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా గడుపుతోంది. త్వరలో రాబోతున్న ఒక సినిమాలో ఆమె పాత్రపై భారీ అంచనాలు ఉన్నాయి. పెళ్లి తర్వాత కూడా గ్లామర్ షోలో ఏమాత్రం వెనక్కి తగ్గకుండా, మరింత రెట్టింపు ఉత్సాహంతో దూసుకుపోతోంది. సోషల్ మీడియాలో ఈ ఫొటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. లీడింగ్ లేడీ అనే ట్యాగ్‌తో మ్యాగజైన్ ఆమెను కవర్ పేజీపై ప్రచురించడం ఆమె క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఫిట్?నెస్, అందం, అభినయం కలగలిసిన రకుల్, రాబోయే రోజుల్లో ఇంకెన్ని సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.

# వాళ్లిద్దరి బాండింగ్ ఎంత స్ట్రాంగ్ అంటే?

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా-రైటర్ జహీర్ ఇక్బాల్ ప్రేమించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ జంట ధాంపత్య జీవితం సంతోషంగా సాగిపో తుంది. అయితే సోనాక్షి...జహీర్ ని పెళ్లి చేసుకోవడం ఇంట్లో ఇష్టం లేదనే కథనాలు తెరపైకి వచ్చాయి. కొన్ని రకాల అసమానతలు కారణంగా సోనాక్షి కుటుంబ సభ్యులకు ఇష్టం లేనట్లు వార్తలొచ్చాయి. ఈ వివాహం ఎంతో నిరాడం బరంగా జరిగింది. ఇరు పెద్దల సమక్షంలోనే వివాహం జరిగింది. ఈ వేడుకలో సోనాక్షి సోదరుడు కనిపించలేదు. దీంతో సోనాక్షి పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించినా? సోదరుడికి ఇష్టం లేదన్నది ప్రధానంగా హైలైట్ అయింది.

**ప్రేమలో ఉన్నప్పుడే కలహాలు:** ఇదంతా పక్కన బెడితే ఆ జంట ఇప్పుడు ఎంతో అన్యోన్యంగా ఉంది. అయితే ఈ జోడీ ప్రేమలో ఉన్న సమయంలోనే అన్నిరకాల ఎడబాట్లు చూసేసింది. మూడేళ్ల ప్రేమలో ఎన్నో గొడవలు జరిగినట్లు సోనాక్షి గుర్తు చేసుకుంది. ఒకర్ని ఒకరు తిట్టు కోవడం నుంచి కొట్టు కోవడం వరకూ మనస్పర్ధల వరకూ వెళ్లారు. కానీ విడిపోవాలి అనే ఆలోచన రానివ్వలేదంది. ఆ సమయంలో కపుల్స్ థెరపీకి వెళ్దామని జహీర్ సలహా ఇవ్వడంతో రెండు సిట్టింగ్స్ లోనే ఇద్దరి మధ్య తలెత్తిన అన్ని వివాదాలకు ఫుల్ స్టాప్ పడిందంది.



అన్ని విషయాలను నెగిటివ్ గా చూడకూడదన్నది అర్థమైందంది.

**ఆ రెండింటినీ బ్యాలెన్స్ చేయాలి:** ఏ విషయాన్ని ఎలా ట్రీట్ చేయాలి? అని తెలిసినా కొన్ని క్షణాలు పాజిటివ్ గా ఆలోచించడం కంటే నెగిటివిటీనే బ్రెయిన్ కోరుకునేదంది. అప్పుడే సరైన నిర్ణయా లు తీసుకున్నామంది. నెగిటివ్..పాజిటివిటీని రెండింటిని బ్యాలెన్స్ చేసినప్పుడే జీవితం సంతోషంగా ఉంటుందని తన అనుభవాన్ని చెప్పుకొచ్చింది. దీంతో సోనా క్షి-జహీర్ ల బాండింగ్ ఎంత బలంగా మారిందన్నది ఈ సన్నివేశంతో తేటతెల్ల మవుతోంది. ప్రేమ పేరుతో లివ్ ఇన్ రిలేషన్ షిప్స్ లో ఉండటం..కొన్నాళ్ల తర్వాత విడిపోవడం ఎంతో మంది జీవితాల్లో చూసినదే.

**టాలీవుడ్ లోనూ లాంచ్ అయింది:** పెళ్లి అయిన తర్వాత కూడా విడిపోవడం అన్నది సెలబ్రిటీ లైఫ్ లో సహజంగా మారిపోయింది. చిన్న చిన్న కారణాలతోనే బంధాలు వీగిపోతున్నాయి. మనస్ప ర్ధలు, సరైన సఖ్యత లేకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వీటన్నింటిని సోనాక్షి-జహీర్ దంపతులు దాటుకుని వచ్చిన నేపథ్యంలో? ఆ బంధం మరింత బలంగానూ మారుతుందన్నది విశ్లేషకుల మాట. ఇక సోనాక్షి కెరీర్ సంగతి చూస్తే? అమ్మడు బాలీవుడ్ లో ఇంకా స్టార్ లీగ్ లో చేరలేదు. నటిగా అనుకున్నంత గుర్తింపు దక్కలేదు. ఇటీవలే జఠాధర సినిమాతో తెలుగులోనూ లాంచ్ అయిన సంగతి తెలిసిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536